ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ప్రకాశం 5

జిల్లా వార్తలు

ఆదివారం 30, జూన్ 2024

పింఛన్ రూ.7000

» రేపు ఇళ్ల వద్దనే పంపిణీ
» ఒకే రోజు అందరికీ ఇచ్చేలా ఏర్పాట్లు
» సచివాలయ సిబ్బంది ద్వారా అందజేత
» కేడర్ కూడా పాల్గొనాలని టీడీపీ అధిష్ఠానం ఆదేశం
» కొండపిలో అధికారులతో మంత్రి స్వామి సమీక్ష
» సీఎస్‌కు వీసీలోనూ వివరించిన కలెక్టర్





ఒంగోలు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ పేరుతో టీడీపీ అధినేతగా చంద్రబాబు నాయుడు ప్రకటించిన హామీల్లో పేదలకు భరోసా ఇచ్చే పింఛన్ల పెంపునకు ప్రభుత్వం ఆమోదముద్ర వేయగా సోమవారం నుంచి పంపిణీ జరగనుంది. ఇప్పటివరకు అందుతున్న నెలవారీ పింఛన్ రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచడంతోపాటు ఎన్నికల నోటిఫికేషన్ ముందు ప్రకటించిన విధంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల బకాయిలు రూ.3వేలు కలిపి సోమవారం లబ్ధిదారులకు రూ.7వేలు అందించనున్నారు. జిల్లాలో 2.91 లక్షల మందికి పెంచిన ప్రకారం సుమారు రూ.199.07 కోట్లు అందనుంది. మొత్తం రూ.7వేలు జూలై 1నే ఇవ్వనున్నారు. ఉదయం ఆరుగంటల నుంచే సచివాలయాల సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు అందజేసేలా ప్రభుత్వం ఆదేశించడంతో తదనుగుణంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లాలో ఏర్పాట్లు చేశారు. జూలై 1ఉదయం ఆరు గంటలకే పంపిణీ ప్రారంభించాల్సి ఉండటంతో శనివారమే సచివాలయాల వారీ డబ్బు డ్రా చేశారు.

శనివారమే డ్రా.. సిబ్బందికి అందజేత

సచివాలయ సంక్షేమ సహాయకుడు, మరో సిబ్బంది సంయుక్తంగా నిధులు డ్రా చేసి ఇతర సిబ్బందికి కేటాయించిన లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా వారి జాబితాలు, సదరు మొత్తాలను శనివారం సాయంత్రమే అందజేశారు. సచివాలయ సిబ్బంది సరిపోనిచోట అదనంగా రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బందికి బాధ్యతలను అప్పగించారు. జిల్లాలో పింఛన్ పంపిణీ ఏర్పాట్లను శనివారం సాయంత్రం సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా వివరించారు.

పండుగలా పంపిణీ చేయాలి

పింఛన్‌ను భారీగా పెంచి బకాయిలు కూడా కలిపి ఇవ్వనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని టీడీపీ అధిష్ఠానం నిర్ణయించింది. గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి నాయకుల వరకు అందరూ విధిగా పింఛన్ల పంపిణీ సమయంలో లబ్ధిదారుల ఇళ్లకు సిబ్బందితో వెళ్లాలని ఆదేశించింది. తదనుగుణంగా ఎక్కడికక్కడ ఆ పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొనేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అందులోభాగంగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి తాను ప్రాతినిధ్యం వహించే కొండపి నియోజకవర్గంలోని అధికారులతో కొండపిలో శనివారం సమీక్ష నిర్వహించారు. పింఛన్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. సోమవారం ఆయన కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇతర నియోజకవర్గాల్లోనూ స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధులు తదనుగుణ ఏర్పాట్లలో ఉన్నారు.



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట, హాజరైన ప్రజాప్రతినిధులు (ఇన్‌సెట్‌లో) వేదికపై జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ



జిల్లాలో ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసిన నీటి బిల్లుల కోసం జడ్పీటీసీ సభ్యులు గగ్గోలు పెట్టారు. రెండేళ్ల నుంచి బిల్లులు రావాల్సి ఉందని, అందువల్ల వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పాలకులకు విన్నవించారు. శనివారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఐదు అంశాలపై చర్చించినా కేవలం రెండింటి మీదనే కొంతమేర చర్చ నడిచింది. అందులోనూ అధికంగా ఆర్‌డబ్ల్యూఎస్‌పై ఎక్కువ సమయం జరగ్గా కొంతమేర విద్యాశాఖ మీద సాగింది. జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నా అందుకు సంబంధించి సభ్యులు నోరుమెదపకపోగా డీఆర్‌డీఏపై మాత్రం ముగ్గురు సభ్యులు కొంతసేపు మాట్లాడారు. అంతకు మినహా జిల్లాలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు, ఇతరవర్గాలకు మేలుచేసే అంశాలపై చర్చ కరువైంది.

బిల్లుల కోసం గగ్గోలు

వస్తాయో లేదోనని సభ్యుల ఆందోళన

గత వైసీపీ ప్రభుత్వ తప్పిదాలను కూటమి సర్కార్‌పై వేసే ప్రయత్నం

» ఎం.బుక్‌లు తయారు చేసి న్యాయం చేయాలని విన్నపాలు
» ప్రస్తుత సమస్యలపై జరగని చర్చ » మొక్కుబడిగా జడ్పీ సమావేశం

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 29 : జడ్పీ సమావేశం మొక్కుబడిగా సాగింది. గత వైసీపీ ప్రభుత్వ హయంలో నీటి బిల్లులు భారీగా పెండింగ్‌లో పెట్టినా పట్టించుకోని అప్పటి ప్రజాప్రతినిధులు ప్రస్తుతం జరిగిన సమావేశంలో మాత్రం హడావుడి చేశారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో శనివారం జడ్పీ సర్వసభ్య సమావేశానికి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షత వహించారు. 2022 అక్టోబరు నుంచి నీటి బిల్లులు చెల్లించకుండా గత ప్రభుత్వం నిలుపుదల చేసింది. ఆ విషయాన్ని కప్పిపుచ్చేందుకు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై నిందలు వేసేందుకు సభ్యులు ప్రయత్నించడం చర్చనీయాంశమైంది. నీటి బిల్లుల కారణంగా ట్యాంకర్ల యజమానులు నష్టపోకుండా ఉండేందుకు ఎం.బుక్‌లను తయారుచేసి ఇవ్వాలని కోరారు. బిల్లులు రాకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, అందువల్ల తమకు న్యాయం చేసే విధంగా చూడాలని కొంతమంది సమావేశంలో డిమాండ్ చేసినట్లుగా మాట్లాడటం విశేషం. కాగా సభ్యులు అడిగిన కొన్ని అంశాలపై జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ వచ్చే సమావేశం నాటికి ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అలా పలు ప్రాంతాలకు చెందిన సభ్యులు గత ప్రభుత్వంలో నిలిపివేసిన బిల్లుల కోసం తాపత్రయపడటం తప్ప ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై చర్చించేందుకు సమావేశాన్ని వినియోగించుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది. ఈ సమావేశంలో ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. సమావేశం మొత్తం నిరుత్సాహంగా, చప్పగా సాగింది.

పూర్తిస్థాయిలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయాలి

జిల్లాలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో కిట్లు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మండలకేంద్రాల్లోని పాయింట్ల వద్ద కిట్లను స్టాకు పెట్టుకోవడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులకు సకాలంలో కిట్లు పంపిణీ చేయడం ద్వారా మేలు జరుగుతుందనే విషయాన్ని గుర్తించాలన్నారు.

బిల్లుల కోసం ఆందోళన వద్దు

నీటి బిల్లుల కోసం ఎలాంటి ఆందోళన వద్దని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు అన్నారు. ప్రభుత్వం బిల్లులను నిలుపుదల చేస్తే జడ్పీలో మనమే ఎక్కువమంది ఉన్నామని, ఇక్కడ కూడా కుదరని పక్షంలో శాసనమండలిలో మన సభ్యులే ఉన్నారని తెలిపారు. అక్కడ కూడా న్యాయం జరగకపోతే కోర్టుకు వెళ్దామని భరోసా కల్పించే ప్రయత్నం చేశారు.

నీటి బిల్లులు చెల్లించాలి

నీటి బిల్లులు చేయకుండా అడ్డుకుంటున్నారని త్రిపురాంతకం జడ్పీటీసీ సభ్యుడు మాకం జాన్‌పాల్ అన్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిడి వల్లనే ఇదంతా జరుగుతుందన్నారు. బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దర్శి, పైపాలెం నియోజకవర్గంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు పరిహారం ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

సంతకాలు పెట్టేందుకే వస్తున్నామా!

జడ్పీటీసీ సభ్యునిగా కేవలం సంతకాలు పెట్టేందుకే మీటింగుకు వస్తున్నామా..? అని కనిగిరి జడ్పీటీసీ సభ్యుడు కస్తూరిరెడ్డి అన్నారు. లింగారెడ్డిపల్లి జడ్పీ హైస్కూల్‌లో నాడు-నేడు కింద 80శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. అయితే ఆ పాఠశాల ఊరి మధ్యలో ఉన్నందున ప్రహరీ లేకపోవడంతో కుక్కలు, పందులు తిరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రహరీ కోసం అనేకసార్లు కోరినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'ఉపాధి'లో అవినీతిపై సమగ్ర విచారణ చేయాలి

ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని గిద్దలూరు జడ్పీటీసీ సభ్యుడు మధుసూదన్ డిమాండ్ చేశారు. అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. పట్టుపరిశ్రమల షెడ్ల మంజూరు విషయంలో అధికారులు అనుసరించిన విధానం సరైంది కాదన్నారు. వెంటనే వాటిని మంజూరుచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఒక వ్యక్తి రెండు ఉద్యోగాలు చేయవచ్చా?

ఒక వ్యక్తి రెండు ఉద్యోగాలు ఎలా చేస్తారని కారంచేడు జడ్పీటీసీ సభ్యురాలు కాట్రగడ్డ రజని ప్రశ్నించారు. ఆసరా పథకం కింద అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేస్తే ఒక్కో సభ్యురాలి వద్ద నుంచి రెండు వందలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదుచేశారు. వీవోఏ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని అనేక సార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు.

అవినీతిపై విచారణ చేయించాలి

కొమరోలు మండల సీసీగా పనిచేస్తున్న రవి రూ.52లక్షల మేర అక్రమాలకు పాల్పడ్డారని అనేక సార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని ఆ మండల జడ్పీటీసీ సభ్యుడు వెంకటనాయుడు అన్నారు. డ్వాక్రా మహిళల డబ్బులను స్వాహా చేశారని ఆరోపించారు. మోటు వద్ద ఉన్న పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించాలని, కొమరోలు ఉన్నత పాఠశాలకు సబ్జెక్టు టీచర్లను నియమించాలని కోరారు.

మోడల్ స్కూళ్లలో సీట్లను పెంచాలి

దర్శి నియోజకవర్గంలోని మోడల్ స్కూళ్లలో హాస్టల్ సీట్లు పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. ముండ్లమూరు మోడల్ స్కూలుకు హాస్టల్ లేని కారణంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లాలో నాడు-నేడు కింద చేసిన వాటర్ ప్లాంట్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎం సహకారంతో జిల్లా అభివృద్ధి

» వెలిగొండతోపాటు రైల్వే ప్రాజెక్టు, హైవే నిర్మాణానికి చర్యలు
» ఒంగోలు ఎంపీ మాగుంట

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో శాసనసభ్యులతో కలిసి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేస్తామని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. జిల్లా పరిషత సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సహకారం అందించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనను ఐదోసారి ఎంపీగా గెలిపించినందుకు జిల్లాకు రుణపడి ఉంటానన్నారు. సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ సహకారంతో జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంతోపాటు జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నడికుడి-శ్రీకళాహస్తి రైల్వేలైనును సకాలంలో పూర్తిచేసే విధంగా చూస్తామన్నారు. దర్శి వరకు ప్రస్తుతం రైలు వచ్చిందని, త్వరలో కనిగిరి వరకు రాకపోకలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్రప్రభుత్వం నుంచి కూడా జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి ఆ పనులను కూడా త్వరగా పూర్తిచేయిస్తామని హామీ ఇచ్చారు.



వైద్య శిబిరం ఏర్పాట్లను పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మి

నేడు దర్శిలో ఉచిత మెగా వైద్యశిబిరం

» సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పిలుపు

వివరాలు లోపలి పేజీల్లో..

ప్రజాధనం దుర్వినియోగంపై నిలదీత

» మునిసిపల్ సమావేశంలో లేవనెత్తిన టీడీపీ కౌన్సిలర్ కొండయ్య
» సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్

వివరాలు లోపలి పేజీల్లో..

సక్రమంగా జరిగేనా?

» పల్లామల్లి సొసైటీలో విచారణపై నీలినీడలు
» విచారణాధికారి తీరుపైనే అనుమానాలు
» ప్రక్రియను అడ్డుకోవాలంటూ నిందితులకే ఆయన సలహాలు
» సదరు సీఈవోకే వేధింపులు.. భరించలేక డీసీవోకు ఫిర్యాదు



పల్లామల్లి సొసైటీ భవనం

ఒంగోలు(విద్య), జూన్ 29 : చీమకుర్తి మండలం పల్లామల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరమితి సంఘం(సొసైటీ)లో ఆర్థిక అవకతవకలు, అక్రమాలపై జరుగుతున్న విచారణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల ప్రకారం సొసైటీ అక్రమాలపై విచారణ సక్రమంగా జరిగేనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కంచే చేను మేసిన చందంగా విచారణను పారదర్శకంగా నిర్వహించి నిధులు స్వాహా చేసిన వారి నుంచి ముక్కుపిండి రికవరీ చేయాల్సిన విచారణాధికారి తీరుపై ఆరోపణలు వస్తున్నాయి. విచారణను చేపట్టకపోవడమే కాకుండా ఏకంగా అతనే అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేయడం అందరినీ విస్మయపరుస్తోంది. నిందితులను హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోమనడం, లాయర్లతో సంప్రదింపులు జరపడం తెలిసి అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. సొసైటీ సీఈవో జీ.వి.నారాయణ జిల్లా సహకారాధికారికి ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం మొత్తం కొత్తమలుపు తిరిగింది. వివరాల్లోకి వెళితే.. పల్లామల్లి సొసైటీలో రూ.కోటికిపైగా నిధులను కైంకర్యం చేశారు. ఆడిటర్ సమర్పించిన నివేదికతో ఈ అక్రమాల బాగోతం వెలుగులోకి వచ్చింది. దీనిపై సహకార సంఘాల చట్టం 196 సెక్షన్ 51 ప్రకారం సమగ్ర విచారణకు ఆడిటర్ సిఫార్సు చేశారు. దీంతో అప్పుడు జిల్లా సహకారాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఈసీవో పి.రాజశేఖర్ సొసైటీ అక్రమాలపై విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ బీవీఎస్ కృష్ణశాస్త్రిని నియమించారు. నాలుగు నెలల్లో అంటే ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే నివేదిక ఇవ్వాల్సి ఉండగా ఇవ్వలేదు. మరో రెండు నెలలైనా పట్టించుకోకపోవడంతో డీసీవో ఆయనకు మెమో జారీ చేశారు. అయినప్పటికీ ఇప్పటికీ ఆయన విచారణ చేపట్టలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

విచారణను అడ్డుకునేందుకు...

విచారణ జరగకుండా స్వయంగా విచారణాధికారే ప్రయత్నాలు చేయడం విస్తుగొలుపుతోంది. హైకోర్టుకెళ్లి విచారణపై స్టే తెచ్చుకోమని సొసైటీ సీఈవోకు సలహా ఇచ్చారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. హైకోర్టు అడ్వకేట్ వేణుగోపాల్‌ను సంప్రదించారు. ఆయన కేసులో విచారణపై స్టే రాదని తేల్చిచెప్పడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ఎఫ్ఏసీ డీసీవోగా విచారణకు ఆదేశించేందుకు అధికారం లేదని, సమాచారహక్కు చట్టం ద్వారా కమిషనర్ కార్యాలయానికి వేరే వారి ద్వారా దరఖాస్తు చేయించారు. అయితే కమిషనర్ కార్యాలయం విచారణకు ఆదేశించే హక్కు ఉందని తేల్చిచెప్పడంతో ఆ ప్రయత్నాలు విరమించుకొని సొసైటీ సీఈవోపై వేధింపులు ప్రారంభించారు.

డీసీవోకు ఫిర్యాదుచేసిన సీఈవో

విచారణాధికారి వ్యవహారంపై సొసైటీ సీఈవో నారాయణ డీసీవోకు ఫిర్యాదు చేశారు. విచారణను అడ్డుకునేందుకు విచారణాధికారి చేసిన ప్రయత్నాలకు సంబంధించిన ఆడియో సంభాషణ వైరల్ కావడంతో అందరూ ఆశ్చర్యపోయారు. కృష్ణశాస్త్రి తనను అసభ్యపదజాలంతో దూషిస్తున్నారని, గత నవంబరు నుంచి తనకు జీతం ఇవ్వనందున కుటుంబ పోషణ భారమైందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణాధికారి వేధింపులు తట్టుకోలేకపోతున్నానని, తనను సస్పెండ్ చేయాలని డీసీవోను వేడుకున్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన డీసీవో శ్రీనివాసరెడ్డి పల్లామల్లి సొసైటీకి వెళ్లి నారాయణను విచారించి మనోధైర్యం చెప్పి వచ్చారు. ఈ విషయమై డీసీవోను వివరణ కోరగా నారాయణ ఫిర్యాదుపై సమగ్ర విచారణ నిర్వహించి వెంటనే కలెక్టర్‌కు నివేదికను సమర్పిస్తామని చెప్పారు.

యుద్ధ విన్యాసాల్లో అపశ్రుతి

» జిల్లాకు చెందిన జవాన్ రామకృష్ణారెడ్డి మృతి
» కాలువపల్లిలో విషాదం

గిద్దలూరు, జూన్ 29 : రాచర్ల మండలం కాలువపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ ముత్తుముల రామకృష్ణారెడ్డి (46) మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. లడక్‌లో ఇండియన్ ఆర్మీ యుద్ధ విన్యాసాలు చేస్తుండగా ఐదుగురు జవాన్లు యుద్దట్యాంక్‌తో సహా నీటిలో కొట్టుకుపోయారు. ఈ ఐదుగురిలో రామకృష్ణారెడ్డి కూడా ఉన్నారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. నీటిలో కొట్టుకుపోయిన వారి కోసం ఆర్మీ అధికారులు హెలికాప్టర్లతో రాత్రంతా గాలించారు. శనివారం ఉదయం ఐదుగురి మృతదేహాలు ఒక ప్రాంతంలో నీటిలో తేలయాడుతూ కనిపించాయి. వాటిని వెలికితీయగా అందులో రామకృష్ణారెడ్డి మృతదేహం కూడా ఉంది. ఆర్మీ అధికారులు ఆ మేరకు కుటుంబీకులకు సమాచారం అందించారు. దీంతో రామకృష్ణారెడ్డి కుటుంబం అంతులేని ఆవేదనకు గురైంది. సెలవుపై ఎప్పుడు వచ్చినా చిన్నా పెద్ద తేడా లేకుండా అందరినీ పలుకరించే రామకృష్ణారెడ్డి ఇక లేరని తెలుసుకున్న గ్రామస్థులు ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయారు. ఆయన మృతదేహాన్ని కాలువపల్లెకు తెచ్చేందుకు ఆర్మీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

అందరూ దేశసేవకే

కాలువపల్లికి చెందిన రామకృష్ణారెడ్డి తండ్రి రామస్వామిరెడ్డి కూడా ఇండియన్ ఆర్మీలో జవాన్‌గా పనిచేశారు. రామస్వామిరెడ్డికి ఇద్దరు కుమారులు కాగా పెద్దకుమారుడు పెద్దగంగిరెడ్డి స్థానికంగానే ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నారు. ఒకరినైనా దేశసేవకు పంపాలన్న రామస్వామిరెడ్డి కలను నిజం చేస్తూ రామకృష్ణారెడ్డి ఆర్మీలో చేరారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడిని నేవీలో చేర్పించగా ప్రస్తుతం ఆఫీసర్ ర్యాంక్‌లో ఉన్నారు. చిన్న కుమారుడు బీటెక్ చదువుతున్నారు. దేశసేవకు అంకితమైన ఆ కుటుంబంలో ప్రమాదవశాత్తు చోటుచేసుకున్న ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.



రామకృష్ణారెడ్డి (ఫైల్)

కలెక్టర్‌కు మాగుంట శుభాకాంక్షలు


కలెక్టర్ తమీమ్ అన్సారియాకు బొకే అందజేస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 29: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమీమ్ అన్సారియాను ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి శనివారం అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో అన్సారియాను ఎంపీ మాగుంట మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో ఆయన పలు అంశాలపై చర్చించారు.

కలెక్టర్‌ను కలిసిన సర్పంచ్‌ల సంఘం

జిల్లా సర్పంచ్‌ల సంఘం నాయకులు కలెక్టర్ తమీమ్ అన్సారియాను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు మొక్కను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మన్నం శ్రీనివాస్, రాముయాదవ్, భాగ్యమ్మ, కోట్య, శాంసన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అవయవదానంపై అవగాహన సదస్సు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఏడుకొండలరావు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 29: ఒంగోలులో ఆదివారం జరగనున్న అవయవ దాన అవగాహన సదస్సు కరపత్రాలను శనివారం స్థానిక రిమ్స్ వైద్యకళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు ఆవిష్కరించారు. ప్రకాశం నేత్ర, అవయవ, శరీర దాన ప్రోత్సాహకులైన ఐక్యవేదిక, ఒంగోలు అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకుల సంఘం, ధమ్మచక్ర ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సంతపేటలోని కృష్ణప్రియ కన్వెన్షన్ సెంటర్, బచ్చలబాలయ్య సంజీవమ్మ ధార్మిక భవన్‌లో సదస్సు జరుగుతుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు, హరిత ప్రకాశం ఫౌండేషన్ నాయకుడు పి.మోహనరావు, బి.కృష్ణ, జి.కోటేశ్వరరావు, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

ఒంగోలు(క్రైం), జూన్29: రైలు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం ఒంగోలు రైల్వేస్టేషన్‌లోని ఉత్తరం వైపున జరిగింది. వివరాలలోకి వెళితే.. స్థానిక క్లోపేటలో నివాసం ఉంటున్న కొమ్ము రాములమ్మ (65)రైలు పట్టాలు దాటి రాజీవ్‌గృహకల్పలో ఉండే తన కుమార్తె ఇంటికి వెళుతుండగా ప్రమాదానికి గురైంది. రైలు పట్టాలు దాటుతుండగా గూడ్సు రైలు ఢీకొట్టడంతో రాములమ్మ అక్కడిక్కడే మృతి చెదింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్లను పండుగలా పంపిణీ చేయాలి

● మంత్రి స్వామి


జరుగుమల్లిలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

జరుగుమల్లి (కొండపి), జూన్ 29: లబ్ధిదారులకు పింఛన్లను పండుగలా పంపిణీ చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. జరుగుమల్లిలోని టీడీపీ కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పింఛన్‌దారులందరికీ వచ్చేనెల 1వ తేదీన ఇళ్ల వద్దనే నగదును అధికారులు అందజేస్తారని తెలిపారు. పార్టీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు కూడా పాల్గొనాలని సూచించారు. భవిష్యత్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ రుణాలు ప్రభుత్వం నుంచి ఆయా కార్పొరేషన్‌ల ద్వారా పెద్దఎత్తున సబ్సిడీపై అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రజలు వివిధ సమస్యలపై స్వామికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పైడిపాడు ఎస్సీ కాలనీలోని స్కూల్‌లో గతంలో 5వ తరగతి వరకూ ఉండేదని, దాన్ని వైసీపీ ప్రభుత్వం ఒకటి, రెండు తరగతులకే పరిమితం చేసిందని మాజీ ఎంపీపీ పేముల విజయనిర్మల మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మిగతా తరగతులు రెడ్డిపాలెం స్కూల్‌లో కలపడం వల్ల విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆమె తెలిపారు. సానుకూలంగా స్పందించిన స్వామి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ బెల్లం సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, నాయకులు ఏలూరి రాంబాబు, కొమ్మాలపాటి కృష్ణ, పాతూరి కోటేశ్వరరావు, చదలవాడ బ్రహ్మేంద్రం, నరసింగరావు, సుబ్బారెడ్డి, నరాల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో టీడీపీ నేతల సమావేశం


అధికారులతో చర్చిస్తున్న నాయకులు

టంగుటూరు: పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఊరూరా వేడుకగా నిర్వహించాలని టీడీపీ నాయకులు నిర్ణయించుకున్నారు. ఈ విషయమై అధికారులతో కలిసి శనివారం చర్చించారు. టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు శనివారం స్థానిక గ్రామ సచివాలయం-4 సిబ్బందితో సమావేశమయ్యారు. టంగుటూరు పంచాయతీ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ ప్రతి 40 మంది లబ్ధిదారులకు ఒక సచివాలయ ఉద్యోగిని కేటాయించామని, వారు చాలని చోట అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్ల ద్వారా పింఛన్‌ను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా కామని విజయకుమార్ మాట్లాడుతూ పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొనాలని సూచించారు. 3వేల నుంచి 4వేలకు పెంచిన పింఛన్‌లు, బకాయిలు రూ.3వేలు కలిపి ఒకేసారి రూ.7వేలు ఇస్తున్నందున ప్రతి గ్రామంలో ఒకచోట ప్రారంభ వేడుక నిర్వహించాలని పేర్కొన్నారు.

అధికారులూ..బాధ్యతగా పనిచేయండి !

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించం ● పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు ● మంత్రి స్వామి హెచ్చరిక



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

కొండపి, జూన్ 29: అధికారులు ప్రజలకు జవాబుదారీతనంతో పారదర్శకత పాటిస్తూ బాధ్యతగా పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. స్థానిక పొదిలి రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణమండపంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు. తొలుత అధికారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వచ్చేనెల 1వ తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఏవిధంగా ప్రణాళిక రూపొందించుకున్నారన్నది ఎంపీడీవోలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బందితోపాటు ప్రభుత్వ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించి ఒత్తిడి లేకుండా 1వ తేదీ సాయంత్రానికి లబ్ధిదారులందరికీ పింఛన్ సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారికి సీఎంవో లేఖతోపాటు నగదు రశీదు ఇవ్వాలన్నారు. పింఛన్‌ల పంపిణీలో అవకతవకలు జరిగినా, డబ్బులు తగ్గించి ఇచ్చినా, కమీషన్‌లు వసూలు చేసినా చర్యలు తప్పవని స్వామి హెచ్చరించారు. మర్రిపూడి మండలంలోని జంగాలపల్లె స్కీం నుంచి తాగునీరు అందించాలని, నియోజవకర్గంలో తెగిపోయిన చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వల్లూరు చెరువులో రోడ్డు వేసినా, తాను ఫిర్యాదు చేసినా ఇరిగేషన్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించారని, ఇకపై ఉపేక్షించేది లేదన్నారు. వర్షాకాలం కనుక ఆరోగ్య సిబ్బంది ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, స్కూళ్లలో తాగునీరు, పారిశుధ్య చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు సుబ్బారెడ్డి, జాన్‌ఇర్విన్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, సింగరాయకొండ సీఐ రంగనాథ్, ఆరు మండలాల అధికారులు పాల్గొన్నారు.

కట్టుకున్న వాడే కడతేర్చాడు!

మరో వ్యక్తితో కలిసి భర్త ఘాతుకం
పెదవెంకన్నపాలెంలో మృతి చెందిన మహిళది హత్య అని తేల్చిన పోలీసులు
నిందితుల అరెస్టు
కనిగిరి డీఎస్పీ రామరాజు వెల్లడి



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రామరాజు, సీఐ, ఎస్సైలు

పొన్నలూరు(కొండపి), జూన్ 29: పొన్నలూరు పోలీసు స్టేషన్ పరిధిలోని పెదవెంకన్నపాలెంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మహిళది హత్య అని తేలింది. ఆమె భర్త మరో వ్యక్తితో కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితులిద్దరినీ అరెస్టు చేశారు. వివరాలను కనిగిరి డీఎస్పీ రామరాజు శనివారం పొన్నలూరు పోలీసుస్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం రెడ్డిపాలెం గ్రామంలోని దాట్లవారిపాలెం కాలనీకి చెందిన బోయిన ఆదిలక్ష్మి, ఆమె భర్త బోయిన ఆదినారాయణ అలియాస్ ఆదెయ్య మరికొందరు కూలీలతో పనుల కోసం పొన్నలూరు మండలం పెదవెంకన్నపాలెం వచ్చారు. భార్యపై అనుమానంతో ఆమెను హతమార్చాలని ఆదెయ్య పథకం పన్నాడు. ఈ ఏడాది మార్చి 15న ఆదిలక్ష్మి ఇంట్లో పడుకొని ఉండగా మరో కూలి గుత్తికొండ బుజ్జిబాబుతో కలిసి ఆదెయ్య ఆమె గొంతు నులిమి చంపేశాడు. అనంతరం ఇద్దరూ పరారయ్యారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నివేదికలో ఆమెను గొంతునులిమి చంపినట్లు బయటపడింది. దీంతో కుటుంబ సభ్యులు, సహచర కూలీలను పోలీసులు విచారించగా అసలు విషయం వెలుగు చూసింది. దీంతో నిందితుల కోసం గాలింపు చేపట్టారు. శనివారం సాయంత్రం పొన్నలూరు బస్టాండ్ వద్ద ఆదెయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు గుత్తికొండ బుజ్జిబాబును పెదవెంకన్నపాలెం-విప్పగుంట అడ్డరోడ్డు వద్ద అరెస్ట్ చేశారు. వారిద్దరూ నేరాన్ని అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. అనంతరం కందుకూరు కోర్టులో హాజరుపర్చారు. కేసును ఛేదించిన కొండపి సీఐ పాండురంగారావు, పొన్నలూరు ఎస్సై రాజేష్, ఇతర సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రక్తనాళాల్లోని గడ్డల తొలగింపునకు ఆధునిక వైద్యం

● అపోలో వైద్యుడు వైవీసీ.రెడ్డి


మాట్లాడుతున్న డాక్టర్ వైవీసీ.రెడ్డి

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 29 : కరోనరీ ధమనుల్లోని బ్లాక్‌లను చికిత్స ద్వారా తొలగించే అత్యంత అధునాత వైద్యం ఇప్పుడు చెన్నై అపోలో హాస్పిటల్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు ప్రముఖ కార్డియాలజిస్ట్, బ్రిటీష్ కామన్వెల్త్ స్కాలర్ డాక్టర్ వై.విజయచంద్రారెడ్డి (వైవీసీ.రెడ్డి) తెలిపారు. శనివారం ఒంగోలులోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో గుండె సమస్యలు పెరుగుతున్నాయన్నారు. గుండె నిరంతరాయంగా పనిచేసే కండరాల పంపు పనితీరు బాగుంటేనే మనిషి జీవితం బాగుంటుందని తెలిపారు. కాగా కరోనరీ ఆర్టరీ డిసీజ్ లేదా సీఏడీ అనేది రక్తనాళాల్లో బ్లాక్‌లు ఏర్పడే వ్యాధి అని చెప్పారు. రక్తనాళాల లైనింగ్ కింద చెడు లేదా ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ పేరుకుపోవడం, కాల్షియం నిక్షేపణ, సెల్యూలార్ విస్తరణ, నెకోరటిక్ కోర్ ఏర్పడటం గుండె సమస్యలకు కారణమన్నారు. అయితే ఆధునాతన యంత్ర పరికరాలతో హార్డ్ బ్లాక్‌లకు చికిత్సను ఇప్పుడు అపోలోలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. టెలీ రోబోటిక్ పీసీఐ యాంజియో ప్లాస్టీ విధానాలలో వందల మైళ్ళ దూరంలో ఉన్న రిమోట్ కార్డియాక్ కాథెటరైజేషన్ ల్యాబ్ ద్వారా గుండె పనితీరు మెరుగుపరచడం, బ్లాక్‌లను గుర్తించి గుండె పనితీరు మెరుగుపరచడం జరుగుతుందని డాక్టర్ వైవీసీ.రెడ్డి తెలిపారు.

కూటమి విజయంతో
కనకదుర్గమ్మ చెంతకు..

పొన్నలూరు (కొండపి), జూన్ 29 : రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతోపాటు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి హ్యాట్రిక్ విజయం సాధించి మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో మండలంలోని నాగిరెడ్డిపాలెం ఎస్టీ కాలనీవాసులు విజయవాడ కనకదుర్గమ్మకు మొక్కులు చెల్లించుకునేందుకు శనివారం బయల్దేరి వెళ్లారు. వీరికి పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పార్టీ ఎస్టీ సెల్ ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి రాపూరి కోటేశ్వరమ్మ, కంటు గోపి, గుమ్మళ్ల వెంకట్రావు, కొర్రపాటి సురేంద్ర, కొర్రపాటి మమత, దాసరి కొండలరావు పాల్గొన్నారు.


మొక్కు చెల్లించుకునేందుకు వెళుతున్న ఎస్టీ కాలనీవాసులు

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.360


పొగాకు వేలంలో పాల్గొన్న బయ్యర్లు

టంగుటూరు, జూన్ 29 : టంగుటూరు వేలం కేంద్రంలో పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.360 పలికింది. ఎం.నిడమలూరు గ్రామ రైతులకు సంబంధించి 1,131 బేళ్లను సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు శనివారం వేలానికి అనుమతించారు. వీటిలో 1,092 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. కనిష్ఠ ధర కిలో రూ.205 నిలకడగా కొనసాగుతోంది. సరాసరి ధర రూ.300 దాటి శనివారం రూ.304.95కు చేరింది. కొనుగోళ్లలో 24 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు.

పింఛన్‌ల పంపిణీకి అంతా సిద్ధం : ఎంపీడీవో

టంగుటూరు, జూన్ 29 : టంగుటూరు మండలంలో పింఛన్‌ల పంపిణీకి అంతా సిద్ధం చేశామని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలో మొత్తం 9,555 మంది లబ్ధిదారులు ఉండగా వారికి రూ.7కోట్ల వరకూ ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ నగదు ఇప్పటికే విడుదలైందన్నారు. గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు శనివారమే నగదు బ్యాంకుల నుంచి డ్రా చేశారని చెప్పారు. ప్రతి గ్రామ సచివాలయ ఉద్యోగికి 40 మంది లబ్ధిదారులను కేటాయించామని, సోమవారం లబ్ధిదారులందరికీ పింఛన్ పంపిణీని పూర్తి చేస్తామని చెప్పారు.

అవీ..ఇవీ..

రేపటి నుంచి టీచ్‌టూల్ శిక్షణ

ఒంగోలు(విద్య), జూన్ 29 : తరగతి గది పరిశీలన నిమిత్తం ఏర్పాటు చేసిన టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమం జిల్లాలో జులై ఒకటో తేదీ నుంచి ప్రారంభమవుతుందని డీఈవో సుభద్ర శనివారం తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన ఐదు కేంద్రాల్లో ఈ శిక్షణ జరుగుతుందన్నారు. తొమ్మిదిరోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ జరుగుతుంది. ఒంగోలు డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కులు, కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, దర్శి జడ్పీ బాలికోన్నత పాఠశాల, గిద్దలూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, మార్కాపురం జడ్పీ హైస్కూలులో శిక్షణ నిర్వహిస్తారు. జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన 425 మంది పరిశీలకులకు శిక్షణ ఇస్తారు. ప్రతిరోజు ఉదయం 9నుంచి సాయంత్ర ఐదున్నర గంటల వరకు జరుగుతుందన్నారు. శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయులను ఎంఈవోలు, ఉప విద్యాధికారులు రిలీవ్ చేసి పంపించాలని డీఈవో ఆదేశించారు.

ట్రెజరీ ఉద్యోగికి సత్కారం


కమలాకర్‌ను సత్కరిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 29: జిల్లా ట్రెజరీ శాఖలో 33 ఏళ్ళ పాటు పని చేసి ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్న సీహెచ్. కమలాకర్‌ను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సత్కరించారు. ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కమలాకర్‌ను సత్కరించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాజా రాజ్‌కుమార్, ట్రెజరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీవీ.నారాయణ, అబ్దుల్‌ఖాదర్, జె.వెంకటేశ్వర్లు, పి.కోటిసు ధీర, అస్మత్‌బేగ్, కొండలరావు, రాజు, సుజాత, రాజ్యలక్ష్మి, డార్విన్, శ్రీధర్, శ్రీనాథ్ పాల్గొన్నారు

బడికి పోదాం ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, టీచర్లు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 29: ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని త్రోవగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు చల్లా బ్రహ్మయ్య మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండాలన్నారు. పాఠశాలలో నాణ్యమైన విద్యను బోధన జరుగుతుందని, క్రీడలకు మంచి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ పదవిని యాదవులకు ఇవ్వాలి

ఒంగోలు(కలెక్టరేట్) జూన్ 29 : తిరమల తిరుపతి దేవస్థానం చైర్మన్ పదవిని యాదవులకు కేటాయించాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో 60 లక్షల మంది యాదవులు ఉన్నారని, అత్యధిక మంది తెలుగుదేశం పార్టీకి వెన్నుముకగా ఉన్నారన్నారు. అలాంటి కులానికి టీటీడీ చైర్మన్ పదవి కేటాయించడం న్యాయమన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి యాదవులు తెలుగుదేశం పార్టీ వైపే ఉన్నందున సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని కోరారు.

లాసెట్‌లో సత్తా చాటిన శ్రీప్రతిభ విద్యార్థి

ఒంగోలు(విద్య), జూన్ 29 : ఐదు సంవత్సరాల లా కోర్సులో ప్రవేశం కోసం నిర్వహించిన లాసెట్-24 ఫలితాల్లో ఒంగోలులోని శ్రీప్రతిభ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి తమ సత్తా చాటారు. ఐదు సంవత్సరాల లా కోర్సులో ప్రవేశానికి వజ్రా ప్రియ 725, నలగట్ల కవిత 1658, మారంరెడ్డి వైష్ణవి 2239 రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను శనివారం కళాశాల యాజమాన్యం అభినందించింది.

ఉద్యోగికి ఘన సత్కారం


మహబూబ్‌సుభానీని సత్కరిస్తున్న గ్రేస్‌లినోరా

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 29: జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న మహబూబ్‌సుభానీని ఘనంగా సత్కరించారు. శనివారం ఒంగోలులోని డీపీఆర్వో కార్యాలయంలో జరిగిన జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి గ్రేస్ లినోరా ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ చేస్తున్న మహబూబ్‌సుభాని సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీపీఆర్వో రమేష్, డివిజనల్ పీఆర్వో డి.దుర్గా ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ సుబ్బమ్మ, పబ్లిసిటీ అసిస్టెంట్ శ్రీనివాసరావు, టైపిస్ట్ ఇందిర, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీఅభయాంజనేయస్వామి కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నాగులుప్పలపాడు, జూన్ 29: ఎం.ముప్పాళ్ళ గ్రామంలో వేంచేసిన శ్రీఅభయాంజనేయస్వామి వారి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శనివారం సువర్చల శ్రీఅభయాంజనేయ స్వామి వారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్ల కళ్యాణ క్రతువును పూజారి ప్రసన్నవంతులు బృందం వేద మంత్రాల నడుమ అంగరంగ వైభవంగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణం తిలకించారు. సర్పంచ్ వైకుంఠ పద్మశ్రీ వీరాంజనేయులు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు. అలాగే వేడుకల్లో భాగంగా దుద్దుకూరు అంకమ్మ తల్లి కోలాట బృందంచే కోలాటం ప్రదర్శించారు.

మహిళకు గాయాలు

మద్దిపాడు, జూన్ 29: గుండ్లాపల్లి జాతీయరహదారిపై ఉన్న బ్రిడ్జి మీద శనివారం మోటార్‌సైకిల్ అదుపుతప్పి మహిళకు గాయాలయ్యాయి. అద్దంకి వైపు నుంచి ఒంగోలు వెళ్తున్న మోటార్‌సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఒంగోలుకు చెందిన సువర్చలాదేవికి గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

మల్లవరంలో ప్రత్యేక పూజలు

మద్దిపాడు, జూన్ 29: మల్లవరంలోని గుండ్లకమ్మ ప్రాజెక్టు చెంత ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు నారాయణం రాజశేఖర్, రవికుమార్ స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులు స్వామివారికి దర్శించుకున్నారు.

గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రంలో రోడ్లు అధ్వానం


రోడ్డుపై పారుతున్న ఫ్యాక్టరీలోని వ్యర్థపునీరు

మద్దిపాడు, జూన్ 29: గుండ్లాపల్లి పరిశ్రమలకేంద్రంలో రోడ్లు అధ్వానంగా మారాయి. గ్రానైట్ ఫ్యాక్టరీలలోని వ్యర్థపు నీరు రోడ్లపై విడుదల చేస్తుండటంతో అంతర్గత రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వాహనాలు వెళ్లాలంటే తీవ్ర అసౌకర్యంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పరిశ్రమల కేంద్రంలో కొంతమంది నీటిని బయటకు విడుదల చేస్తుండటంతో రోడ్లన్నీ చెరువులుగా మారిపోయాయి. పరిశ్రమల కేంద్ర కార్యాలయం నుంచి రోడ్లన్నీ వ్యర్థమైన నీరుతో అధ్వానంగా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పరిశ్రమల కేంద్రం అధికారులు తక్షణం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు.

మంత్రి స్వామికి శుభాకాంక్షలు



మంత్రి స్వామికి బొకే ఇస్తున్న ఎన్‌జీవో సంఘం నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 29 : రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ.స్వామిని ఏపీఎన్‌జీవో సంఘం నాయకులు కలిసి అభినందించారు. ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు ఆధ్వర్యంలో శనివారం సంఘం నాయకులు కొండపిలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఏడుకొండలు, కిషోర్, ప్రసన్న, విజయ్, మాధవి, కోటేశ్వరమ్మ, శిరీష, సునీల్, మంజేష్, షరీఫ్ పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 29: రికార్డుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ సెక్షన్లు, శాఖల కార్యాలయాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జి, డిస్పాచ్ రిజిస్టర్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఫైళ్ల క్లియరెన్స్ పెండింగ్ లేకుండా చూడాలని, సమస్యల పరిష్కారం కోసం వచ్చే మీకోసం అర్జీల నిర్వహణలో మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. రికార్డు రూముల నిర్వహణలో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ

ఒంగోలు నగరం, జూన్ 29: ప్రభుత్వం త్వరలో నిర్వహించే మెగా డీఎస్సీ-2024 ఉపాధ్యాయ పోస్టుల పోటీ పరీక్షకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ జిల్లా సంచాలకులు ఎం.అంజల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెగా డీఎస్సీ-2024 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ పొందేందుకు జిల్లాలోని నిరుద్యోగుల జూలై 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. లై 10వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. శిక్షణకు ఎంపికైన వారికి ఉచిత శిక్షణతో పాటు స్టయిఫండ్, స్టడీ మెటీరియల్ ప్రభుత్వం ఇస్తుందని పేర్కొన్నారు. ఉచిత శిక్షణకు హాజరుకాగోరు వారు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీఈడీ, టీటీసీ మార్కులిస్టుల నకళ్ళు, కులధృవీకరణపత్రం, ఆధార్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తును స్థానిక ప్రకాశంభవనం ఎదురుగా ఉన్న కార్యాలయాల కాంప్లెక్సులో ఉన్న బీసీ స్టడీసర్కిల్ కార్యాలయంలో ఇవ్వాలని ఆమె కోరారు.

లారీ ఢీకొని వెల్డర్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీరామ్

సింగరాయకొండ, జూన్ 29: లారీ ఢీకొని వెల్డర్ మృతి చెందాడు. ఈ సంఘటన స్థానిక దేవీ సీఫుడ్స్ కంపెనీ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాజమండ్రికి చెందిన షేక్ జానీ (40) గత కొంతకాలం నుంచి మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని సీఫుడ్స్ కంపెనీకి సమీపంలో ఉన్న వెల్డింగ్ దుకాణంలో పని చేస్తున్నారు. శనివారం వెల్డింగ్ షాపు సమీపంలో ఉన్న కూల్‌డ్రింక్ దుకాణం వద్దకు వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్ తీసుకొని రోడ్డు దాటుతున్నాడు. ఆసమయంలో అప్పటి వరకూ రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్‌ను అకస్మాత్తుగా డ్రైవర్ రోడ్డెక్కించాడు. అది ఢీకొనడంతో జానీని ముందువైపు ఉన్న చక్రం కిందపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై టి.శ్రీరామ్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

3,4 తేదీల్లో పాఠశాలల ఆడిట్

ఒంగోలు(విద్య), జూన్ 29: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో పాఠశాలలకు విడుదలైన గ్రాంట్లు వినియోగంపై వచ్చేనెల 3,4 తేదీల్లో ఆడిట్ నిర్వహిస్తారు. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం నుంచి ఇక్కడి జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి సమాచారం అందింది. ఒంగోలు, పొదిలి మార్కాపురం మండల విద్యావనరుల కేంద్రాల్లో మొత్తం 902 పాఠశాలలకు ఆడిట్ నిర్వహిస్తారు. గ్రాంట్లకు సంబంధించిన క్యాష్‌బుక్, బిల్లుల రశీదులు, తీర్మానాలు ఇతర వివరాలతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆడిట్‌కు హాజరుకావాలి. 3న ఒంగోలు ఎమ్మార్సీలో చీమకుర్తి, కొండపి, కొత్తపట్నం, మద్దిపాడు, ముండ్లమూరు, ఎన్‌జీపాడు, ఒంగోలు, పొన్నలూరు, సంతనూతలపాడు, తాళ్ళూరు, టంగుటూరు, జరుగుమల్లి మండలాలకు చెందిన 285 పాఠశాలలకు ఆడిట్ జరుగుతుంది. పొదిలిలో సీఎస్‌పురం, దర్శి, హనుమంతునిపాడు కనిగిరి, మర్రిపూడి, పీసీపల్లి, పామూరు పొదిలి, వెలిగండ్ల మండలాలకు చెందిన 244 పాఠశాలలకు ఆడిట్ నిర్వహిస్తారు. అలాగే 4వతేదీన మార్కాపురం ఎమ్మార్సీలో అర్థవీడు, బిపేట, దొనకొండ, పుల్లలచెరువు, కొమరోలు, కొనకనమిట్ల, కురిచేడు, మార్కాపురం, త్రిపురాంతకం, పి.దోర్నాల, పెద్దారవీడు, కంభం, గిద్దలూరు, రాచర్ల, తర్లుబాడు, యర్రగొండపాలెం మండలాలకు చెందిన 373 పాఠశాలలకు ఆడిట్ నిర్వహిస్తారు.

దాడి కేసులో ఎనిమిది మంది అరెస్ట్

అద్దంకి, జూన్ 29 : మండలంలోని తిమ్మాయపాలెం ఇటుక బట్టీల వద్ద ఈ నెల 21వ తేదీ రాత్రి శంకరాపురానికి చెందిన వ్యక్తులు ఆదే గ్రామానికి చెందిన ప్రత్యర్థులపై దాడి చేశారు. ఈ కేసులో ముండ్లమూరు మండలం శంకరాపురానికి చెందిన 8 మందిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై రత్నకుమారి తెలిపారు.

దొంగతనాలపై కేసు

పంగులూరు, జూన్ 29 : మండలంలోని ముప్పవరం గ్రామంలో శుక్రవారం జరిగిన దొంగతనాలపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు. సంఘటన జరిగిన ప్రదేశాలను పరిశీలించామన్నారు. ముప్పవరంలో దొడ్డి నాగేంద్రం, తిరుమలశెట్టి వినోద్‌కుమార్ ఇళ్ళలో జరిగిన చోరీకి సంబంధించి విచారణ చేపట్టామని, అనుమానితులను పరిశీలిస్తున్నామని ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు.

వ్యవసాయ కనెక్షన్‌లకు నగదు డిమాండ్ చేస్తే చర్యలు : డీఈఈ

బల్లికురవ. జూన్ 29 : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు రైతుల నుంచి నగదు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ మార్టూరు సబ్‌డివిజన్ డీఈఈ ఎం. సురేంద్రబాబు హెచ్చరించారు. శనివారం బల్లికురవలోని విద్యుత్ కార్యాలయంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తుపై డీఈఈ సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు విద్యుత్ కనెక్షన్ కోసం పెట్టిన దరఖాస్తులను పరిశీలించి వరుస క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌లను మంజూరు చేస్తామని తెలిపారు. రైతులు డీడీకి రూ.6200 మాత్రమే చెల్లించాలన్నారు. ఎవరైనా దళారులు, విద్యుత్ సిబ్బంది అదనంగా డబ్బులు అడిగితే వెంటనే 9493174291కు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. ఇప్పటికే అన్ని గ్రామాలలో వ్యవసాయ విద్యుత్ లైన్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు చేపడతామన్నారు. ఎక్కడైనా మరమ్మతులు గుర్తైన స్తంభాలను తమ దృష్టికి తెస్తే సరిచేస్తామన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు కావాల్సిన రైతులు వెం టనే గ్రామాలలో ఉన్న సిబ్బందిని సంప్రదించాలని డీఈఈ సురేంద్రబాబు కోరారు. సమావేశంలో ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలి

● టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకట్రావు

ఇంకొల్లు, జూన్ 29: టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి గ్రామాలలో అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గంజి వెంకట్రావు కోరారు. మండలంలోని పావులూరులో టీడీపీ, జనసేన పార్టీల జెండాను ఆవిష్కరించారు. జనసేన పార్టీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పెదపూడి విజయకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, జనసేన నాయకులు నారిశెట్టి ప్రవీణ్, రాంబాబు, వెంకట్రావు, వెంకటనారాయణ, గుంజి అనిల్‌కుమార్, బేతపూడి సురేష్‌బాబు, రవిచంద్ర, రమేష్, రఫీ పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధ మహిళలే టార్గెట్ !

వరుస ఘటనలతో ఆందోళన

మత్తు మందు ఇచ్చి దోపిడీకి పాల్పడుతున్నవైనం

వెలుగుచూసిన పలు నేరాలు

ఇదంతా ఒక ముఠా పనేనా..?

ఒంగోలు(క్రైం), జూన్ 29: ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలే లక్ష్యంగా దోపిడీ పరంపర కొనసాగుతోంది. ఇద్దరు వృద్ధురాళ్లు దోపిడీ దొంగల బారిన పడి హత్యకు గురికాగా, ఒకరు చావు అంచుల వరకు వెళ్ళి బయటపడ్డారు. ఇలాంటి వరుస సంఘటనలతో జిల్లా ప్రజానీకం భయాందోళనకు గురవుతున్నారు. గత 40 రోజుల వ్యవధిలో జిల్లాలో చోటు చేసుకున్న సంఘటనలు చూసి ప్రజలు భయకంపితులు అవుతున్నారు. ముఖ్యంగా ఒంగోలుతోపాటుగా పరిసరప్రాంతాలలో జరగడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఇప్పటికి జరిగిన మూడు ఘటనలలో ఎలాంటి క్లూ దొరకకపోవడంతో పోలీసులు తలలు పట్టుకున్నారు. పండుటాకులు, కన్న బిడ్డలకు దూరంగా ఉంటున్న వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీ దొంగలు స్వైర విహారం చేస్తున్నారు. వృద్ధులకు మత్తు మందు ఇచ్చి వారి వద్ద ఉన్న బంగారం ఆభరణాలు అపహరించుకెళుతున్నారు. వృద్ధులు మత్తు మందు ఘాటుకు మృత్యువాత పడుతున్నారు.

ఇటీవల జరిగిన ఘటనలు..

● ఒంగోలు నగరం అంబేద్కర్‌భవన్ సమీపంలో నివాసం ఉంటున్న తిరుమలశెట్టి పార్వతమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. గత నెల 24న ఆమె శరీరంపై పెద్దగా గాయాలు ఏమీ లేవు. మామిడికాయ తింటూ ఇంట్లోనే మృతి చెందింది. ఆమె వద్ద ఉన్న బంగారం ఆభరణాలను దోపిడీ దొంగలు దోచుకెళ్లారు. అదే సమయంలో ఇంట్లో ఉన్న బీరువాను పెకలించారు. దీంతో ఇరుగుపొరుగు వారు గుర్తించి ఆసుపత్రిలో చేర్చగా ఆమె చికిత్స పొందుతూ మృతి చెందారు.

● అదే తరహాలో ఈనెల 18న ఒంగోలు మండలం ఉలిచిలో ఓ వృద్ధురాలు రాత్రి సమయంలో వరండాలో నిద్రిస్తుండగా ఆమెపై దోపిడీ దొంగలు మత్తును ప్రయోగించారు. ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు అపహరిచుకువెళ్ళారు. తెల్లవారి చూస్తే వృద్ధురాలు మృతి చెంది ఉన్నారు.

● కొత్తపట్నం మండలం మడనూరులో ఈ నెల 26న పట్టపగలు ఆళ్ల కృష్ణవేణమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా నివాసం ఉంటుండగా గుర్తుతెలియని మహిళ ఇంట్లో ఉన్న నిమ్మచెట్టు కాయాలు కావాలని వచ్చింది. అక్కడ ఏమి జరిగిందో గాని కొద్ది సేపటికి వృద్ధురాలు స్పృహ కోల్పోయింది. దీంతో ఆమె వద్ద ఉన్న బంగారం ఆభరణాలు దోచుకెళ్లారు. అక్కడ కూడా ఒంగోలు అంబేద్కర్‌భవన్ వద్ద జరిగినట్లు బీరువా పగలకొట్టి ఉంది. అయితే స్పృహ కోల్పోయిన కృష్ణవేణమ్మను ఆమె బంధువులు గుర్తించి ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం స్పృహలోకి వచ్చింది.

ఆ మహిళ ఎవరు..?

మడనూరులో కృష్ణవేణమ్మ ఇంటికి వచ్చిన గుర్తుతెలియని మహిళ ఎవరు అనేది అంతు చిక్కని ప్రశ్నగా మారింది. వృద్ధురాలు స్పృహ కోల్పోవడానికి మత్తుమందు కారణమా అనే అనుమానాలు వస్తున్నాయి. నిమ్మకాయలు కావాలి అని వచ్చిన మహిళ కృష్ణవేణమ్మ స్పృహ కోల్పోయిన తరువాత బంగారు ఆభరణాలు అపహరించడంతో పాటు నగదుకోసం బీరువ పగలకొట్టిందా అనేది అంతు చిక్కడం లేదు. అయితే ఆ గుర్తుతెలియని మహిళతో పాటు ఇంకా ఎవరైనా తోడు ఉన్నారా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. మడనూరు కేసులో మాత్రమే కొద్దిపాటి క్లూ పోలీసులకు దొరికింది. ఇలా వరుస ఘటనలకు కారణం ఒకే ముఠానా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

నేడు దర్శిలో ఉచిత మెగా వైద్యశిబిరం

● సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పిలుపు

దర్శి, జూన్ 29: నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం దర్శి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మెగా వైద్యశిబిరంలో గుంటూరు, నర్సరావుపేటకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు రోగులకు వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, డాక్టర్ లక్ష్మితో పాటు 20 మంది ప్రముఖ వైద్యులు రోగులకు పరీక్షలు చేసి అవసరమైన మందులు సరఫరా చేస్తారని చెప్పారు. అలాగే, శిబిరంలో వైద్య సేవలందిం చేందుకు అమెరికాలో వైద్యసేవలందిస్తున్న ఇద్దరు డాక్టర్లు ఇక్కడకు వస్తున్నారని చెప్పారు. డాక్టర్ కవితాచౌదరి, డాక్టర్ శ్రీలేఖచౌదరి వైద్య సేవలందిస్తారని తెలిపారు. వైద్య శిబిరంలో గతంలో ఎన్నడూలేని విధంగా ప్రత్యేక పరీక్షలు రోగులకు అందు బాటులోకి తెస్తున్నట్టు చెప్పారు. ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు సేవలందించే కార్యక్రమంలో భాగంగానే డాక్టర్స్ డేను పురస్కరించుకొని వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కౌన్సిలర్ వీసీ.రెడ్డి, పి.వెంకట్రామయ్య తదితరులు ఉన్నారు.

సాఫ్ట్‌వేర్ డెవలపర్, సోలార్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ

ఒంగోలు నగరం, జూన్ 29: ఒంగోలులోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఉన్న స్కిల్‌హబ్ సెంటర్‌లో జూనియర్ సాఫ్ట్‌వేర్ డవలపర్, సోలార్ ప్యానెల్ టెక్నీషియన్ కోర్సుల్లో నిరుద్యోగులకు మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం వీరికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. పదో తరగతి, ఆపై చదివిన నిరుద్యోగులకు ఈ శిక్షణ ఉచితంగా అందిస్తామన్నారు. ఆసక్తికలిగిన వారు జూలై 4వ తేదీన ఒంగోలులోని ప్రభుత్వ బాలుర ఐటీఐలోని స్కిల్ హబ్ సెంటర్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 5వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, వివరాలకు 7989244381 సెల్ నంబర్ ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రజాధనం దుర్వినియోగంపై నిలదీత

మున్సిపల్ సమావేశంలో లేవనెత్తిన టీడీపీ కౌన్సిలర్ కొండయ్య

సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్



ఆంధ్రజ్యోతి పేపర్ చూపుతూ ప్రశ్నిస్తున్న కొండయ్య

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 29: ప్రజా ధనాన్ని ఇష్టారీతిన వాటాలు వేసుకొని పంచు కోవడంపై సభ్యులు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నిలదీశారు. మున్సిపాలిటీలో డీజిల్ దొంగలు ఎవరో నిగ్గు తేల్చాలని 33వ వార్డు కౌన్సిలర్ నాలి కొండయ్య మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించారు. మార్కాపురంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. ముందుగా అనారోగ్యంతో మృతి చెందిన 23వ వార్డు కౌన్సిలర్ దూదేకుల ప్రసాద్‌కు నివాళి అర్పించారు. అనంతరం అజెండాలోని 33 అంశాలపై చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్ నాలి కొండయ్య 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'మార్కాపురం మున్సిపాలిటీలో డీజిల్ దొంగలు' అంశంపై అధికారులను నిలదీశారు. ప్రజాధనం ఈ విధంగా దుర్వినియోగం అవుతుంటేనే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అంతేకాక డీజిల్ వాడకంపై లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. మూడేళ్ల నుంచి ప్రతి అజెండాలో పైపులు వార్డులకు పంపుతున్నట్లు చెబుతున్నారే కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా పైపులు కనిపించడంలేదని విమర్శిం చారు. సాగర్ జలాల సరఫరా పట్టణంలో సక్రమంగా లేదన్నారు. పది రోజులకు ఒక సారి నీరందిస్తే ప్రజలు ఇబ్బందులు పడరా..? అని ప్రశ్నించారు. సాగర్ జలాల పైప్‌లైన్‌ల కోసం గత ప్రభుత్వం రోడ్లు తవ్వి వదిలేసిందన్నారు. కానీ పనులు మాత్రం ఎక్కడివక్కడ నిలిచిపోయాయన్నారు. ముందు ఆ పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాత బస్టాండ్ నుంచి ఆర్టీసీ డిపో వరకు కాలువలపై ఉన్న ఆక్రమణలను ఎందుకు తొలగించడంలేదని ప్రశ్నించారు. వైస్‌చైర్మన్ ఇస్మాయిల్ మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగం అవినీతిలో కూరుకు పోయిందని, గతంలో కూడా సాగర్ కాలువ నుంచి జలాలను రెండు మోటార్లతో పంపింగ్ చేసి ఎస్ఎస్ ట్యాంకును నింపేవారమని అన్నారు. కానీ ప్రస్తుతం సక్రమంగా జలాలను ఎస్ఎస్ ట్యాంకులో నింపడంలేదన్నారు. తన వార్డు పరిధిలో ఓ రోడ్డు వేస్తే ఈ రోజుకు బిల్లు చేయని దుస్థితి ఉందన్నారు. పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైందని అన్నారు. కుక్కలు, పందుల బెడద నుంచి ప్రజల్ని కాపాడాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ మాటాడుతూ పది పనులు పెండింగ్‌లో వున్నందున కాంట్రాక్టర్ వై.శ్రీనివాసరెడ్డికి త్వరగా పూర్తిచేసే వరకు నూతన పనులు కేటాయించవద్దన్నారు. అజెండాలోని 27, 28, 29 అంశాలైన కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్, జంతువధశాలలకు ఫీజులు వసూలు చేసుకొనే హక్కును అంజెడాలో నుంచి తొలగించి రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ కిరణ్, డీఈ సుభాని, మేనేజర్ శ్రీనివాసన్, ఏఈ ఆదినారాయణ, ఆర్వో రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఇలా వచ్చారు..అలా వెళ్లారు..!

టీడీపీ కౌన్సిలర్ల ప్రశ్నలకు సమాధానాలు కరువు ● ప్రజా సమస్యలు పట్టని వైసీపీ కౌన్సిలర్లు



ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్ గొల్లపూడి రమాదేవి

చీమకుర్తి, జూన్ 29 : ప్రజల సమస్యలపై చర్చించి వాటికి పరిష్కార మార్గం చూపాల్సిన మున్సిపల్ పాలకవర్గం కీలకమైన కౌన్సిల్ సమావేశంను మమ అనిపించే విధంగా ముగించటం గమనార్హం. ఒకవైపు ప్రతిపక్ష టీడీపీ కౌన్సిలర్లు ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తున్నా పాలకపక్షంగా ఉన్న వైసీపీ చైర్మన్, ఇతర కౌన్సిలర్లు తమకు ఏమి పట్టనట్లుగా తాము రూపొందించిన ఎజెండాలోని అంశాలకు ఆమోదం తెలుపుకొని సమావేశాన్ని మమ అన్న తీరులో ముగించారు. చీమకుర్తి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ రాజ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కమిషనర్ ఈశ్వరరాజు అజెండాలోని అంశాలను చదవటం, మెజార్టీ ఉన్న పాలకపక్షం ఆమోదం తెలుపుకొని కేవలం అరగంటలోనే సమావేశాన్ని ముగించటం గమనార్హం. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలీలు మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలు, అవినీతిని ప్రశ్నిస్తున్నా, ప్రజల సమస్యలపై ప్రశ్నించే అవకాశం లేకుండా సమావేశాన్ని వ్యూహాత్మకంగా ముగించి వెళ్లటం విశేషంగా నిలిచింది. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రెండోరోజు దుద్దుకూరు మీదుగా పాదయాత్ర



డీడీని అందజేస్తున్న నేతలు

» స్వాగతం పలికిన టీడీపీ నాయకులు

» వేంకటేశ్వరస్వామికి విరాళం అందజేత

ఇంకొల్లు, జూన్ 29: అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించడంతో అమరావతి మహిళలు, రైతులు మొక్కులు తీర్చుకునేందుకు వెంకటపాలెం నుంచి తిరుపతికి చేపట్టిన పాదయాత్ర రెండవ రోజు శనివారం ఇంకొల్లు మండలంలో కొనసాగింది. 5వ రోజు శుక్రవారం ఇంకొల్లు చేరుకోగా, రాత్రికి ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో బస చేశారు. శనివారం ఉదయం 6 గంటలకు ఇంకొల్లు నుంచి ప్రారంభమైన పాదయాత్ర కొణికి, దుద్దుకూరు గ్రామాల వరకు సాగింది. పాదయాత్ర రైతులకు అల్పాహారం, భోజనాలను స్థానిక టీడీపీ నాయకులు ఏర్పాటు చేశారు. ఎంఏఆర్ఎస్ ట్రస్ట్ ద్వారా రూ. 10,116 డీడీని వేంకటేశ్వరస్వామి హుండీలో వేయాలని దుద్దుకూరు గ్రామ సర్పంచ్ మల్లెం శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ మన్నె చింపిరయ్య రైతులకు అందజేసారు. పాదయాత్రగా వచ్చిన వారిని టీడీపీ నాయకులు, మండలాధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, టౌన్ ప్రెసిడెంట్ మార్క్, కరి శ్రీనివాసరావు, సాంబయ్య, బోడావుల శివయ్య, అనంతలక్ష్మి, నాగేంద్రం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమరావతి రైతులు సురేష్, జయకృష్ణ, కృష్ణారావు, అనుపమ, అనిత, ప్రసన్న, చెన్నకేశవరావు, శివకుమారి, రేణుక, సంధ్య, రత్నకుమారి కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు హాస్యానికి చిరునామా జంధ్యాల



రామోజీ, జమున, హేమలత చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సాహితీ ప్రతినిధులు

అద్దంకి, జూన్ 29 : చక్కని హాస్యానికి చిరునామా జంధ్యాల అని సాహితీ స్రవంతి అధ్యక్షుడు చందలూరి నారాయణరావు అన్నారు. ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మల సేవాసదన్‌లో ప్రతిభామూర్తులు - మధుర స్మృతులు 33వ సభ జరిగింది. ఈ సందర్భంగా రామోజీరావు, సినీ నటి జమున, దర్శకులు జంధ్యాల, అద్దంకి హేమలత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహితీ సంస్థల ప్రతినిధులు చందలూరి నారాయణరావు, దాసరి లక్ష్మీరాజ్యం, మంగమూరి చిరంజీవి, అన్నమనేని వెంకటరావు, పీసీహెచ్ కోటయ్య, ఆర్‌వీ రాఘవరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, లేవి ప్రసాద్, బాలు, మక్కెన చిన్నా, వీవీ బ్రహ్మం, చెన్నుపాటి రామాంజనేయులు, వై. వెంకటేశ్వర్లు, రఘురామశర్మ పాల్గొన్నారు.

వృద్ధులపై ప్రేమ చూపాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

అద్దంకి, జూన్29 : వృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు ప్రేమతో మెలగాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం శింగరకొండలోని కష్టజీవుల జాతీయ సేవా సంఘం వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి వృద్ధాశ్రమాన్ని పరిశీలించి వృద్ధుల యోగక్షేమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. కాగా అద్దంకి కోర్టు భవనాల సముదాయంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 152 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత అధ్యక్షతన రెండు బెంచ్‌లలో లోక్ అదాలత్ కేసులను పరిష్కరించారు. లోక్ అదాలత్ సభ్యులు గృహలక్ష్మి, ఎం.ప్రకాష్, ఎస్.నాగేశ్వరరావు, హైగ్రీవాచారి పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 119 కేసులు పరిష్కారం


కోర్టు ఆవరణలో నిర్వహిస్తున్న లోక్‌అదాలత్

గిద్దలూరు టౌన్, జూన్ 29 : పట్టణంలోని కోర్టు భవనాల సముదాయం నందు శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్ నందు 119 కేసులు పరిష్కారమయ్యాయి. కేసుల పరిష్కారానికై రెండు బెంచీలు ఏర్పాటు చేయగా మొదటి బెంచీకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఓంకార్, రెండవ బెంచీకి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీసారాదానమ్మ ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా వ్యవహరించారు. మొత్తం 119 కేసులు పరిష్కారం కాగా ఇందులో 90 క్రిమినల్ కేసులు, 4 భరణం కేసులు ఉన్నాయి. భరణం కేసుకు సంబంధించి 23.75 లక్షల రూపాయలు అందించారు. గృహహింస కేసు 1, చెక్‌బౌన్స్ కేసులు 6కు గాను 10.90 లక్షలు, సివిల్ కేసులు 6కు గాను 21,98,160 రూపాయలు, డిక్రీ అమలుకు గాను 40వేలు, బ్యాంక్ పిఎల్‌సి కేసుకు 50వేలు, బిఎస్‌ఎన్‌ఎల్ 10 కేసులకు గాను 7449 రూపాయలు లావాదేవీలు కక్షిదారులకు అందాయి. ఆయా బెంచీ మెంబర్లుగా న్యాయవాదులు ఆనంద్‌కుమార్, సత్యసులోచన, పిచ్చయ్య, ఉస్మాన్‌షరీఫ్ పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ తీగ

గిద్దలూరు, జూన్ 29 : పట్టణంలోని కళాశాల వీధిలో పాలవ్యాన్ తగిలి విద్యుత్ తీగ తెడిపడింది. ఈ సందర్భంగా కొద్దిమేర పంటలు కూడా వచ్చాయి. అయితే అదృష్టవశాత్తు ఆసమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరాను నిలిపివేసి, తెగిపోయిన తీగకు మరమత్తులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 29: స్థానిక డ్రైవర్స్ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నరేంద్ర నాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9553306631 నంబరును సంప్రదించాలన్నారు.

ఫీజుల పట్టిక ప్రదర్శించాలి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 29: మార్కాపురంలోని అన్ని ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల వివరాలు నోటీస్ బోర్డులో పెట్టించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విజయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టాన్ని జిల్లాలో అమలు చేయడంలో విద్యాశాఖాధికారులు వైఫల్యం చెందారని ఆరోపించారు. ప్రైవేట్ విద్యా సంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. పుస్తకాలు కూడా వారే అధిక ధరలకు అమ్ముతున్నారని తెలిపారు. అధికారులు ఈ సమస్యలు పరిష్కరించాలన్నారు.

ప్రజాధనం దుర్వినియోగంపై నిలదీత

- మున్సిపల్ సమావేశంలో లేవనెత్తిన టీడీపీ కౌన్సిలర్ కొండయ్య
- సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 29: ప్రజాధనాన్ని ఇష్టారీతిన వాటాలు వేసుకొని పంచుకోవడంపై సభ్యులు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నిలదీశారు. మున్సిపాలిటీలో డీజిల్ దొంగలు ఎవరో నిగ్గు తేల్చాలని 33వ వార్డు కౌన్సిలర్ నాలి కొండయ్య మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. ముందుగా అనారోగ్యంతో మృతి చెందిన 23వ వార్డు కౌన్సిలర్ దూదేకుల ప్రసాద్‌కు నివాళి అర్పించారు. అనంతరం అజెండాలోని 33 అంశాలపై చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్ నాలి కొండయ్య 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'మార్కాపురం మున్సిపాలిటీలో డీజిల్ దొంగలు' అంశంపై అధికారులను నిలదీశారు. ప్రజాధనం ఈ విధంగా దుర్వినియోగం అవుతుంటేనే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అంతేకాక డీజిల్ వాడకంపై లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. మూడేళ్ల నుంచి ప్రతి అజెండాలో పైపులు వార్డులకు పంపుతున్నట్లు చెబుతున్నారే కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా పైపులు కనిపించడంలేదని విమర్శించారు. సాగర్ జలాల సరఫరా పట్టణంలో సక్రమంగా లేదన్నారు. పది రోజులకు ఒకసారి నీరందిస్తే ప్రజలు ఇబ్బందులు పడరా..? అని ప్రశ్నించారు. సాగర్ జలాల పైప్‌లైన్‌ల కోసం గత ప్రభుత్వం రోడ్లు తవ్వి వదిలేసిందన్నారు. కానీ పనులు మాత్రం ఎక్కడివక్కడ నిలిచి పోయాయన్నారు. ముందు ఆ పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాత బస్టాండ్ నుంచి ఆర్టీసీ డిపో వరకు కాలువలపై ఉన్న ఆక్రమణలను ఎందుకు తొలగించడంలేదని ప్రశ్నించారు. వైస్‌చైర్మన్ ఇస్మాయిల్ మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగం అవినీతిలో కూరుకుపోయిందని, గతంలో కూడా సాగర్ కాలువ నుంచి జలాలను రెండు మోటార్లతో పంపింగ్ చేసి ఎస్ఎస్ ట్యాంకును నింపేవారిమని అన్నారు. కానీ ప్రస్తుతం సక్రమంగా జలాలను ఎస్ఎస్ ట్యాంకులో నింపడంలేదన్నారు. తన వార్డు పరిధిలో ఓ రోడ్డు వేస్తే ఈ రోజుకు బిల్లు చేయని దుస్థితి ఉందన్నారు. పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైందని అన్నారు. కుక్కలు, పందుల బెడద నుంచి ప్రజల్ని కాపాడాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ పది పనులు పెండింగ్‌లో వున్నందున కాంట్రాక్టర్ వై.శ్రీనివాసరెడ్డికి త్వరగా పూర్తిచేసే వరకు నూతన పనులు కేటాయించవద్దన్నారు. అజెండాలోని 27, 28, 29 అంశాలైన కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్, జంతువధశాలలకు ఫీజులు వసూలు చేసుకొనే హక్కును అంజెడాలో నుంచి తొలగించి రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ కిరణ్, డీఈ సుభాని, మేనేజర్ శ్రీనివాసన్, ఏఈ ఆదినారాయణ, ఆర్‌వో రంగారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ బాలమురళీకృష్ణ


'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం చూపుతూ నిలదీస్తున్న కొండయ్య

ప్రాంతీయ వైద్యశాలలో ఆకస్మిక తనిఖీ


ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూన్ 29 : పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పరిసరాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల నూతనంగా ఆస్పత్రిని నిర్మించారు. ఆ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పరిశీలించి నాశిరకంగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను 2014-19 మధ్య కాలంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రాంతీయ వైద్యశాలను 50 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడం కోసం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 100 పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నామని చెప్పి ఇప్పుడు 40 పడకల ఆసుపత్రిగా ప్రభుత్వం ప్రారంభించడంపై ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆసుపత్రి నిర్మాణాలపై, అప్‌గ్రేడ్ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళతామన్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంపై అధికారులను ప్రశ్నించారు. త్వరలో ఆసుపత్రి అభివృద్ధిపై కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆసుపత్రికి వస్తున్న రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులతో పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ ఆదామ్, డాక్టర్ రమణరెడ్డి, కౌన్సిలర్లు చంద్రశేఖర్, బిల్లా జయ లక్ష్మీ, లొక్కు. రమేష్, గడ్డం భాస్కర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు దమ్మాల జనార్ధన్, టీడీపీ నాయకులు దప్పిలి భాస్కర్‌రెడ్డి, చిన్న శ్రీనివాసరెడ్డి, బిల్లా రమేష్, పందిళ్లపల్లి శ్రీనివాసులు, బాలరాజు, తదితరులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీని ఉత్సవంలా నిర్వహించాలి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూన్ 29 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పింఛన్ల పంపిణీని ఉత్సవంలా నిర్వహించాలని టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు కోరారు. ఎర్రగొండపాలెంలోని 3వ సచివాలయం పరిధిలో పోతురాజు గడ్డ వీధిలో శనివారం పింఛన్ల పంపిణీ స్థలపరిశీలన చేసి ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో జూలై 1వ తేదీన పింఛన్లు అవ్వతాతల ఇళ్లవద్దనే ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎర్రగొండపాలెంలో జరిగే కార్యక్రమంలో పట్టణంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి రాజశేఖరరెడ్డి, టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.


సభ వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఉదయం ఆరు గంటల నుంచే పెన్షన్ పంపిణీ

మార్కాపురం రూరల్, జూన్ 29: జూలై ఒకటో తేదీన ఉదయం 6గంటల నుంచే పెన్షన్ పంపిణీ చేయాలని ఎంపీడీవో తోట చందన అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం మండలంలోని సచివాలయ ఉద్యోగులతో పెన్షన్ పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు మొదలగు 11 కేటగిరీల పెన్షన్ లబ్ధిదారులకు నగదు పంపిణీ చేయాలని కోరారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రూ.3000 జూలై నెలకు సంబంధించిన నాలుగు వేల రూపాయల పెన్షన్ కలిపి మొత్తం రూ.7వేలు పెన్షన్ లబ్ధిదారులకు అందజేయాలన్నారు. పెన్షన్ లబ్ధిదారులు ఎవరు కూడా సచివాలయం వద్దకు రాకుండా సచివాలయ సిబ్బంది వారి ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ నగదు పంపిణీ చేయాలని కోరారు. పెంచిన పెన్షన్ నగదుతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందేశం ఉన్న లేఖను వారికి అందజేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అచ్చమాంబ కల్యాణం


అచ్చమాంబ దంపతుల కల్యాణం నిర్వహిస్తున్న రుత్వికులు

పామూరు, జూన్ 29: మండలంలోని బొట్లగూడూరు పంచాయతి కమ్మవారిపల్లి, రఘునాథపురం గ్రామాల మధ్య వెలసిన అచ్చమాంబతల్లి దేవస్థాన బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీవెంగమనాయుడు సమేత అచ్చమాంబ పేరంటాలు కల్యాణ మహోత్సవాలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా కుంకుమాభిషేకం, పూర్ణాహుతి హోమాలను అర్చకులు నిర్వహించారు. ఉభయదాతలు అచ్చమాంబ దంపతుల కల్యాణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సాయంత్రం పసుపుకుంకుమ పూజలు నిర్వహించి ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించిన వాహనంలో ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి దేవస్థానం వద్ద పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారి పూజలు, వాహన పూజలు, బండ్ల పొంగళ్ళు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఎడ్లబల ప్రదర్శన పోటీలు ఉంటాయని ఆలయ ధర్మకర్త అడుసుమల్లి చెంచయ్య, దేవస్థాన చైర్మన్ అడుసుమల్లి నరసింహులు, దుద్దుకూరు యోగానంద్, దుద్దుకూరు మల్లికార్జున, రావెళ్ల వెంకటరత్నం, వడ్డెంపూడి వెంకటేశ్వర్లు, కమ్మ మాలకొండరాయుడు, నరసింహారావు, కరణం మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల ప్రత్యేక పూజలు

పామూరు, జూన్ 29: అచ్చమాంబ తల్లి కల్యాణ కార్యక్రమాల్లో భాగంగా శనివారం జరిగిన ప్రత్యేక పూజల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు పాల్గొన్నారు. అనంతరం దేవస్థాన కమిటీ నిర్వాహకులతో కలిసి అన్నదాన కార్యక్ర మాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో యారవ శ్రీను, కావిటి సుబ్బయ్య, షేక్ ఖాజారహంతుల్లా, అబ్బూరి శేషయ్య, పిడుగు శ్రీను, గుర్రం నాగేశ్వరరావు, ముబినామౌలాలి, వాయినేని రాఘవ, నాయబ్‌రసూల్, షత్తు మస్తాన్, సుభాని పాల్గొన్నారు.

సీఎస్‌పురంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

» అడ్డుకొన్న కాలనీవాసులు


అక్రమ నిర్మాణాలను కూలుస్తున్న రెవెన్యూ అధికారులు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 29: సీఎస్‌పురంలో అక్రమంగా కట్టుకొన్న పలు గృహాలను రెవెన్యూ అధికారులు శనివారం ఎక్స్‌కవేటర్‌లతో కూల్చివేశారు. సీఎస్‌పురం రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 147/1లో కొందరు హైకోర్టు ఆదేశాలు పాటించకుండా అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపట్టారు. రెండురోజుల క్రితం స్థానిక రెవెన్యూ అధికారులు సర్వే నెంబర్‌లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకొంటామని పంచాయతీ ద్వారా దండోర వేయించారు. అయితే, ఆక్రమణదారులు ఇస్టానుసారంగా కట్టడాలు నిర్మిస్తుండటంతో రెవెన్యూ అధికారులు మూడు ఎక్స్‌కవేటర్‌లతో శనివారం అక్రమ కట్టడాలను కూల్చడం ప్రారంభించారు. అక్కడే నివాసం ఉంటున్న కొందరు ఎస్టీ కాలనీవాసులు ఉన్నఫలంగా కూలిస్తే తాము ఎక్కడ నివాసం ఉండాలని ప్రశ్నించారు. తమకు ఎక్కడైన నివాసం ఉండేందుకు ఇళ్ల స్థలాలు చూపించాలంటూ రెవెన్యూ అధికారులకు అడ్డుకొన్నారు. కొన్ని సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని నివసిస్తున్నామని చెప్పారు. కూలినాలి పనులు చేసుకొంటు జీవనం గడుపుతున్నామని, ఒక్కసారిగా గుడిసెలను కూల్చివేస్తే తమ పరిస్థితి ఏమిటని ఎస్టీ కాలనీ మహిళలు యంత్రాలకు అడ్డుగా నిలబడటంతో పనులను నిలిపివేశారు.

సమాచారం అందుకొన్న తహసీల్దార్ షేక్ నాగూల్‌మీరా సంఘటన స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. తమ ఇళ్లను కూల్చివేస్తే ఎక్కడ బతకాలని ప్రశ్నించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఉండటంతో ఎవరు అక్రమంగా కట్టడాలు నిర్మించరాదని, తాము చట్టప్రకారం వెళుతున్నామని తహసీల్దార్ స్పష్టం చేశారు. అర్హత కలిగిన వారు ఇళ్ల స్థలాల కోసం తగు ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తులను పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. అక్రమ కట్టడాలు నిర్మించడం గాని, ఆక్రమించుకోవడం గాని జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ కట్టడాల కూల్చివేతలో భాగంగా లాకా బాలరాజు పురుగుల మందు డబ్బా పట్టుకొని తన ఇంటిని కూలిస్తే తాను ఇక్కడే పురుగుల మందుతాగి చనిపోతానని బెదిరించడంతో అధికారులు జోక్యం చేసుకొని సర్దిచెప్పారు.


తహసీల్దార్‌తో వాగ్వివాదానికి దిగిన ఎస్టీలు

అవీ..ఇవీ..

దాతల సేవలు మరువలేనివి


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

కంభం, జూన్ 29 : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామస్థులు చేయూత నివ్వడం అభినందనీయమని ఎల్.కోట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.వేణుగోపాలచారి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఎల్.కోట ప్రాథమిక పాఠశాలలో దాత తాటికొండ వెంకటరావు సహకారంతో విద్యార్థులకు పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. దాతృత్వం విద్యార్థులకు ఉపకయక్తమేకాక స్ఫూర్తినిస్తుందన్నారు. ప్రాథమిక దశలోనే సేవపై అవగాహన కలుగుతుందని ఉపాధ్యాయిని అబిగైల్ తెలిపారు.

పాఠశాల తనిఖీ

- మూసివేతకు సిఫారసు

గిద్దలూరు, జూన్ 29 : రాచర్ల మండలం పాలకవీడు పంచాయతీలోని ఓబులరెడ్డిపల్లి గ్రామంలోని మండల ప్రజాపరిషత్ పాఠశాలను మండల విద్యాశాఖాధికారులు గిరిధరశర్మ, శివకోటేశ్వరరావులు తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు ఎవరూ లేకపోవడం, ఈ విద్యా సంవత్సరంలో కొత్తవారు చేరతారన్న నమ్మకం లేకపోవడంతో పాఠశాలను మూసివేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో శనివారం నుంచి పాఠశాలను మూసివేస్తున్నట్లు ప్రకటించి సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని మరో పాఠశాలకు సర్దుబాటు చేస్తున్నట్లు ఎంఈవో గిరిధరశర్మ తెలిపారు.

పుస్తకాల పంపిణీ

గిద్దలూరు, జూన్ 29 : పట్టణంలోని పీఆర్‌కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న అనాథ పిల్లలకు ఎల్ఐసీ ఏజెంట్ కోటా సత్యనారాయణ నోటు పుస్తకాలను సమకూర్చగా సీఐ సోమయ్య, ఎస్సై వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూల సుబ్బయ్య సేవలు మరువలేనివి


పూలసుబ్బయ్య విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న గ్రామ పెద్దలు

కంభం, జూన్ 29 : జిల్లాలో పశ్చిమ ప్రాంతానికి పూలసుబ్బయ్య చేసిన సేవలు, పోరాటం మరువలేనిదని రిటైర్డ్ ఉపాధ్యాయుడు బెల్లంకొండ సాయన్న తెలిపారు. శనివారం పూలసుబ్బయ్య 96వ జయంతి సందర్భంగా తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పూలసుబ్బయ్య విగ్రహానికి పాఠశాల కమిటీ, గ్రామపెద్దలు పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోని, ఉన్నత పాఠశాల హెచ్ఎం లంకా నరసింహరావు మాట్లాడుతూ పూలసుబ్బయ్య పేరు మీద మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలని, వెలుగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో తురిమెళ్ల సర్పంచ్ మాదా సుభద్ర, మాజీ సర్పంచ్ నారిశెట్టి వీరమ్మ, విద్యాకమిటీ చైర్మన్ శేషగిరి, కమ్యూనిస్టు నాయకులు జక్కా అంకయ్య, పూలసుబ్బయ్య విగ్రహ వ్యవస్థాపక కమిటీ సభ్యులు కోళ్ల రంగసాయి, గల్లా గోవిందయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి శాంతికల్యాణం


కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 29: మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో స్వామి వారి శాంతి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో గోలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

సెయింట్‌పాల్స్ పాఠశాలలో తనిఖీ

గిద్దలూరు టౌన్, జూన్ 29 : పట్టణంలోని ఎయిడెడ్ పాఠశాలలైన సెయింట్‌పాల్స్ పాఠశాలలను శనివారం ఒంగోలు, మార్కాపురం డిప్యూటీ డీఈవోలు అనిత, చంద్రమౌళేశ్వర్‌రావులు తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతున్న తీరును వారు పరిశీలించారు. పట్టణంలోని రాచర్లగేటు సమీపంలో, నల్లబండ బజారులో, రాచర్ల మండలం ఒద్దులవాగుపల్లిలోని సెయింట్‌పాల్స్ పాఠశాలలను తనిఖీ చేశారు. ఇటీవల ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను పెంచేందుకు ప్రభుత్వం నుండి ఉత్తర్వులు రాగా అందుకు సంబంధించి విద్యార్థుల హాజరు శాతం, వసతులు, తీరుతెన్నులను వారు పరిశీలించారు. వారి వెంట గిద్దలూరు ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈ అంశంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు.

బోడపాడులో 'నేను బడికి పోతా'

మార్కాపురం రూరల్, జూన్ 29: మండలంలోని బోడపాడు గ్రామంలో ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులు పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులు నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద నుంచి ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించి గ్రామ కూడలిలోని రామాలయం వద్ద మానవహారం చేశారు.

గొంతెండుతున్న గ్రామీణ ప్రాంతాలు

- ట్యాంకర్లు ఏర్పాటుకు వినతి


గంజివారిపల్లెల్లో తాగునీటి పథకం బోరు వద్ద బిందెడు నీళ్ళ కోసం నిరీక్షిస్తున్న మహిళలు

ఎర్రగొండపాలెం, జూన్ 29 : మండలంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 15 రోజులు గడుస్తున్న తొలకరి వర్షాలు కురవక పోవడంతో మండలంలోని తాగునీటి పథకాలు ఒట్టిపోతున్నాయి. బోర్లలో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. సన్నగా వచ్చే జలధార కోసం మహిళలు బోర్ల వద్ద రాత్రిబవళ్లు నిరీక్షిస్తున్నారు. వర్షాలు సరిపడ కురవక పోవడంతో తాగునీటి పథకం బోర్లలో నీటి మట్టం పడిపోయిందని ఆయా గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తాగునీటిని ట్యాంకర్లు ద్వారా సరఫరా చేసే ట్యాంకర్ల యజమానులు ట్రిప్పులు అదనంగా నమోదు చేస్తున్నారని 2024 ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మండలంలో ట్యాంకర్లు నిలిపివేశారు. తర్వాత మార్చి నెల సర్వే చేసి 11 గ్రామాల్లో మాత్రమే గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు ట్యాంకర్లు కు అనుమతి ఇచ్చారు. మండలంలో 60 గ్రామాలు ఉండగా 30 గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని ప్రజలు వాపోతున్నారు. 11 గ్రామాలలో ట్యాంకర్లు ఏర్పాటు చేస్తే మండలంలో మిగిలిన గ్రామాల ప్రజలు నీళ్ల కోసం ఎక్కడికి వెళ్లాలని ప్రభుత్వ అధికారులను తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న గంజివారిపల్లె, జంగంవారిపల్లె ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నేడు దర్శిలో ఉచిత మెగా వైద్యశిబిరం

» సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పిలుపు

దర్శి జూన్ 29: దర్శి నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మెగా వైద్యశిబిరంలో గుంటూరు, నర్సరావుపేటకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు రోగులకు వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, డాక్టర్ లక్ష్మితో పాటు 20 మంది ప్రముఖ వైద్యులు రోగులకు పరీక్షలు చేసి అవసరమైన మందులు సరఫరా చేస్తారని చెప్పారు. అలాగే, శిబిరంలో వైద్య సేవలందిం చేందుకు అమెరికాలో వైద్యసేవలందిస్తున్న ఇద్దరు డాక్టర్లు ఇక్కడకు వస్తున్నారని చెప్పారు. డాక్టర్ కవితాచౌదరి, డాక్టర్ శ్రీలేఖచౌదరి వైద్య సేవలందిస్తారని తెలిపారు. వైద్యశిబిరంలో గతంలో ఎన్నడూలేని విధంగా ప్రత్యేక పరీక్షలు రోగులకు అందు బాటులోకి తెస్తున్నట్టు చెప్పారు. ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు సేవలందించే కార్యక్రమంలో భాగంగానే డాక్టర్స్ డేను పురస్కరించుకొని వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య కౌన్సిలర్ వీసీ రెడ్డి, పి.వెంకట్రామయ్య తదితరులు ఉన్నారు.

ప్రజలిచ్చిన బాధ్యతను విస్మరించిన కౌన్సిలర్లు

- » మున్సిపల్ చైర్మన్ గఫార్ ఆవేదన
- » కోరం లేక సమావేశం వాయిదా



మాట్లాడుతున్న చైర్మన్ గఫార్

కనిగిరి, జూన్ 29: ప్రజలిచ్చిన అమూల్యమైన బాధ్యతను కౌన్సిల్ సభ్యులు విస్మరించటం తగదని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ సమావేశం జరిగింది. అయితే, సమావేశంలో కోరంకు తగినంత సభ్యులు హాజరు కాకపోవటంతో అనివార్యంగా వాయిదా వేశారు. కనిగిరి మున్సిపాల్టీలో మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉన్నారు. సమావేశం నిర్వహణకు కోరం ప్రకారం 13మంది సభ్యులు ఉండాల్సి ఉండగా కేవలం చైర్మన్‌తో కలిపి 8 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశం వాయిదా వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తిరిగి జూలై 2న సమావేశం నిర్వహించనున్నట్టు చైర్మన్ తెలిపారు.

ఇదిలాఉండగా, కౌన్సిల్ సమావేశానికి కౌన్సిలర్లు గైర్హాజరవటంపై విస్తృత చర్చ సాగుతుంది. మున్సిపాల్టీకి సబంధించిన నిధులు దాదాపు రూ.30లక్షల వరకు పక్కదోవ పట్టాయని కౌన్సిల్ సభ్యుల్లో అనుమానాలు ఉన్నట్లుగా చర్చ జరుగుతుంది. నిధుల వినియోగంపై కౌన్సిల్ సభ్యుల అనుమతి లేకుండా కమిషనర్ ఇష్టారాజ్యంగా ఖర్చు చేసినట్లు, వాటికి లెక్కలు చెప్పకుండా దాటేస్తున్నట్లు హాజరైన కౌన్సిల్ సభ్యులు గుసగుసలాడుకుంటున్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూన్ 29: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని మంచిస్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం పట్టణ సమీపంలోని మోడల్ స్కూల్, ప్రభుత్వాసుపత్రిని ఆయన సందర్శించారు. విద్యార్థులకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా గార్లపేట రోడ్డులో నుంచి మోడల్ స్కూలు వరకు సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈక్రమంలో మోడల్ స్కూలును సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థుల సౌకర్యాల లేమిపై అడిగి తెలుసుకున్నారు. అతిత్వరలోనే రోడ్డును వేయిస్తామని విద్యార్థులతో చెప్పారు. నీటి వసతి లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నట్టు విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సంబంధిత అధికారులను పిలిపించి నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.



మంచినీటి సమస్యను ఎమ్మెల్యేకు వివరిస్తున్న విద్యార్థిని

అనంతరం ప్రభుత్వాసుపత్రిని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సందర్శించారు. ఆసుపత్రి పైఅంతస్థుకు వెళ్ళి బీటలు వారిన స్లాబ్‌ను, గోడలను చూసి ఆందోళన వ్యక్తం చేశారు. ఓపీ విభాగం వద్ద పైస్లాబ్ బీటలు వారటంపై అసహనం వ్యక్తం చేశారు. స్లాబ్ పైన నీరు నిలిచిపోతుండటంతో స్లాబ్ దెబ్బతిన్నదని, ఆ సమస్యను కూడా ఇంత కాలం పరిష్కరించుకోలేకపోయారా అని వైద్యులను ప్రశ్నించారు. ఆసుపత్రిలో మైనర్ పనులతో పాటు చేపట్టాల్సిన అబివృద్ధి పనులు, అవసరమైన విభాగాలు, వైద్యుల వివరాలు అందజేయాలని సూపరింటెండెంట్‌కు సూచించారు.

కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, రోషన్‌సందాని, గంగవరపు నాగిరెడ్డి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినిలు, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పింఛన్లు పంపిణీ చేయాలి

» డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూన్ 29: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల పింఛన్లు పారదర్శకంగా పంపిణీ చేయాలని టీడీపీ దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సూచించారు. దర్శిలో శనివారం సాయంత్రం దర్శి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు మండలాల ఎంపీడీవోలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ముఖ్య అతిథిగా వస్తున్నారన్నారు. దర్శి మండలంలోని రాజంపల్లిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్నట్టు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తంగా మారి అర్హులైన ఎంతో మంది ఇబ్బందులు పడ్డారన్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.4వేలకు పెంచిన పింఛన్‌తో పాటు రూ.3వేల బకాయితో కలిపి రూ.7వేలు జూలై 1న పంపిణీ చేయటం ఆనందంగా ఉందన్నారు. సోమవారం సాయంత్రం 4 గంటల లోపు పంపిణీ పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఎంపీడీవోలు ఎస్‌వీఎల్ హనుమంతరావు, వసంత రావునాయక్, సీతారామయ్య, వి. శంఖరరావు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

బొద్దికూరపాడు హైస్కూల్ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న వెంకటరెడ్డి

తాళ్లూరు, జూన్ 29: మండలంలోని బొద్దికూరపాడు జడ్పీ హైస్కూల్‌లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఒంగోలులో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో తాళ్లూరు ప్రాంత సమస్యలను జడ్పీటీసీ వెంకటరెడ్డి విన్నవించారు. బొద్దికూరపాడు హైస్కూల్‌లో మంచినీటి వాటర్ ప్లాంట్ మూతపడింది. దీంతో విద్యార్థులు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. వాటర్ ప్లాంట్‌ను మరమ్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. హైస్కూల్ తరగతి గదులు శిథిలావస్థకు చేరి శ్లాబ్ కూలిపోయిందని చెప్పారు. వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. మండలంలో పలుగ్రామాల్లో నాడు-నేడు కింద అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరగతిన పూర్తి చేయాలని జడ్పీటీసీ కోరారు.

నేడు మాజీ ఎంపీపీ
చాగంటి రాంబాబు విగ్రహావిష్కరణ



రాంబాబు(ఫైల్)

ముండ్లమూరు, జూన్ 29: మండలంలోని తూర్పుకంభంపాడులో టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీ చాగంటి రాంబాబు ప్రథమ వర్ధంతి సందర్భంగా కుటుంబసభ్యులు ఏర్పాటుచేసిన ఆయన విగ్రహాన్ని ఆదివారం ఉదయం ఆవిష్కరించనున్నట్టు సోదరులు చాగంటి హనుమంతరావు, మోహనరావు తెలిపారు. ఈ విగ్రహావిష్కరణకు మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, జిల్లాలోని శాసన సభ్యులు, టీడీపీ నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత సాగర్ హాజరు కానున్నట్టు తెలిపారు. రాంబాబు 1988 నుంచి 1995 వరకు సర్పంచ్‌గా, 2001 నుంచి 2006 వరకు ముండ్లమూరు ఎంపీపీగా పనిచేశారు.

మలేరియా రహిత సమాజం కోసం పాటుపడాలి

పామూరు, జూన్ 29: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించి మలేరియా రహిత సమాజం కోసం పాటుపడాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.రామస్వామి అన్నారు. మలేరియా వ్యతిరేక మాసో త్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సమతుల్యత సాధనకై మలేరి యా వ్యతిరేక పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు ఎస్.బ్రహ్మానందం, శ్రీధర్, తది తరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు కృషి

పామూరు, జూన్ 29: మండలంలోని బొట్లగూడూరు పంచాయతీ పరిధిలో ఉపాధి అవకాశాల కల్పన కోసం పరిశ్రమల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు అన్నారు. శనివారం రఘునాథపురం గ్రామంలో టీడీపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. వచ్చే ఐదేళ్లలో గ్రామాభివృద్ధి కోసం తోడ్పాటు అందిస్తానన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంపీ మాగుంట శ్రీని వాసరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనర సింహారెడ్డితో చర్చించి ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. అనంత రం గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించా రు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, యారవ శ్రీనివాసులు, సర్పంచ్ వై.బాల, దుద్దుకూరు మల్లికార్జున, రావెళ్ల శ్రీను, గ్రుం రమణయ్య. అడుసుమల్లి శ్రీను, చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఎల్లమ్మ కొలుపులు

పీసీపల్లి, జూన్ 29: మండలంలోని వెంగళాయపల్లిలో కోటపాటి, కమ్మ వంశీయులు నిర్వహిస్తున్న మద్దిరాల ఎల్లమ్మ కొలుపులు శనివారం ప్రారంభమయ్యాయి. ఐదురోజులపాటు నిర్వహించే ఈ కొలుపులు ఎల్లమ్మతల్లిని సుమద్రస్నానంలో భాగంగా పాలేరునదిలో జల్లి కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం మాత తుడుపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జూలై 1న కుమర్ల భోజనం, 2న సిద్ధుల కూటం, 3న పట్నాలు, దీనబండారం కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఎల్లమ్మ కొలుపుల సందర్భంగా వెంగళాయపల్లి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రారంభ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్ రావు, గడ్డం బాలసుబ్బయ్య, సర్పంచ్ కరణం తిరుపతయ్య, తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

రాగితీగల చోరీ.. రూ.2లక్షల మేర నష్టం

తాళ్లూరు, జూన్ 29: మండలంలోని తూర్పుగంగవరం పరిసర పొలాలకు చెందిన 30 మంది రైతులకు చెందిన వ్యవసాయమోటార్ల విద్యుత్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి అపహరించారు. ఆ వైరులోని రాగి తీగను వలిచి పనికి రాని నల్లవైరును అక్కడే వదిలి వెళ్లారు. ఒక్కో మోటార్ వైరు ఖరీదు రూ.7 వేల వరకు ఉంటుంది. 30 మోటార్లకు చెందిన వైరు ధర దాదాపు రూ.2లక్షలకు పైగా ఉంటుంది. కొందరు రైతులు శనివారం రాత్రి స్థానిక ఎస్సై విజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.

200 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పామూరు, జూన్ 29: పామూరులోని ఓ ప్రయివేట్ గోడౌన్‌లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టుకొన్న సంఘటన శనివారం రాత్రి జరిగింది. రేషన్ షాపుల ద్వారా పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని కొందరు బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ములు చేసుకొనేందుకు పామూరులో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని జోడౌన్‌లో తూర్పుకోడిగుడ్లపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చెనికల శ్రీనివాసులు సుమారు 200పైగా రేషన్‌బియ్యం టిక్కీలను. కొనుగోలు చేసిన 50 కేజీల బస్తాను నిల్వ ఉంచాడు. పోలీసులకు, రెవిన్యూ అధికారులకు గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం అందించడంతో అధికారులు రంగంలోకి దిగారు.


గోడౌన్‌లో నిల్వ ఉంచిన శ్రీనును పోలీసులు జీబులో ఎక్కించుకొని వచ్చి సీఐ రామానాయక్ సమక్షంలో తాళాలు తీయించారు. గోడన్ అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం టిక్కిలను పరిశీలించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటికి సమాచారం అందించారు. డీటి వచ్చిన అనంతరం పంచనామ నిర్వహిస్తామని ఎస్ఐ ఎం.సైదుబాబు, బిఆర్వోలు షేక్ రఫీ, రఫీఅహ్మద్‌లు తెలిపారు.



◆ అడ్డగోలు ఉత్తర్వులతో జీతాలు
◆ అర్హత లేకపోయినా కీలక బాధ్యతలు
◆ సొంతవారికి ఇష్టారీతిన ఉద్యోగోన్నతులు
◆ అవుట్‌సోర్సింగ్ నియామకాలతో వసూళ్లు



దేవదాయం.. దోపిడీ



గుంటూరులోని దేవదాయ శాఖ కార్యాలయం

ఆధ్యాత్మకంగా ఉంటూ.. హిందూ ధర్మ ప్రచారంతో పాటు.. ఆలయాల అభివృద్ధి.. భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన.. దేవదాయశాఖ అధికారులు కొందరు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. దేవదాయ శాఖను దోపిడీకి కేంద్రంగా మార్చుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో సొంత అజెండాతో ప్రభుత్వం చెలరేగగా.. తామేమీ తీసిపోమన్నట్లుగా దేవదాయశాఖలోని కొందరు అధికారులు అదేబాట పట్టారు. అడ్డగోలు ఉత్తర్వులు.. ఇష్టం వచ్చిన ట్లు నిధులు డ్రా.. ఒక పద్ధతి లేకుండా ఉద్యోగోన్నతులు.. అర్హత లేకపోయినా కీలక బాధ్యతలతో కొందరు అధికారులు దేవదాయ శాఖలో పెత్తనం సాగించారు. గడిచిన 5 ఏళ్లుగా గుంటూరు జిల్లా దేవదాయ శాఖలో కొందరు అధికారులు తిష్ట వేసి భారీగా అవినీతి అక్రమా లకు పాల్పడ్డారన్న ఆరోపణలు సొంతశాఖలోని ఉద్యో గుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ఓ కీలక అధికారి తన అనుయాయులను వెంటేసుకుని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో పెత్తనం చెలయిస్తూ ప్రతీ పనికి ఒక రేటు నిర్ణయించి అందని కాడికి దోచుకున్నారని సమాచారం.

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 29: అడ్డగోలు ఉద్యోగోన్నతులు, అక్రమాలకు గుంటూరు దేవదాయశాఖ కేంద్రంగా మా రింది. అసిస్టెంట్ కమిషనర్ క్యాడర్‌లో ఉన్న ఓ అధికారి ఉద్యో గోన్నతిపై విమర్శలున్నాయి. 2019లో వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత అక్రమ ఉద్యోగోన్నతులు జరిగాయి. అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న ఓ అధికారి ఎటువంటి అదనపు బాధ్యతలు లేకుండానే నేరుగా ఉద్యోగోన్నతి పొందారు. రాష్ట్ర స్థాయి అధికారులు అప్పట్లో ఇచ్చిన ఈ ఉత్తర్వులపై అభ్యంతరాలు వ్యక్తం చేసినా పట్టించుకునే వారు లేకుండా పోయారు. దీంతో కీలక పోస్టులోకి వెళ్లిన ఆ అధికారి ఐదేళ్లపాటు దేవదాయ శాఖను దోచుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమంగా బాధ్యతలు చేపట్టి ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో అన్ని గ్రూపు దేవాలయాలపై పెత్తనం చేస్తూ పెద్దఎత్తున అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. తన అనుయాయుడైన ఓ అధికారిని కార్యాలయంలో కీలక పోస్టులో నియమించుకుని అడ్డగోలుగా దోచేశారని తెలిసింది. ట్రెజరీ నుంచి కూడా జీతాలు డ్రా చేశారన్న ఆరోపణలున్నాయి. కనీసం ట్రెజరీ అధికారులు కూడా ఈ విషయాన్ని గుర్తించకుండా జీతాలు కట్టబెట్టారని కొందరు ఉద్యోగులు తెలిపారు. అడ్డగోలుగా తాను కీలక బాధ్యతలు నిర్వహించడమే కాకుండా తన పరిధిలో ఉన్న అధికారం వినియోగించుకుని అనేక అక్రమాలకు పాల్పడ్డారన్న విమర్శలున్నాయి. ఉద్యోగోన్నతి పేరుతో గుంటూరు జిల్లాలో ఓ డివిజన్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి నుంచి రూ.2 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. సీనియర్లను కాదని జూనియర్ అయిన మరో ఉద్యోగికి నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగోన్నతి కల్పించి రూ.3 లక్షల తీసుకున్నట్లు ఆరోపణన్నాయి. ఇలా దేవదాయశాఖ పరిధిలోని మూడు జిల్లాల్లో సుమారు 200 మంది ఉద్యోగులకు అక్రమంగా ఉద్యోగోన్నతులు ఇచ్చి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేక సిబ్బంది కావాలంటూ అవుట్‌సోర్సింగ్ విధానంలో అనేకమందిని నియమించుకుని వారి వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇలా దేవదాయ శాఖలో ఐదేళ్లుగా ఆ అధికారి అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డారని ఆ శాఖ ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. తనిఖీల పేరుతో ప్రతీ ఆలయానికి వెళ్లడం రూ.వేలల్లో డిమాండ్ చేసి వసూలు చేయడం ఓ ఆనవాయితీగా ఆ అధికారి చేసుకున్నట్లు విమర్శలున్నాయి. ప్రతీ ఏడాది బడ్జెట్ ఆమోదించాల్సి ఉండగా దానికి కూడా ఓ రేటు పెట్టి.. ఆ ప్రకారం డబ్బులు వసూలు చేశారని తెలిసింది. దీంతో మూడు జిల్లాల్లోని ఆలయాల్లో పనిచేసే ఈవోలు, మేనేజర్లు బెంబేలెత్తి పోయారని తెలిసింది. ఎప్పుడు వచ్చి తమపై పడతారు.. ఎంత డిమాండ్ చేస్తారో అంటూ ఉద్యోగులు హడలెత్తేవారంటే ఆశ్చర్యం కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ అధికారి ఇటీవల వరకు చేసిన అక్రమాలు, అవినీతి తాజాగా వెలుగులోకి వస్తున్నాయి. అయితే ఆరు నెలల క్రితం జరిగిన బదిలీల్లో ఆ అధికారి తిరిగి పాత పోస్టులోనే వేరే జిల్లాకు వెళ్లారని సమాచారం.

● స్వయంగా హాజరు కానున్న సీఎం చంద్రబాబు
● రేపు ఉదయం 6 గంటలకు లబ్ధిదారులకు నేరుగా పంపిణీ ● అనంతరం గ్రామంలో లబ్ధిదారులతో చంద్రబాబు ముఖాముఖీ
● గ్రామంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి, అధికారులు



సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పెనుమాక నుంచే..
పింఛన్ల పండుగ

గుంటూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో చెప్పినట్లుగా కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్ల పంపిణీకి సిద్ధమైంది. పింఛన్ల పండుగను గుంటూరు జిల్లా నుంచే ప్రారంభించనున్నారు. ఇంటింటికీ రూ.7 వేలును నేరుగా లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగులు అందజే యాల ని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విష యం తెలిసిందే. ఈ క్రమంలో అమరావతి రాజ. దాని పరిధిలోని తాడేపల్లి మండలం పెనుమాక నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూలై 1వ తేదీ సోమవారం తెల తెలవారుతుండగానే సీఎం చంద్రబాబు స్వయంగా పెనుమాకలోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేయను న్నారు. పింఛన్‌దారుల కళ్లల్లో ఆనందం స్వయంగా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి స్వయంగా ఒక గ్రామంలో సామాజిక పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారి. పింఛన్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌దారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. స్వయంగా ముఖ్యమంత్రి పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొంటారని తెలియడంతో గ్రామంలో సందడి నెలకొంది. అధికారులు, పోలీసులు బందో బస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం కలెక్టర్ నాగలక్ష్మి మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి తదితరులు గ్రామంలో చంద్రబాబు పింఛన్లు అందజేసే ప్రాంతాన్ని పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.



సీఎం రాక కోసం రహదారికి మరమ్మతులు

వైసీపీ మోసం.. చెప్పినట్లు చేస్తోన్న టీడీపీ

సార్వత్రిక ఎన్నికల్లో పింఛన్ల పెంపు హామీ ఒక గేమ్ ఛేంజర్‌గా మారింది. గత వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి రాకముందు పింఛన్‌ని రూ.3 వేలకు పెంచుతామని చెప్పి రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌దారులను మోసగించింది. ఏడాదికి రూ.250 చొప్పున పెంచడంతో అవి వారికి ఏమాత్రం అక్కరకు రాలేకపోయాయి. దాని వల్ల పింఛన్‌దారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తమని మోసగించిన జగన్‌కి తగిన బుద్ధి చెప్పేందుకు ఎప్పుడెప్పుడు అవకాశం వస్తుందా అని ఐదేళ్లు ఎదురు చూశారు. కాగా చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలలో భాగంగా పింఛన్‌ని రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తొలి నెల నుంచే పెంచిన పింఛన్ ఇస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పారు. ఎన్నికల సమయంలో పెన్షన్ల పంపిణీ సక్రమంగా చేయకుండా వైసీపీ ప్రభుత్వం చేసిన ఇబ్బందులు చూసి ఏప్రిల్ నెల నుంచే పింఛన్ పెంచుతానని, దానిని జూలై నెల ఒకటో తేదీన ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు ప్రస్తుత నెల రూ.4 వేలు, ఏప్రిల్ నుంచి రూ.వెయ్యి చొప్పున మూడు నెలలకు కలిపి రూ.3 వేలు మొత్తంగా రూ.7 వేలు పంపిణీకి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆదేశాలు ఇచ్చారు. ఆ మేరకు శనివారం బ్యాంకుల నుంచి సచివాలయాల సిబ్బంది నగదు డ్రా చేశారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

పెనుమాకలో సోమవారం ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొంటున్నందున అధికారులందరూ సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో శనివారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ అనంతరం జరిగే ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు, ప్రజలతో చంద్రబాబు ముఖాముఖీ మాట్లాడతారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని, పారిశుధ్య ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జేసీ రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్, డీఆర్‌వో పెద్ది రోజ, గుంటూరు ఆర్‌డీవో పీశ్రీఖర్, పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్, సిపిఓ శేషశ్రీ, డిఈఓ శైలజ, డీఎస్‌వో కోమలి పద్మ పాల్గొన్నారు.



● రోగుల చికిత్సలపై మంత్రి పెమ్మసానికి వివరిస్తున్న వైద్యురాలు

గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు బాధ్యతాయుతంగా పని చేయాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. ఆస్పత్రిలో అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారంపై శనివారం ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ సెల్వరాజన్‌తో కలిసి ఆయన సమీక్షించారు. - గుంటూరు(మెడికల్)

విద్యార్థుల ఆందోళన..
వీసీ రాజీనామా

● ఛాంబర్‌కు తాళంతో దిగొచ్చిన రాజశేఖర్
● ఏఎన్‌యూలో ఐదేళ్ల అరాచక పాలనకు విముక్తి



వీసీ చాంబర్ ఎదుట ఆందోళన చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్, జనసేన విద్యార్థి సంఘాల నాయకులు

పెదకాకాని, జూన్ 29: వైసీపీతో అంటకాగి.. వైసీపీ సేవలో తరించి.. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీగా ఆచార్య రాజశేఖర్ తీరుపై విమర్శలు, ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం టీఎన్ఎస్ఎఫ్, జనసేన విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఆయా విద్యార్థులు వర్సిటీలో ర్యాలీ చేసి అనంతరం వీసీ ఛాంబర్‌కు తాళాలు వేసి ధర్నా చేశాయి. రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాల వీసీలు రాజీనామా చేశారని, కానీ నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ మాత్రం రాజీనామా చేయలేదని మండిపడ్డారు. వర్సిటీలో పెద్దఎత్తున దోపిడీలు చేసి, వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన రాజశేఖర్‌కు వీసీగా కొనసాగే అర్హత లేదన్నారు. వీసీని చాంబర్‌కు రానిచ్చే ప్రసక్తే లేదని తెలిపారు. ఈ విషయం తెలిసిన వీసీ రాజశేఖర్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్‌కు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నితీష్‌యాదవ్, నాయకులు భాగ్యరాజు, జనసేన అధ్యక్షుడు జగదీష్, నాయకులు శ్రీను, అవినాష్, రామకృష్ణ, యశ్వంత్, ఖాయూమ్, పవన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంగా వర్సిటీ

2019 సెప్టెంబరులో విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతిగా ఆచార్య రాజశేఖర్ నియమితులయ్యారు. 2022 సెప్టెంబరు 28 నుంచి రాజశేఖర్‌ను రెగ్యులర్ వీసీగా నియమించారు. ఈ క్రమంలో ఇన్‌చార్జి వీసీగా నియమితులైనప్పటి నుంచి ఆయన వైసీపీ ప్రభుత్వంతో అంటకాగి విశ్వవిద్యాలయాన్ని వైసీపీ కార్యాలయంగా మార్చారన్న విమర్శలున్నాయి. విద్యకు నిలయమైన విశ్వవిద్యాలయంలో అప్పటి సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిల పుట్టినరోజు నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ విగ్రహాన్ని తొలుతగా ఏఎన్‌ఎలో ఏర్పాటు చేసి విశ్వవిద్యాలయాల్లో రాజకీయ నాయకుల విగ్రహాల ఏర్పాటుకు నాంది పలికారనే విమర్శలు మూటగట్టుకున్నారు. తన అనుచరులందరికీ అతిథి అధ్యాపక ఉద్యోగాలతో పాటు ప్రోగ్రామర్ తదితర ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలున్నాయి. పాలకమండలి ఆమోదం లేకుండానే వర్సిటీ డిపాజిట్లు రూ.కోట్లలో దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. బూటకపు ఇంటర్వ్యూలు నిర్వహించి నలుగురు దళిత, బీసీ వర్గాలకు చెందిన అతిథి అధ్యాపకుల పొట్ట కొట్టారన్న విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వం ప్రకటించిన మూడు రాజధానులకు మద్దతుగా వర్సిటీలో వీసీ ప్రత్యేకంగా సదస్సులు, సెమినార్లు నిర్వహించారు. మూడు రాజధానులపై ఓ పుస్తకం కూడా ముద్రించారు. వైసీపీ ప్లీనరీ సమావేశాల సందర్భంగా వర్సిటీలో పరీక్షలను వాయిదా వేసి ప్రాంగణాన్ని వైసీపీ వారి వాహనాలకు పార్కింగ్ స్థలంగా ఇచ్చారు. ఈ క్రమంలో శనివారం ఆయన రాజీనామాతో వర్సిటీలో ఐదేళ్ల అరాచక పాలనకు ముగింపు పలికినట్లుగా విద్యార్థులు, అధ్యాపకులు భావిస్తున్నారు.

మళ్లీ వాళ్లేనా..?



● ఈసీ మార్గదర్శకాల ప్రకారం గతంలో అధికారుల బదిలీలు ● వీరిలో చాలామంది వైసీపీ నేతలకు కొమ్ముకాసిన వారే ● పాధాన్య పోస్టుల కోసం టీడీపీ నేతల చుట్టూ ప్రదక్షణలు

బాపట్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దాదాపు నాలుగేళ్ల పాటు వైసీపీ నేతాగణం ఆడమన్నట్లు ఆడారు.. వారి దోపిడీకి ఇష్టారీతిన సహకరించారు.. .రెవెన్యూ మొదలు పోలీస్ శాఖ వరకు అందరూ వైసీపీ నేతల సేవలో తరించిన వారే.. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు ఎన్నికల కమిషన్ నిబంధనలతో పాటు స్థానికత, మూడేళ్ల పాటు ఒకే చోట పని ఇలాంటి మార్గదర్శకాలను అనుసరించి పలువురు బదిలీపై వెళ్లిపోయారు. సీన్ కట్ చేస్తే కూటమి ప్రభుత్వం భారీ మెజారిటీతో కొలువుదీరింది. వైసీపీ సేవలో తరించిన సదరు అధికారులే ఇప్పుడు వేరే చోట టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకుని కీలక పోస్టుల్లోకి రావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు జిల్లాలో పోస్టింగ్ పొందిన వారు సైతం వైసీపీ నేతల సిఫారసుతో వచ్చిన వారే కావడంతో సదరు నేతల సేవలో తరించి వారి రుణం తీర్చుకున్నారు. తాజాగా వీరు ఉన్న చోటే కుదురుకోవడానికి తాము నిష్పక్షపాతంగా పనిచేశామనే కొత్త పల్లవి ఎత్తుకుని టీడీపీ నేతల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కీలక పోస్టింగ్‌ల విషయంలో టీడీపీ నేతలు అప్రమత్తంగా లేకపోతే వైసీపీలో హవా కొనసాగించి టీడీపీ శ్రేణులను ఇబ్బది పెట్టినవారే ఇప్పుడు కూడా పెత్తనం చెలాయించే అవకాశం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

నిబంధనల ఊసే మరిచారు...

బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా సుదీర్ఘ కాలం పనిచేసిన భానుప్రతాప్ మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదేశాలనే ప్రభుత్వ ఉత్తర్వులుగా భావించి పనిచేశారు. రోడ్డు విస్తరణ పనులు చేసే క్రమంలో చిరువ్యాపారులు మొదలుకుని ఎంతోమంది ఆయన బాధితులే. ఎన్నికలకు నాలుగునెలల ముందు ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. తాజాగా ఆయన ఒంగోలు కమిషనర్ పోస్టింగ్‌ను దక్కించుకోవడానికి అక్కడి టీడీపీ నేత చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారని సమాచారం. గతంలో బాపట్ల మండల తహసీల్దార్‌గా పనిచేసిన ఒకరు కలెక్టర్ ఆదేశాలతో కూడా పని లేకుండా కేవలం అప్పటి ఎమ్మెల్యే చెప్పారనే కారణంతో ఎస్టీల గుడిసెలు తొలగించడం స్వామిభక్తికి పరాకాష్టగా నిలిచింది. దీనికి సంబంధించి అప్పట్లో వీఆర్వో మీద చర్యలు తీసుకున్న అధికారులు తహసీల్దార్‌ను మాత్రం వివరణతో సరిపెట్టారు. కీలక స్థానంలో పోస్టింగ్ కోసం ఈ తహసీల్దార్ కూడా టీడీపీ నేతల చుట్టూ తిరుగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఉమ్మడి ప్రకాశంలో సీఐగా పనిచేసినప్పుడు టీడీపీ సానుభూతిపరుల పైన కేసుపెట్టి వేధించిన వ్యక్తి ప్రస్తుతం బాపట్ల పరిధిలో సీఐగా ఉన్నారు. ఈయన కూడా టీడీపీ పల్లవి ఎత్తుకుని ఇక్కడే తిష్ఠ వేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. బాలుడు అమర్నాథ్ గౌడ్ హత్య ఉదంతంలో వైసీపీకి కొమ్ముకాశారనే విమర్శ ఎదుర్కొన్న చెరుకుపల్లి పరిధిలో అప్పట్లో సీఐగా పనిచేసిన వ్యక్తికి సైతం వేరే చోట కీలక పోస్టింగ్ కోసం పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

బాపట్ల జిల్లాగా ఆవిర్భవించాక ఆయా విభాగాలకు జిల్లా అధికారులు కొత్తగా వచ్చిన సంగతి తెలిసిందే. వీరిలో చాలా మంది వైసీపీ నేతల ప్రాపకంతో వచ్చిన వారే కావడంతో అడిగిందే తడవుగా నిబంధనలను తోసి రాజని సైతం వారి సేవలో తరించారు. వీరిలో చాలా మంది ఎన్నికలకు మూడు నెలల ముందు ఈసీ ఆదేశాల ప్రకారం వేరే ప్రాంతాలలో అప్రాధాన్య పోస్టులలో నియమించ బడ్డారు. నిబంధనల ప్రకారం రెవెన్యూ, పంచాయతీ విభాగాలకు సంబంధించిన ఉద్యోగులు ఎన్నికలకు ముందు బదిలీపై వెళ్లిన వారు తిరిగి ఇప్పుడు యథాస్థానాల్లోకి వచ్చే అవకాశం ఉంది. వీరితో పాటు గతంలో జిల్లాలో పనిచేసి వెళ్లిన అధికారులు సైతం ఇక్కడకు కాకుండా వేరే జిల్లాలో పోస్టింగ్‌ల కోసమే ప్రయత్నాలు చేయడం కొసమెరుపు. గతంలో పనిచేసిన చోట సదరు అధికారి ఎలా వ్యవహరించారన్నది స్థానిక నేతలకు అవగాహన ఉంటుంది కనుక దానిని తప్పించుకోవడానికి పూర్తిగా కొత్త ప్రదేశాన్ని ఎంచుకుని అక్కడి టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

అప్రమత్తత ముఖ్యం..

కీలక స్థానాల్లో పోస్టింగ్‌ల విషయంలో టీడీపీ నేతలు అప్రమత్తంగా ఉండాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వ ఏలుబడిలో నిజంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యోగులతో పాటు పోలీసులకు నిబంధనల ప్రకారం ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వైసీపీ నేతల వేధింపులు తట్టుకోలేక సెలవుపై వెళ్లిన అధికారులూ ఉన్నారు. కూటమి పాలనలో వారందరికీ న్యాయం జరగాల్సి ఉంది. జిల్లా పోలీస్ కార్యాలయంలో కీలక స్థానంలో ఉన్న ఓ అధికారి వైసీపీ ప్రభుత్వం కొలువుదీరిన కొత్తలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలాంటి వారిని గుర్తించాల్సిన అవసరం ఉంది.

కమిషనర్ భార్య..
ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం



ఏరియా వైద్యశాలలో భార్య, బిడ్డతో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్

బాపట్ల, జూన్ 29: ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో కేవలం పేదప్రజలే వైద్యసేవలు పొందుతారనేది నానుడి. ఎంతోకొంత ఆర్థిక స్థోమత ఉన్నవారంతా ప్రైవేటు వైద్యశాలలోనే చికిత్స పొందటానికి ఇష్టపడుతుంటారు. ఇవన్నీ కాదంటూ అందరికి ప్రభుత్వ వైద్యశాలలో మంచి వైద్యం అందుతుందని బాపట్ల మున్సిపల్ కమీషనర్ బి.శ్రీకాంత్ తన భార్యకు ఏరియావైద్యశాలలో కాన్పు చేయించి ఆదర్శంగా నిలిచారు. ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థ పర్యవేక్షణలో వైద్యులు డాక్టర్ విజయలక్ష్మి సిబ్బందితో కలిసి కమీషనర్ భార్యకు కాన్పు చేశారు. ప్రభుత్వ వైద్యశాల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించేవిధంగా కమీషనర్ అనుసరించిన విధానాన్ని అందరు హర్షిస్తున్నారు.

జాతీయలోక్ అదాలత్‌లో 70 కేసులు పరిష్కారం

బాపట్లరూరల్, జూన్ 29 : జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ న్యూఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ గుంటూరువారి ఆదేశాల మేరకు శనివారం బాపట్ల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాపట్లజిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈజాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 70 కేసులను పరిష్కరించటం జరిగిందని, 55లక్షల 10వేల రూపాయల లావాదేవీలు జరిగాయని జాతీయ లోక్ అదాలత్ ఛైర్మన్ కెపి బాలాజి తెలిపారు. ఈ కార్యక్రమంలో 6వ అదను జిల్లా జడ్జి జి.వాణి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.



కేసులను పరిష్కరిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ఛైర్మన్ కెపి బాలాజి, 6వ అదనపు జిల్లా జడ్జి జి.వాణి తదితరులు

పింఛన్ రూ.7 వేలు

» రేపు ఇంటి వద్దనే పంపిణీ

ఒంగోలు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పేరుతో టీడీపీ అధినేతగా చంద్రబాబు నాయుడు ప్రకటించిన హామీల్లో పేదలకు భరోసా ఇచ్చే పింఛన్ల పెంపునకు ముఖ్యమంత్రి ఆమోద ముద్ర వేయగా సోమవారం నుంచి పంపిణీ జరగనుంది. ఇప్పటివరకు అందుతున్న నెలవారీ పింఛన్ రూ. 3వేలను రూ.4వేలకు పెంచడంతోపాటు ఎన్నికల నోటిఫికేషన్ ముందు ప్రకటించిన విధంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల బకాయిలు రూ.3వేలు కలిపి సోమవారం లబ్ధిదారులకు రూ.7వేలు అందించనున్నారు. జిల్లాలో 2.91 లక్షల మందికి పెంచిన ప్రకారం సుమారు రూ.199.07 కోట్లు అందనుంది. మొత్తం రూ.7వేలు జూలై 1నే ఇవ్వనున్నారు. ఉదయం ఆరుగంటల నుంచే సచి వాలయాల సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు అందజేసేలా ప్రభుత్వం ఆదేశించడంతో తదనుగుణంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లాలో ఏర్పాట్లు చేశారు. జూలై 1ఉదయం ఆరు గంటలకే పంపిణీ ప్రారంభించాల్సి ఉండటంతో శనివారమే సచివాలయాల వారీ డబ్బు డ్రా చేశారు.

శనివారమే డ్రా.. సిబ్బందికి అందజేత

సచివాలయ సంక్షేమ సహాయకుడు, మరో సిబ్బంది సంయుక్తంగా నిధులు డ్రా చేసి ఇతర సిబ్బందికి కేటాయించిన లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా వారి జాబితాలు, సదరు మొత్తాలను శనివారం సాయంత్రమే అందజేశారు. సచివాలయ సిబ్బంది సరిపోని చోట అదనంగా రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బందికి బాధ్యతలను అప్పగించారు. జిల్లాలో పింఛన్ పంపిణీ ఏర్పాట్లను శనివారం సాయంత్రం సీఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా వివరించారు.

పండుగలా జరపాలి

ఇదిలాఉండగా పింఛన్‌ను భారీగా పెంచి బకాయిలు కూడా కలిపి ఇవ్వనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని పండుగలా జరపాలని టీడీపీ అధిష్టానం నిర్ణయించింది. గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి నాయకుల వరకు అందరూ విధిగా పింఛన్ల పంపిణీ సమయంలో లబ్ధిదారుల ఇళ్లకు సిబ్బందితో వెళ్లాలని ఆదేశించింది. తదనుగుణంగా ఎక్కడికక్కడ ఆ పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొనేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అందులోభాగంగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి తాను ప్రాతినిధ్యం వహించే కొండపి నియోజకవర్గంలోని అధికారులతో కొండపిలో శనివారం సమీక్ష నిర్వహించారు. పింఛన్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. సోమవారం ఆయన కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇతర నియోజకవర్గాల్లోనూ స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధులు తదనుగుణ ఏర్పాట్లలో ఉన్నారు.

యుద్ధ విన్యాసాలలో అపశ్రుతి

» జవాన్ రామకృష్ణారెడ్డి మృతి

గిద్దలూరు, జూన్ 29 : రాచర్ల మండలం కాలువపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ ముత్తుముల రామకృష్ణారెడ్డి (46) మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. లడక్‌లో ఇండియన్ ఆర్మీ యుద్ధ విన్యాసాలు చేస్తుండగా ఐదుగురు జవాన్లు యుద్ధ ట్యాంక్‌తో సహా నీటిలో కొట్టుకుని పోయారు. లడక్‌లోని దౌలత్‌బేగ్ ఒల్డి ప్రాంతంలో ఇండియన్ ఆర్మీ యుద్ధ విన్యాసాలు చేస్తూ యుద్ధట్యాంక్ నదిని దాటుతుండగా ఒక్కసరిగా నీటి ప్రవాహం పెరిగింది. యుద్ధ ట్యాంక్‌తో సహా అందులోని ఐదుగురు జవాన్లు నీటిలో కొట్టుకుని పోయారు. ఈ ఐదుగురిలో ముత్తుముల రామకృష్ణారెడ్డి కూడా ఉన్నాడు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం జరగ్గా, నీటిలో కొట్టుకుని పోయిన వారి కోసం ఆర్మీ హెలికాప్టర్లతో రాత్రంతా గాలించారు. శనివారం ఉదయం ఐదుగురు మృతదేహాలు ఒక ప్రాంతంలో నీటిలో తేలయాడుతూ కనిపించడంతో వాటిని వెలికితీశారు. ముత్తుముల రామకృష్ణారెడ్డి మృతదేహం కనిపించగా ఆర్మీ అధికారులు ఆ మేరకు కుటుంబీకులకు సమాచారం అందించారు. దీంతో రామకృష్ణారెడ్డి కుటుంబం అంతులేని ఆవేదనకు గురైంది. సెలవుపై ఎప్పుడు వచ్చినా చిన్నపెద్ద తేడా లేకుండా అందరినీ పలుకరించే రామకృష్ణారెడ్డి ఇక లేరని తెలుసుకున్న గ్రామస్థులు ఒక్కసారిగా నివ్వెర పోయారు. ఆయన మృతదేహాన్ని కాలువపల్లెకు తెచ్చేందుకు ఆర్మీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

అందరూ దేశసేవకే..

కాలువపల్లికి చెందిన ముత్తుముల రామకృష్ణారెడ్డి తండ్రి రామస్వామిరెడ్డి కూడా ఇండియన్ ఆర్మీలో జవాన్‌గా పని చేశారు. రామస్వామిరెడ్డికి ఇద్దరు కుమారులు కాగా పెద్దకుమారుడు పెద్దగంగిరెడ్డి స్థానికంగానే ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఒకరినైనా దేశసేవకు పంపాలన్న రామస్వామిరెడ్డి కలను నిజం చేస్తూ రామకృష్ణారెడ్డి ఆర్మీలో చేరాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడిని నేవీలో చేర్పించగా ప్రస్తుతం ఆఫీసర్ ర్యాంక్‌లో ఉన్నాడు. చిన్న కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. దేశసేవకు అంకితమైన ఆ కుటుంబంలో ప్రమాదవశాత్తు చోటుచేసుకున్న ఘటన తీవ్ర విషాదం నింపింది.

పింఛన్ మంజూరుచేయాలి

» ఎంపీడీవోకు ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశం



సాంబయ్యకు పింఛన్ మంజూరు చేయాలని ఎంపీడీవోకు ఆదేశాలు ఇస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీధర్

మేదరమెట్ల, జూన్ 29: పక్షవాతంతో బాధపడుతున్న మేదరమెట్లకు చెందిన గడిపూడి సాంబయ్యకు వెంటనే పింఛన్ మంజూరు చేయాలని ఎంపీడీవో సమతావాణికి ఇన్‌చార్జి కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాలు జారీ చేశారు. శనివారం కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరుకాగా అదే సమయంలో సాంబయ్య అక్కడకు వచ్చారు. తాను రెండేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నానని, పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని ఏడాదిగా అధికారుల చుట్టూ తిరుగుతున్నానని కలెక్టర్‌కు వివరించారు. వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే పింఛన్‌ను ఇవ్వాలని ఎంపీడీవోను ఆదేశించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మార్టూరు, జూన్ 29: మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన వివాహిత జడా నందిని (33) అలియాస్ నరసమ్మ గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శనివారం స్టేషన్‌కు సమాచారం వచ్చినట్లు ఏఎస్ఐ సైదా తెలిపారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం నాగరాజుపల్లి గ్రామంలో ఇంటిలో గడ్డిమందు తాగిన నందినిని కుటుంబసభ్యులు చిలకలూరిపేటలోనిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులు గుంటూరు లోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందినట్లు స్టేషన్‌కు సమాచారం రాగా పోలీసులు కేసు నమోదు చేశారు. నందినికి భర్త లక్ష్మీనారాయణ, ఇద్దరు పిల్లలున్నారు. వివాహిత ఆత్మహత్యా ప్రయత్నానికి కారణం తెలియలేదు.

200 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పామూరు, జూన్ 29: పామూరులోని ఓ ప్రయివేట్ గోడౌన్‌లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టుకొన్న సంఘటన శనివారం రాత్రి జరిగింది. రేషన్ షాపుల ద్వారా పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని కొందరు బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ములు చేసుకొనేందుకు పామూరులో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీ పంలోని డోడౌన్‌లో తూర్పుకోడిగుడ్లపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చెనికల శ్రీనివాసులు సుమారు 200పైగా రేషన్‌బియ్యం టిక్కీలను. కొనుగోలు చేసిన 50 కేజీల బస్తాను నిల్వ ఉంచాడు.

పోలీసులకు, రెవిన్యూ అధికారులకు గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం అందించడంతో అధికారులు రంగంలోకి దిగారు. గోడౌన్‌లో నిల్వ ఉంచిన శ్రీనును పోలీసులు జీబులో ఎక్కించుకొని వచ్చి సీఐ రామానాయక్ సమక్షంలో తాళాలు తీయించారు. గోడన్ అక్ర మంగా నిల్వ ఉంచిన బియ్యం టిక్కిలను పరిశీలించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటికి సమాచారం అందించారు. డీటి వచ్చిన అనంతరం పంచనామ నిర్వహిస్తామని ఎస్ఐ ఎం.సైదుబాబు, బిఆర్వోలు షేక్ రఫీ, రఫీఅహ్మద్‌లు తెలిపారు.

సమస్యను పరిష్కరిస్తా.. ప్రజలకు ఇబ్బందిలేకుండా చేస్తా!



సింథైట్ ఫ్యాక్టరీ కాలుష్యంపై విచారణ జరుపుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీధర్

» అందరి అభ్యంతరాలను నమోదు చేశాం

» నిపుణులతో కమిటీని నియమించి పరిశీలన

» ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీధర్

మేదరమెట్ల, జూన్ 29: ప్రజలకు ఇబ్బంది లేకుండా సింథైట్ ఫ్యాక్టరీ సమస్యను పరిష్కరిస్తామని ఇన్‌చార్జి కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. శనివారం కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఫ్యాక్టరీ కోరు గురించి ప్రజాభిప్రాయం, ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 2013 నుంచి సింథైట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే కోరుతో తాము పడుతున్న ఇబ్బందులను గ్రామస్థులు వివరించారు. ఫ్యాక్టరీ నుంచి విపరీతంగా కోరు వస్తున్నందున చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు తట్టుకోలేకపోతున్నారని వివరించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదులు చేశామన్నారు. మిరపకాయల తొడిమలు, ఇతర వ్యర్థాలను అనుమతులు లేకుండానే గత పదేళ్లుగా బాయిలర్‌లో ముడిసరుకుగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి పొందే సమయంలో పొట్టు వాడతామని చెప్పి ఇప్పుడు మిరప వ్యర్థాలను వాడడం వల్ల తాము సమస్యలను ఎదుర్కొంటున్నామని వివరించారు. రెండు నెలల క్రితం పర్యావరణ జోనల్ అధికారులు మిరప వ్యర్థాలను వాడడానికి అనుమతించారంటూ ఇప్పుడు చెపుతున్నారని తెలిపారు. గత పదేళ్లలో కోరు వచ్చిన ప్రతిసారీ తాము ఫ్యాక్టరీలోకి వెళ్లిచూడగా మిరప వ్యర్థాలే వాడుతూ కనిపించారని, తాము ఫొటోలు కూడా తీశామని, అవన్నీ పత్రికలలోనూ వచ్చాయని చెప్పారు. పంచాయతీ నుంచి అనుమతులు తీసుకోకుండానే విస్తరణ చేపట్టారని గ్రామ నాయకుడు మేదరమెట్ల శ్రీనివాసరావు ఇన్‌చార్జి కలెక్టర్‌కు వివరించారు. వాగును పూడ్చి ఫ్యాక్టరీకి రోడ్డును నిర్మించారని ఫిర్యాదు చేశారు. ఇకనుంచైనా సమస్యను పరిష్కరించాలని కోరారు.

అనుమతులు ఉన్నాయి..

అన్ని పర్యావరణ అనుమతులతోనే ఫ్యాక్టరీని నడుపుతున్నామని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. ఎండు మిరపకాయల నుంచి నూనె, రంగు తీస్తామని తెలిపారు. మిగిలిన వ్యర్థాల వల్ల ఎలాంటి వాసన, ఘాటు ఉండదని కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం ఎలాంటి కోరు రాకుండానే ఫ్యాక్టరీని గ్రామస్థులు ఆపించారనే ధోరణిలో వారు మాట్లాడారు. పీసీబీ ఏఈ భాస్కరవర్మ మాట్లాడుతూ ఫ్యాక్టరీ వలన ప్రజలు అవస్థలు పడుతుండటం వాస్తవమేనని స్పష్టం చేశారు. వారంరోజుల క్రితం మిరప వ్యర్థాలను వాడవద్దని ఆదేశాలు ఇచ్చామన్నారు. వ్యర్థాలు వాడడం వలనే సమీప గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఈ విషయాలను బోర్డు ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

సమస్యను పరిష్కరిస్తా..

మీరిచ్చిన ఫిర్యాదులన్నీ నమోదు చేశాం, త్వరలోనే సమస్యను పరిష్కరించేందకు నిపుణులతో కమిటీ ఏర్పాటు చేస్తామని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్ గ్రామస్థులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ సుశీల, గ్రామస్థులు మద్దాలి సంజీవరావు, మన్నె సుధాకర్, కనుమూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం గగ్గోలు!

జిల్లాలో ప్రజల తాగునీటి అవసరాల కోసం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసిన నీటి బిల్లుల కోసం జడ్పీటీసీ సభ్యులు గగ్గోలు పెట్టారు. గత రెండేళ్ల నుంచి బిల్లులు రావాల్సి ఉందని, అందువల్ల వెంటనే ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని పాలకులకు విన్నవించారు. శనివారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఐదు అంశాలపై చర్చించినా కేవలం రెండింటి మీదనే కొంత మేర చర్చ జరిగింది. అది కూడా అధికంగా ఆర్‌డబ్ల్యూఎస్‌పై ఎక్కువ సమయం జరగ్గా కొంత మేర విద్యాశాఖ మీద సాగింది. జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్నా అందుకు సంబంధించి సభ్యులు మాట్లాడిన పరిస్థితి లేకపోగా డీఆర్‌డీఏ శాఖపై మాత్రం ముగ్గురు సభ్యులు కొంతసేపు మాట్లాడారు. అంతకు మినహా జిల్లాలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు, ఇతరవర్గాలకు మేలుచేసే అంశాలపై చర్చించలేదు.

» వస్తాయో లేదోనని సభ్యుల ఆందోళన

» గత వైసీపీ ప్రభుత్వ తప్పిదాలను కూటమి సర్కార్‌పై వేసే ప్రయత్నం

» ఎం.బుక్‌లు తయారు చేసి న్యాయం చేయాలని విన్నపాలు

» ప్రస్తుత సమస్యలపై జరగని చర్చ

» మొక్కుబడిగా జరిగిన జడ్పీ సమావేశం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 29 : జడ్పీ సమావేశం మొక్కుబడిగా సాగింది. గత వైసీపీ ప్రభుత్వ హయంలో నీటి బిల్లులు భారీగా పెండింగ్‌లో పెట్టినా పట్టించుకోని అప్పటి ప్రజాప్రతినిధులు ప్రస్తుతం జరిగిన సమావేశంలో మాత్రం హడావుడి చేశారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో శనివారం జడ్పీ సర్వసభ్య సమావేశానికి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షత వహించారు. 2022 అక్టోబరు నుంచి నీటి బిల్లులు చెల్లించకుండా గత ప్రభుత్వం నిలుపుదల చేసింది. ఆ విషయాన్ని కప్పిపుచ్చేందుకు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై నిందలు వేసేందుకు సభ్యులు ప్రయత్నాలు చేయడం చర్చనీయాంశంగా మారింది. నీటి బిల్లుల కారణంగా ట్యాంకర్ల యజమానులు నష్టపోకుండా ఉండేందుకు ఎం.బుక్‌లను తయారుచేసి ఇవ్వాలని కోరారు. బిల్లులు రాకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, అందువల్ల తమకు న్యాయం చేసే విధంగా చూడాలని కొంతమంది సమావేశంలో డిమాండ్ చేసినట్లుగా మాట్లాడటం విశేషం. కాగా సభ్యులు అడిగిన కొన్ని అంశాలపై జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ వచ్చే సమావేశం నాటికి ఆ సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని సూచించారు. అలా పలు ప్రాంతాలకు చెందిన సభ్యులు గత ప్రభుత్వంలో నిలిపివేసిన బిల్లుల కోసం తాపత్రయపడటం తప్ప ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై సమావేశంలో చర్చించేందుకు సమావేశాన్ని వినియోగించు కోకపోవడంపై పలు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సమావేశంలో ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాలకు చెందిన అధికారులు ఉన్నారు. సమావేశం మొత్తం నిరుత్సాహంగా, నిర్లిప్తంగా సాగడం గమనార్హం.

నీటి బిల్లులు చెల్లింపులు చేయాలి

నీటి బిల్లులు చేయకుండా అడ్డుకుంటున్నారని త్రిపురాంతకం జడ్పీటీసీ సభ్యుడు మాకం జాన్‌పాల్ అన్నారు. అధికారపార్టీ నేతల వత్తిడి వల్లనే ఈ అంతా జరుగుతుందన్నారు. బిల్లులు చెల్లింపులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దర్శి, వైపాలెం నియోజకవర్గంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు పరిహారం ఇవ్వకపోవడంపై ఏమిటని ప్రశ్నించారు.

సంతకాలు పెట్టేందుకే వస్తున్నామా!

జడ్పీటీసీ సభ్యునిగా కేవలం సంతకాలు పెట్టేందుకే మీటింగుకు వస్తున్నామా..? అని కనిగిరి జడ్పీటీసీ సభ్యుడు కస్తూరిరెడ్డి అన్నారు. లింగారెడ్డిపల్లి జడ్పీ హైస్కూలులో నాడు-నేడు కింద 80శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. అయితే ఆ పాఠశాల ఊరి మధ్యలో ఉన్నందున ప్రహరీ లేకపోవడంతో కుక్కలు, పందులు తిరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రహరీ కోసం అనేకసార్లు కోరినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి అవినీతిపై సమగ్ర విచారణ చేయాలి

ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని గిద్దలూరు జడ్పీటీసీ సభ్యుడు మధుసూదన్ డిమాండ్ చేశారు. అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. పట్టు పరిశ్రమల షెడ్ల మంజూరు విషయంలో అధికారులు అనుసరించిన విధానాలు సరైంది కాదన్నారు. వెంటనే వాటిని మంజూరుచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అవినీతిపై విచారణ చేయాలి

కొమరోలు మండల సీసీగా పనిచేస్తున్న రవి రూ.52 లక్షల అక్రమాలకు పాల్పడ్డారని అనేక సార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని ఆ మండల జడ్పీటీసీ సభ్యుడు వెంకటనాయుడు అన్నారు. డ్వాక్రా మహిళల డబ్బులను స్వాహా చేశారని పేర్కొన్నారు. మోటు వద్ద ఉన్న పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించాలని కోరాన్నారు. కొమరోలు ఉన్నత పాఠశాలకు సబ్జెక్టు టీచర్లను నియమించాలని కోరారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి సుబ్బాయమ్మ

ఒక వ్యక్తి రెండు ఉద్యోగాలు చేయవచ్చా?

ఒక వ్యక్తి రెండు ఉద్యోగాలు ఎలా చేస్తారని కారంచేడు జడ్పీటీసీ సభ్యురాలు కాట్రగడ్డ రజని ప్రశ్నించారు. ఆసరా పథకం కింద అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేస్తే ఒక్కొక్క సభ్యురాలి వద్ద నుంచి రెండు వందలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదుచేశారు. వీఓఏ ఇష్టారీతిన వ్యవహ రిస్తుందని అనేకసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు.

బిల్లుల కోసం ఆందోళనలు వద్దు

నీటి బిల్లుల కోసం ఎలాంటి ఆందోళన వద్దని ఎమ్మెల్యే తూమాటి మాధవరావు అన్నారు. ప్రభుత్వం బిల్లులను నిలుపుదల చేస్తే జడ్పీలో మనమే ఎక్కువ మంది ఉన్నామని, ఇక్కడ కూడా కుదరని పక్షంలో శాసనమండలిలో మన సభ్యులే ఉన్నారని తెలిపారు. అక్కడ కూడా న్యాయం జరగకపోతే కోర్టుకు వెళ్దామని భరోసా కల్పించే ప్రయత్నం చేశారు.

మోడల్ స్కూళ్లలో హాస్టల్ సీట్లను పెంచాలి

దర్శి నియోజకవర్గంలోని మోడల్ స్కూళ్లలో హాస్టల్ సీట్లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. ముండ్లమూరు మోడల్ స్కూలుకు హాస్టల్ లేని కారణంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లాలో నాడు-నేడు కింద చేసిన వాటర్ ప్లాంట్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పూర్తిస్థాయిలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయాలి

జిల్లాలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో కిట్లు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మండలకేంద్రాల్లోని పాయింట్ల వద్ద కిట్లను స్టాకు పెట్టుకోవడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులకు సకాలంలో కిట్లు పంపిణీ చేయడం ద్వారా మేలు జరుగుతుందనే విషయాన్ని గుర్తించాలన్నారు.

సీఎం సహకారంతో జిల్లా అభివృద్ధి

» ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి



ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 29: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో శాసనసభ్యులతో కలిసి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేస్తామని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక పాత జడ్పీ సమావేశపు హాలులో శనివారం జరిగిన జిల్లా పరిషత సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయానికి సహకారం అందించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష, పరోక్ష సహకారంతోనే కూటమి ఘనవిజయం సాధించిందన్నారు. తనను ఐదోసారి ఎంపీగా గెలిపించినందుకు జిల్లాకు రుణపడి ఉంటానని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 అసెంబ్లీలు ఉంటే 10 స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారంటే ప్రజలు చంద్రబాబును సీఎంగా చూడాలని కోరుకున్నారని తెలిపారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సహకారంతో జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంతోపాటు జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నడికుడి-శ్రీకళాహస్తి రైల్వేలైనును సకాలంలో పూర్తిచేసే విధంగా చూస్తామన్నారు. దర్శి వరకు ప్రస్తుతం రైలు వచ్చిందని, త్వరలో కనిగిరి వరకు రాకపోకలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కేంద్రప్రభుత్వం నుంచి కూడా జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి ఆ పనులను కూడా త్వరగా పూర్తిచేస్తామని మాగుంట తెలిపారు.

సక్రమంగా జరిగేనా?

» పల్లామల్లి సొసైటీ విచారణపై నీలినీడలు

» విచారణాధికారి తీరుపైనే అనుమానాలు

» ప్రక్రియను అడ్డుకోవాలంటూ నిందితులకే సలహాలు

» సదరు సీఈఓకే వేధింపులు..

భరించలేక డీసీఓకు ఫిర్యాదు

ఒంగోలు(విద్య), జూన్ 29 : చీమకుర్తి మండలం పల్లామల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరమితి సంఘం(సొసైటీ)లో ఆర్థిక అవకతవకలు, అక్రమాలపై జరుగుతున్న విచారణపై నీలినీడలు అలముకుంటున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల ప్రకారం సొసైటీ అక్రమాలపై విచారణ సక్రమంగా జరిగేనా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కంచే చేను మేసిన చందంగా విచారణను పారదర్శకంగా నిర్వహించి నిధులు స్వాహా చేసిన వారి నుంచి ముక్కుపిండి రికవరీ చేయాల్సిన విచారణాధికారి తీరుపై ఆరోపణలు వస్తున్నాయి. విచారణను చేపట్టకపోవడమే కాకుండా ఏకంగా అతనే అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేయడం అందరిని ఆశ్చర్యపరుస్తున్నాయి. నిందితులను హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోమనడం, లాయర్లతో సంప్రదింపులు జరపడం తెలిసి అందరూ ముక్కున వేలు వేసుకుంటున్నారు. అవన్నీ విఫలం కావడంతో చేతకాని వాడివంటూ దుర్భాషలకు దిగినట్లు సమాచారం.

దీంతో సొసైటీ సీఈఓ జివి.నారాయణ జిల్లా సహకారాధికారికి ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం మొత్తం కొత్తమలుపు తిరిగింది. వివరాల్లోకి వెళితే.. పల్లామల్లి సొసైటీలో రూ.కోటికిపైగా నిధులను కైంకర్యం చేశారు. సొసైటీ ఆడిటర్ సమర్పించిన నివేదికతో ఈ అక్రమాల భాగోతం వెలుగులోకి వచ్చింది. దీనిపై సహకార సంఘాల చట్టం 196 సెక్షన్ 51 ప్రకారం సమగ్ర విచారణకు ఆడిటర్ సిఫార్సు చేశారు. దీంతో అప్పుడు జిల్లా సహకారాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఈసీఓ పి.రాజశేఖర్ సొసైటీ అక్రమాలపై విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ బీపీఎస్ కృష్ణశాస్త్రిని నియమించారు. నాలుగు నెలల్లో అంటే ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే నివేదిక ఇవ్వాల్సి ఉండగా ఇవ్వలేదు. మరో రెండు నెలలైనా పట్టించుకోకపోవడంతో డీసీఓ ఆయనకు మెమో జారీ చేశారు. అయితే ఇప్పటికి విచారణ చేపట్టనట్లు ఆరోపణలు ఉన్నాయి. తనకు త్వరలో ఉద్యోగోన్నతి ఉన్నందున విచారణ తలనొప్పులు తనకేందుకు అన్నట్లు తప్పించుకునేందుకు చూస్తున్నారని తెలిసింది.

విచారణను అడ్డుకునేందుకు...

విచారణ జరగకుండా స్వయంగా విచారణాధికారే ప్రయత్నాలు చేయడం విశేషం. హైకోర్టుకెళ్లి విచారణపై స్టే తెచ్చుకోమని సొసైటీ సీఈఓకు సలహా ఇచ్చారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. హైకోర్టు అడ్వకేట్ వేణుగోపాల్‌ను సంప్రదించారు. ఆయన కేసులో విచారణపై స్టే రాదని తేల్చిచెప్పడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ఎఫ్ఏసీ డీసీఓగా విచారణకు ఆదేశించేందుకు అధికారం లేదని, సమాచారహక్కు చట్టం ద్వారా కమిషనర్ కార్యాలయానికి వేరే వారి దరఖాస్తు చేయించారు.

అయితే కమిషనర్ కార్యాలయం విచారణకు ఆదేశించే హక్కు ఉందని తెల్చిచెప్పడంతో ఆ ప్రయత్నాలు విరమించుకొని సొసైటీ సీఈఓపై వేధింపులు ప్రారంభించారు.

డీఈఓకు ఫిర్యాదుచేసిన సీఈఓ

విచారణాధికారి వ్యవహారంపై సొసైటీ సీఈఓ నారాయణ డీసీఓకు ఫిర్యాదుచేశారు. విచారణను అడ్డుకునేందుకు విచారణాధికారి చేసిన ప్రయత్నాలకు సంబంధించిన ఆడియో స ంభాషణ వైరల్ కావడంతో అందరూ ఆశ్చర్యపోయారు.

కృష్ణశాస్త్రి తనను అసభ్యపదజాలంతో దూషిస్తున్నారని, గత నవంబరు నుంచి తనకు జీతం ఇవ్వనందున కుటుంబ పోషణ భారమైపోయిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణాధికారి వేధింపులు తట్టుకోలేనని తనను సస్పెండ్ చేయమని లేదా బలవన్మరణానికి అనుమతి ఇవ్వాలని డీసీఓను వేడుకున్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన డీసీఓ శ్రీనివాసరెడ్డి పల్లామల్లి సొసైటీకి వెళ్లి నారాయణను విచారించి మనోధైర్యం చెప్పి వచ్చారు. ఈ విషయమై డీసీఓను వివరణ కోరగా నారాయణ ఫిర్యాదుపై సమగ్ర విచారణ నిర్వహించి వెంటనే కలెక్టర్‌కు నివేదికను సమర్పిస్తామని చెప్పారు.

అడుగంటిన మంచినీటి చెరువులు

» పర్చూరులో ముంచుకొస్తున్న ఎద్దడి
» ఆందోళనలో ప్రజలు

పర్చూరు, జూన్ 29 : మంచినీటి చెరువులు అడుగంటాయి. దీంతో తాగునీటికి ప్రజలు కటకటలాడుతున్నారు. నాచు, తామరతో కలుషితమై కంపుకొడుతున్న నీటితో ప్రజలు రోజలు వెల్లబుచ్చుతున్నారు. ఫిల్టర్ బెడ్‌లు అలంకారప్రాయంగా మారాయి. అదే నీటిని నేరుగా ఓవర్ హెడ్ ట్యాంక్‌కు ఎక్కించి పంచాయతీ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఆ నీటిని ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధి చేసి మంచినీటిగా వినియోగిస్తున్నారు. అయితే ప్రస్తుతం పర్చూరులో ఉన్న రెండు మంచిటిని చెవుల్లో ఒక చెరువు పూర్తిగా అడుగంటింది. మరో చెరువులో అరకొరగా నీరు ఉంది. అదే నీటిని ప్రజల అవసరాల కోసం సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం సక్రమంగా వర్షాలు కురవక పోవడం, సాగర్, కొమ్మమూరు కాలువల్లో నీరు లేకపోవడంతో తాగునీటి ఎద్దడి ముంచుకొస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కారంచేడు కొమ్మమూరు కాలవ నుంచి గతంలో రూ.4కోట్లతో అన్నంబొట్లంవారిపాలెం వరకు పైపులైన్ ఏర్పాటు చేసినా పర్చూరు చెరువుకు చుక్కనీరు చేరని పరిస్థితి. దీంతో సాగర్ కాలువ నీరు విడుదల సమయంలో పర్చూరు వాగుకు చేరిన నీటిని మోటార్‌ల సహాయంతో పర్చూరు మంచి నీటి చెరువులకు నింపుకోవాల్సి ఉంది. ఇటీవల మంచినీటి అవసరాల కోసం నీటిని విడదల చేసినా పర్చూరు చెరువుకు చుక్కనీరు కూడా చేరలేదు. అధికారులు సమన్వయంగా పనిచేయక పోవడం వల్లే నీటిని చెరువులకు నింపుకోలేని పరిస్థితి ఏర్పడిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం చెరువుల పరిస్థితిని, ఉన్న నీటి పరిమాణాన్ని చూస్తే తాగునీటి ఎద్దడి ముంచుకొచ్చే ప్రమాదం ఉందని ప్నజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో చూడాలి.


పర్చూరులోని మంచినీటి చెరువు


పూజలందుకుంటున్న కోదండరామస్వామి

వైభవంగా ఆలయ వార్షిక పూజలు

చినగంజాం, జూన్ 29 : మండలంలోని కడవకుదురు గ్రామంలోని సీతాలక్ష్మణ్ హనుమత్ సమేత కోదండరామ స్వామి దేవస్థాన 10వ వార్షికోత్సవ పూజలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవస్థాన వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దేవస్థానంలో ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. సాయంత్రం వేదపారాణం, విస్వక్సేన ఆరాధన, రక్షాబంధనపూజ, పంచగవ్వ ఆరాధన, ప్రాశన, రక్షాదారణ, ఆచార్యాది బుత్విగ్వరణం, అజప్రదీపారాధన, అంకురారోపణ, వాస్తు తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

వృద్ధులపై ప్రేమతో మెలగాలి

» సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి
» లోక్ అదాలత్‌లో 152 కేసుల పరిష్కారం

అద్దంకి, జూన్29 : వృద్దుల పట్ల కుటుంబ సభ్యులు ప్రేమతో మెలగాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం శింగరకొండలోని కష్టజీవుల జాతీయ సేవా సంఘం వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి వృద్ధాశ్రమాన్ని పరిశీలించి వృద్ధుల యోగక్షేమాలను గురించి అడిగి తెలుసుకున్నారు.

152 కేసుల పరిష్కారం

అద్దంకి కోర్టు భవనాల సముదాయంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 152 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత అధ్యక్షతన రెండు బెంచ్‌లలో లోక్ అదాలత్ కేసులను పరిష్కరించారు. 105 క్రిమినల్ కేసులు, 8 మనోవర్తి కేసులు, 4 కుటుంబ తగాదాలు, 2 చెక్కు బౌన్స్ కేసులు, 4 గృహ హింస కేసులు, 23 ప్రో నోటు కేసులు, ఇతర కేసులు, 2 ప్రిలిటిగేషన్ కేసులు, 4 ఈపీ కేసులు పరిష్కారం అయ్యాయి. లోక్ అదాలత్ సభ్యులు గృహలక్ష్మి, ఎం.ప్రకాష్, ఎస్.నాగేశ్వరరావు, హైగ్రీవాచారి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారంపై దృష్టి


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఈఈ నల్లూరి

అద్దంకి, జూన్ 29 : విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. అద్దంకి పట్టణంలో లోవోల్టేజీ సమస్యను అధిగమించేందుకు పాత దామావారిపాలెం, ప్రభుత్వ వైద్యశాల రోడ్డులో రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను శనివారం ఈఈ నల్లూరి ప్రారంభించారు. అనంతరం కట్టకిందపాలెం, పెరికపాలెంలో ఈఈ పర్యటించి విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీఈఈ సత్యనారాయణ, టౌన్ ఏఈ శివ ప్రసాద్, టీడీపీ నాయకులు చిన్ని శ్రీనివాసరావు, కాకాని అశోక్, కోనేటి అనిల్, కుందారపు రామారావు, మున్నంగి స్టాలిన్, మదీనా, వలి, మాలిక్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

చినగంజాం, జూన్ 29 : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో 1వతేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి శనివారం తెలిపారు. 12 గ్రామ పంచాయతీల్లోని 13 సచివాలయాల పరిధిలో 6,040 మంది లబ్ధిదారులకు గ్రామ సచివాలయాలయ 123 మంది ఉద్యోగులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్ అందజేస్తారని తెలిపారు. జూలై 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి పింఛన్‌ల పంపిణీ జరుగుతుందని, లబ్ధిదారులు ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని వేణుగోపాలకృష్ణమూర్తి సూచించారు.

పింఛన్‌ల పంపిణీ పర్యవేక్షణకు అధికారులు

బల్లికురవ, జూన్ 29 : నూరు శాతం పింఛన్‌ల పంపిణీ జరిగేలా పర్యవేక్షణ అధికారులను నియమించనున్నట్లు ఎంపీడీవో హనుమారెడ్డి శనివారం తెలిపారు. సోమవారం అన్ని గ్రామాలలో పింఛన్‌లను సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులకు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఒక్క రోజులోనే అంద రికీ అందిస్తామన్నారు. మండలంలోని 21 పంచాయతీలలో 7842 మందికి పింఛన్‌లు అందనుండగా, ఒకొక్కరికీ రూ.7వేలను అందిస్తామన్నారు. పింఛన్‌దారులు ఇళ్ల వద్ద ఉండాలని సూచించారు.

దొంగతనాలపై కేసు

పంగులూరు, జూన్ 29 : మండలంలోని ముప్పవరం గ్రామంలో శుక్రవారం జరిగిన దొంగతనాలపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు. సంఘటన జరిగిన ప్రదేశాలను పరిశీలించామన్నారు. ముప్పవరంలో దొడ్డి నాగేంద్రం, తిరుమలశెట్టి వినోద్‌కుమార్ ఇళ్ళలో జరిగిన చోరీకి సంబంధించి విచారణ చేపట్టామని, అనుమానితులను పరిశీలిస్తున్నామని ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు.

దాడి కేసులో ఎనిమిదిమంది అరెస్ట్

అద్దంకి, జూన్ 29 : మండలంలోని తిమ్మాయపాలెం ఇటుక బట్టీల వద్ద ఈ నెల 21వ తేదీ రాత్రి శంకరాపురానికి చెందిన వ్యక్తులు అదే గ్రామానికి చెందిన ప్రత్యర్థులపై దాడి చేశారు. ఈ కేసులో ముండ్లమూరు మండలం శంకరాపురానికి చెందిన 8 మందిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై రత్నకుమారి తెలిపారు.

విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన

మార్టూరు, జూన్ 29 : చేతులు పరిశుభ్రతతో 80 శాతం రోగాలను దూరం చేయవచ్చునని, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో నితిన్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మార్టూరు, కారంచేడు ఇంకొల్లు మండలాలలోని ప్రాథమిక పాఠశాలల్లో ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు డెటాల్ బనేగా స్వస్థ ఇండియా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పరిశుభ్రతపై సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవెలప్ మెంట్, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పాఠశాలల్లో పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలల్లో హైజిన్ హీరోస్, చిన్నారి డాక్టర్స్ అనే కార్యక్రమాలు ద్వారా ర్యాలీలు, వ్యాసరచన, డ్రాయింగ్, స్కిట్, క్విజ్ పోటీలను వచ్చే నెల 2 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో విద్యార్థులకు సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవడానికి 7 రకాల సూత్రాలను పాటించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం డీటీఎస్ఐ ప్రతినిది జీ నళిని మాట్లాడుతూ పాఠశాలల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో 60 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు ఎంపీడీవో సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో యంఈవో లు వస్రాం నాయక్, ప్రేమలత,రీసోర్ పర్సన్ లు గోడె ప్రసాద్, సాడ్సే ప్రతినిదులు భగవాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో నితిన్


రామోజీ, జమున, హేమలత చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ ప్రతినిధులు

తెలుగు హాస్యానికి చిరునామా జంధ్యాల

అద్దంకి, జూన్ 29 : చక్కని హాస్యానికి చిరునామా జంధ్యాల అని సాహితీ ప్రవంతి అధ్యక్షుడు చందలూరి నారాయణరావు అన్నారు. ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మల సేవాసదన్‌లో ప్రతిభామూర్తులు - మధుర స్మృతులు 33వ సభ జరిగింది. ఈ సందర్భంగా రామోజీరావు, సినీ నటి జమున, దర్శకులు జంధ్యాల, అద్దంకి హేమలత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహితీ సంస్థల ప్రతినిధులు చందలూరి నారాయణరావు, దాసరి లక్ష్మీరాజ్యం, మంగమూరి చిరంజీవి, అన్నమనేని వెంకటరావు, పీసీహెచ్ కోటయ్య, ఆర్వీ రాఘవరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, లేవి ప్రసాద్, బాలు, మక్కెన చిన్నా, వీవీ బ్రహ్మం, చెన్నుపాటి రామాంజనేయులు, వై. వెంకటేశ్వర్లు, రఘురామశర్మ పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య భవిష్యత్‌కు మూలాధారం


విద్యార్థులకు పుస్తకాలను అందిస్తున్న ఎంఈవో సుధారాణి

చీరాలటౌన్, జూన్ 29 : ప్రతి విద్యార్థి జీవితంలో ప్రాథమిక భవిష్యత్‌కు ఎంతగానో దోహదపడుతుందని ఎంఈవో-2 సుధారాణి పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన మైనార్టీ విద్యార్థులు పాఠశాల ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఎమ్ఈవో మునిసిపల్ పరిధిలోని గంజిపాలెం, అసఫ్ అలీ ఉర్దూ ప్రైమరీ పాఠశాలలను సందర్శించారు. పాఠశాల రికార్డులను నిశితంగా పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. విద్యార్థులకు ఆటపాటలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలను స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగాలన్నారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలి

బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకట్రావు


జెండా ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతున్న నేతలు

ఇంకొల్లు, జూన్ 29 : టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి గ్రామాలలో అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గంజి వెంకట్రావు కోరారు. మండలంలోని పావులూరులో టీడీపీ, జనసేన పార్టీల జెండాను ఆవిష్కరించారు. జనసేన పార్టీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పెదపూడి విజయకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పని చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, జనసేన పార్టీ నాయకులు నారిశెట్టి ప్రవీణ్, రాంబాబు, వెంకట్రావు, వెంకటనారాయణ, గుంజి అనిల్‌కుమార్, బేతపూడి సురేష్‌బాబు, రవిచంద్ర, రమేష్, రవీ, బట్టు శ్రీనివాసరావు,పావులూరు గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఇంట పింఛన్‌ల పండుగ

ఎమ్మెల్యే ఏలూరి



పర్చూరు, జూన్ 29 : నవ్యాంధ్రలో జూలై 1వ తేదీన ప్రతి పేద ఇంట్లో పండుగ వాతావరణం కన్పించనుంది.. ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పండుగను ఊరువాడ ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శనివారం ప్రకటలో తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పిం ఛన్ల సొమ్ము పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారని ఆ మేరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోజే సంబంధిత పత్రంపై సంతకం చేశారని ఎమ్మెల్యే ఏలూరి గుర్తు చేశారు. ఒకటవ తేదీనే సచివాలయం సిబ్బందితో అన్ని శాఖల సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి పింఛన్‌ను వృద్దులు, దివ్యాంగులకు అం దించేలా అన్నిరకాల చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యా యం జరిగేలా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడే ప్రజా ప్రభుత్వం ఇదన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే చంద్రన్న ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలందరి ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయిందన్నారు. ఎన్నికలకు ముందే మేనిఫెస్టోలో చెప్పినట్లు పెన్షన్‌ను ఒకే సారి రూ.1000 పెంచామని రూ.4000 పెన్షన్ ఇస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు ఇకపై రూ.6000 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ పాలకుడు సామాజిక పెన్షన్ విధానానికి ఆద్యుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరుమీద పెన్షన్ల కార్యక్రమానికి ప్రజా ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసిందన్నారు. ప్రజల భద్రత మా బాధ్యత అన్నారు. ప్రజలు సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలని, ఎప్పుడూ మంచి చేయాలన్న తలంపుతో ఉన్న ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఏలూరి కోరారు. గత ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలను చిదిమేసిందన్నారు. పింఛన్‌ను రూ.3వేలకు పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి అమలు చేయలేదన్నారు. ఒక్కసారి ఇవ్వాల్సిన రూ.1000ని ఏడాదికి రూ.250 మాత్రమే పెంచి చివరి ఏడాది వరకు ఇస్తూ అవ్వాతాతలను నిలువునా మోసం చేశారని విమర్శించారు. పేదల ఇంట ఆనందం నింపాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం జూలై 1న ఇచ్చే రూ.4000తో పాటు ప్రకటించిన నెల నుంచి ఏప్రిల్, మే, జూన్‌కు రూ.1000 చొప్పున రూ.3000 అదనంగా కలిపి మొత్తం రూ.7000 ఒకటవ తేదీన అందజేయనుందని ఏలూరి పేర్కొన్నారు.

ఆదమరిస్తే అంతేసంగతులు..!

» మార్టూరు-కొణిదెన వెళ్లే రోడ్డులో గుంత
» పొంచి ఉన్న ప్రమాదాలు
» చర్యలు చేపట్టాలని ప్రయాణికుల విజ్ఞప్తి


కొణిదెన రోడ్‌లో మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత

మార్టూరు, జూన్ 29 : కొంచెం ఏమరపాటుగా ఉన్నామో ద్విచక్రవాహనంతో గుంతలో పడిపోవలసిందే.. గతంలోనూ కొంతమంది ద్విచక్రవాహనదారులు అదేవిధంగా పడిపోయారు. ఈ ప్రమాదం మార్టూరులో మినీ అండర్ పాస్ నుంచి కొణిదెన వెళ్లే రోడ్‌లో పొంచి ఉంది. అక్కడ రోడ్డుకు ఒక వైపు సైడు కాల్వను పూర్తిగా నిర్మాణం చేయకపోవడంతో పెద్ద గుంత ఏర్పడింది. దాంతో ఈ గుంత పెద్దగా వాహనదారులకు కనిపించకపోవడంతో ద్విచక్రవాహనదారులు గుంతలో పడిపోతున్నారు. దానికి తోడు మార్టూరులోని పెద్ద అండరు పాస్ నుంచి వచ్చే వాహనదారులు, కొణిదెన రోడ్ వైపు నుంచి మార్టూరు సెంటరుకు వచ్చే వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు మలుపు దాటవలసి ఉండటంతో ఈ మలుపు వద్ద ఉన్న గుంత సక్రమంగా వాహనదారులకు కనిపించదు. ఈ కారణంగా వారానికి ఒక ప్రమాదమైనా ఈ గుంత వద్ద జరుగుతున్నది. రెండు రోజుల క్రితం ఒక ద్విచక్రవాహనదారుడు భార్యా పిల్లలతో కలిసి గుంతలో పడిపోయాడు. మరో ఆటోవాలా కూడా గుంతలో పడిపోయాడు. గ్రామ పంచాయతీ వారు గుంత వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలను చేపట్టవలసిన అవసరం ఉంది.

వ్యవసాయ కనెక్షన్‌లకు నగదు డిమాండ్ చేస్తే చర్యలు

విద్యుత్ శాఖ డీఈఈ సురేంద్రబాబు


మాట్లాడుతున్న డీఈఈ సురేంద్రబాబు

బల్లికురవ. జూన్ 29 : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు రైతుల నుంచి నగదు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ మార్టూరు సబ్‌డివిజన్ డీఈఈ ఎం. సురేంద్రబాబు హెచ్చరించారు. శనివారం బల్లికురవలోని విద్యుత్ కార్యాలయంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తుపై డీఈఈ సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు విద్యుత్ కనెక్షన్ కోసం పెట్టిన దరఖాస్తులను పరిశీలించి వరుస క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌లను మంజూరు చేస్తామని తెలిపారు. రైతులు డీడీకి రూ.6200 మాత్రమే చెల్లించాలన్నారు. ఎవరైనా దళారులు గానీ, విద్యుత్ సిబ్బంది గానీ అదనంగా డబ్బులు అడిగితే వెంటనే 9493174291కు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. ఇప్పటికే అన్ని గ్రామాలలో వ్యవసాయ విద్యుత్ లైన్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు చేపడతామన్నారు. ఎక్కడైనా మరమ్మతులు గురైన స్తంభాలను తమ దృష్టికి తెస్తే సరిచస్తామన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు కావాల్సిన రైతులు వెంటనే గ్రామాలలో ఉన్న సిబ్బందిని సంప్రదించాలని డీఈఈ సురేంద్రబాబు కోరారు. సమావేశంలో ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


హ్యాండ్‌వాష్‌పై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలి

చెరుకూరు (పర్చూరు), జూన్ 29 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచేలా కార్యకర్తలు కృషి చేయాలని చెరుకూరు సూపర్‌వైజర్ రాధా కోరారు. శనివారం పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేతులు శుభ్రత, వ్యాధులపై అవగాహన నిర్వహించారు. యోగా కార్యక్రమాన్ని కార్యకర్తలతో కలసి నిర్వహించారు. కార్యక్రమంలో చెరుకూరు సెక్టార్ పరిధిలోని కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పంటల సాగుపై అవగాహన

మార్టూరు, జూన్ 29 : కృషి జీవన్ సహకారంతో గాండీవ రైతు ఉత్పత్తి దారుల సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బాలాజీ అపార్ట్‌మెంట్ పక్కన చెరుకూరి బిల్డింగ్‌లో పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ పెంట్యాల శరత్‌బాబు శనివారం ప్రకటనలో తెలిపారు. భూసార ప్రాముఖ్యత, పంట మార్పిడి ఆవశ్యకత సాగులో పలురకాల పంటల ప్రాధాన్యతపై సదస్సులో సూచనలు, సలహాలు ఇస్తారని తెలిపారు. హాజరయ్యే రైతులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కేవలం 50 మంది రైతులకు మాత్రమే అవకాశం ఉందని ఆసక్తిగలిగిన వారు 9553301949 నంబరును సంప్రదించాలన్నారు.


సన్మాన గ్రహీతలను సత్కరిస్తున్న ప్రతినిధులు

గురువుల ఆశీస్సులు అందుకోవాలి

చీరాలటౌన్, జూన్ 29 : విద్యార్థులు నిత్యం క్రమశిక్షణతో నడుచుకొని గురువుల ఆశీస్సులు అందుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎర్రయ్య అన్నారు. సెయింట్ మార్క్స్ లూథరన్ కళాశాలకు చెందిన హిందీ లెక్చరర్ డా.కొణిదల రమేష్, ఫిజిక్స్ లెక్చరర్ ఖాద్రీ, రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మయ్య ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన సభలో వారిని ఘనంగా దుశ్శాలువాలతో సత్కరించారు. కళాశాల, విద్యార్థుల అభివృద్ధికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ విద్యాసాగరరావు, ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపాలెంలో నేత్రదానం


ఇంకొల్లు, జూన్ 29 : మండలంలోని గొల్లపాలెం గ్రామంలో శనివారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన ఇంకొల్లు మండల చెన్నకేశవ ప్రాథమిక సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు చల్లపల్లి వెంకటేశ్వర్లు(98) మృతి చెందారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో శంకర కంటి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యులను అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, రోటరీ క్లబ్ అధ్యక్షకార్యదర్శులు కమలేశ్వరరావు, స్వామి, ట్రెజరర్ సాంబశివరావు, సభ్యులు అభినందించారు.

రెండోరోజు దుద్దుకూరు మీదుగా పాదయాత్ర

» స్వాగతం పలికిన టీడీపీ నాయకులు
» వేంకటేశ్వరస్వామికి విరాళం అందజేత


దుద్దుకూరులో డీడీని అందజేస్తున్న నేతలు

ఇంకొల్లు, జూన్ 29 : అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించడంతో అమరావతి మహిళలు, రైతులు మొక్కులు తీర్చుకునేందుకు వెంకటపాలెం నుంచి తిరుపతికి చేపట్టిన పాదయాత్ర రెండవ రోజు శనివారం ఇంకొల్లు మండలంలో కొనసాగింది. 5వ రోజు శుక్రవారం ఇంకొల్లు చేరుకోగా, రాత్రికి ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో బస చేశారు. శనివారం ఉదయం 6 గంటలకు ఇంకొల్లు నుంచి ప్రారంభమైన పాదయాత్ర కొణికి, దుద్దుకూరు గ్రామాల వరకు సాగింది. పాదయాత్ర రైతులకు అల్పాహారం, బోజనాలను స్థానిన టీడీపీ నాయకులు ఏర్పాటు చేశారు. ఎంఏఆర్ఎస్ ట్రస్ట్ ద్వారా రూ.10,116 డీడీని వేంకటేశ్వర స్వామి ఉండీలో వేయాలని దుద్దుకూరు గ్రామ సర్పంచ్ మల్లెం శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ మన్నె చింపిరయ్య రైతులకు అందజేసారు. పాదయాత్రగా వచ్చిన వారిని స్థానిక టీడీపీ నాయకులు, మండలాధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, టౌన్ ప్రెసిడెంట్ మార్క్, కరి శ్రీనివాసరావు, సాంబయ్య, బోడావుల శివయ్య, అనంతలక్ష్మి, నాగేంద్రం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమరావతి రైతులు సురేష్, జయకృష్ణ, కృష్ణారావు, అనుపమ, అనిత, ప్రసన్న, చెన్నకేశవరావు, శివకుమారి, రేణుక, సంధ్య, రత్నకుమారి కృతజ్ఞతలు తెలిపారు.



ఇంటి వద్దకే పింఛను

- ఎన్టీఆర్ భరోసా పేరుతో రేపటి నుంచి పంపిణీ
- సచివాలయ సిబ్బందికి చేరిన నగదు
- లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేయనున్న యంత్రాంగం

చేజర్ల, జూన్ 29 : 1వ తేదీన సామాజిక భద్రత పించన్ల పంపిణీకి అధికారులు సర్వం సిద్ధం చేశారు. పించన్ల పంపిణీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయంతో అవ్వాతాతల కష్టాలు తీరనున్నాయి. పెన్షన్ సొమ్ము పెంచి ఇస్తామనే ఎన్నికల ముందు హామీని అమలుచేస్తూ ఆయా మండలాలకు పెంచిన మొత్తం నిధులు కేటాయించారు. జూలై 1న పండుగ వాతావరణంలో ఎన్టీఆర్ భరోసా పేరుతో సచివాలయ ఉద్యోగులతోపాటు ఇతర ఉద్యోగులతో ఉదయం 6 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్ద పింఛను సొమ్ము పంపిణీ చేసేలా మార్గదర్శకాలు జారీచేశారు.



పెంపు ఇలా..

జిల్లాలో 3,19,961 మంది లబ్ధిదారులకు రూ.218.87 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, హిజ్రాలు, హెచ్ఐవీ బాధితులు, కళాకారులకు రూ.3వేల పింఛన్‌ను రూ.4వేలకు పెంచారు. వీరికి ఏప్రిల్ 1 నుంచి పెంపును అమలు చేసి, జులై ఒకటిన పింఛను కింద వీరికి రూ.7వేలు (జులై1న ఇచ్చే రూ.4 వేలు, ఏప్రిల్ నుంచి 3 నెలలకు రూ.వెయ్యి వంతున కలిపి) అంద చేయనున్నారు. అదేవిధంగా దివ్యాంగుల పింఛను మొత్తాన్ని రూ.3 వేల నుంచి 6వేలకు పెంచారు. కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేసుకున్న వారికి, డయాలసిస్ స్టేజ్‌కు ముందున్న కిడ్నీ వ్యాధిగ్రస్థులకు అందే రూ.5వేల మొత్తాన్ని 10వేలకు పెంచారు. కుష్టు కారణంగా బహుళ వైకల్యం సంభవించిన వారికి రూ.6వేల పింఛను ఇస్తారు. పూర్తిస్థాయిలో అస్వస్థతకు గురైన వారికి, తీవ్ర అనారోగ్యంతో మంచాన పడిన వారికి, వీల్ చైర్‌లో ఉన్న వారికి అందే రూ.5వేల పింఛన్‌ను 15వేలకు పెంచారు. ఇలా పింఛను మొత్తాన్ని సోమవారం నాడు పండుగ వాతావరణంలో అందజేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు.

అందరూ పాల్గొనండి : ఆనం

నెల్లూరు (హరనాథపురం) : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో గ్రామ, వార్డు, కాలనీస్థాయిలో ప్రతి కార్యకర్త, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొనాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మండల, టౌన్ పార్టీ అధ్యక్షులు, డివిజన్, వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జులు, నాయకులందూ ఆయా సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌లో జిల్లా ప్రథమం

- ఒక్కరోజే 3,201 కేసుల పరిష్కారం



పరిష్కరించిన కేసుల వివరాలు వెల్లడిస్తున్న జిల్లా జడ్జి యామిని

నెల్లూరు (లీగల్), జూన్ 29 : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్వహించిన లోక్ అదాలత్‌లో రాష్ట్రంలోనే అత్యధిక కేసులు పరిష్కరించి జిల్లా ప్రథమ స్థానం సాధించింది. నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న లోక్ అదాలత్ భవన్‌లో ఉదయం ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ.యామిని లాంఛనంగా ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా పలు కోర్టులలో 3,201 కేసులు పరిష్కరింపబడ్డాయి. నగరంలో 1,658, గూడూరులో 34, కోవూరులో 424, కావలిలో 117, ఆత్మకూరులో 141, ఉదయగిరి 35, వెంకటగిరిలో 223, కోటలో 420, సూళ్ళూరుపేటలో 141 కేసులు పరిష్కరింపబడ్డాయి. నగరంలో ఉన్న కోర్టులో ప్రత్యేక బెంచీలు ఏర్పాటు చేసి కేసులను పరిష్కరించారు. ప్రిసైడింగ్ అధికారులుగా 1వ అదనపు జిల్లా జడ్జి జి. కబర్ధీ, 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి పినపాటి భరద్వాజ, స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్ ఎన్.లావణ్య, స్పెషల్ ఎక్సైజ్ మేజిస్ట్రేట్ పి.సుయోధన్, సెకండ్ ఏడీఎం శారదారెడ్డి, నాల్గవ ఏడీఎం భాస్కర్ కేసుల పరిష్కారంలో కీలకపాత్ర వహించారు. ఈ సందర్భంగా రాజీకి యోగ్యమైన పలు సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నెల్లూరు (హరనాథపురం) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో ఉదయం 10 గంటలకు వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

స్టాంపుల ముద్రణలోనూ నాఛీరకం!

- నాన్ జ్యుడిషియల్ స్టాంపుల ముద్రణలో నాణ్యతలేని కాగితం
- డాక్యుమెంట్లు, అగ్రిమెంట్లకి పనికిరావని సర్వత్రా ఆందోళన



ప్రస్తుతం చలామణి అవుతున్న నాసిరకం నాన్ జ్యుడిషియల్ స్టాంపు

కందుకూరు, జూన్ 29: అన్ని రంగాల్లోనూ అవినీతికి రాచబాట చేసిన గత జగన్ ప్రభుత్వం నాన్ జ్యుడిషియల్ స్టాంపుల ముద్రణలోనూ చేతివాటం చూపింది. ఆస్తుల లావాదేవీల కోసం వినియోగించే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, అగ్రిమెంట్లు, అఫిడవిట్లు, సంస్థ రిజిస్ట్రేషన్లు, భాగ పంపకాల డీడ్‌లు, ఇతరత్రా నాన్ జ్యుడిషియల్ స్టాంపుల ముద్రణలో నిబంధనలు మార్చేసి, నాసిరకమైన పేపరుతో ముద్రించిన స్టాంపులను వినియోగంలోకి తెచ్చింది. ఆ స్టాంపు కాగితాలు తీసుకున్న ప్రజలు వాటిని చూసి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పాతవాటినే పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

మారిన ముద్రణ, డిజైన్

గత వైసీపీ హయాంలో రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖామంత్రిగా ధర్మాన ప్రసాదరావు పనిచేశారు. ఆయన బాధ్యతలు చేపట్టాక అప్పటివరకు నాన్ జ్యుడిషియల్ స్టాంపుల ముద్రణ, సరఫరా ఆశాఖ పరిధిలోని ఉండేది.ఆయన ఆ బాధ్యతలను ఆశాఖ తప్పించి స్టాకు హోల్డింగ్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్‌కు అప్పగించారు. దీంతో స్టాంపుల ముద్రణ, డిజైన్ అన్నీ మారిపోయాయి. అప్పటివరకు స్టాంపుల ముద్రణ అత్యంత నాణ్యమైన బాండ్ పేపరుపై జరిగేది. స్టాంపు విలువ ఎంత అయినప్పటికీ నాణ్యమైన పేపరునే ఉపయోగించేవారు. ఆ స్టాంపులను స్టాంపు వెండర్లు రిజిస్ట్రేషన్‌శాఖ ఐజీల వద్ద తీసుకుని విక్రయించేవారు. ఇందుకోసం ప్రభుత్వం ఐదుశాతం కమీషన్ చెల్లించేది. అయితే స్టాంపుల ముద్రణ బాధ్యతలు స్టాకు హోల్డింగ్ కార్పొరేషన్‌కు అప్పగించాక నాణ్యమైన పేపరు స్థానంలో నాసిరకం పేపరును వాడటం ప్రారంభించారు. అంతేకాక స్టాంపు వెండర్లకు ఇచ్చే కమీషన్‌లోనూ కోత పెట్టారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వానికి, స్టాకు హోల్డింగ్ ప్రతినిధులకు మధ్య భారీగా నగదు చేతులు మారినట్లు విమర్శలు ఉన్నాయి. ఒక ఆస్తి రిజిస్ట్రేషన్ చేయాలంటే స్టాంపు డ్యూటీ ఎంత కట్టాల్సి వచ్చినా, కనీసం రూ.500ల నాన్ జ్యుడిషియల్ స్టాంపులు తీసుకుని వాటిపై డాక్యుమెంటు సిద్ధం చేయించుకుని మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వానికి చలానా రూపంలోనో, ఆన్‌లైన్ పేమెంట్‌గానో చెల్లిస్తామనికానీ అగ్రిమెంట్లు, అఫిడవిట్లు, ఇతరత్రా కార్యకలాపాలకు పూర్తిగా నాన్ జ్యుడిషియల్ స్టాంపునే వాడుతామని వినియోగదారులు చెబుతున్నారు. శతాబ్దాలపాటు పదిలంగా ఉండాల్సిన విలువైన డాక్యుమెంట్లకి నాసిరకం పేపరుతో నాన్ జ్యుడిషి యల్ స్టాంపులు ముద్రించటం దారుణమని పలువురు పేర్కొన్నారు. దీన్ని బట్టి ప్రజాప్రయోజనాల పట్ల గత ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధలేదని అర్థమవుతున్నదని వారు వాపోయారు. మాకు నాణ్యమైన స్టాంపులే కావాలని స్టాంపు వెండర్లని అడుగుతున్నా, మావద్ద పాత స్టాంపులు స్టాకు ఉన్నంతవరకు ఇచ్చామని, ఇక తాము చేయగలిగింది లేదని వారు తెగేసి చెబుతున్నారు.

స్టాంపు డ్యూటీ చెల్లింపులోనూ...

ఆస్తుల క్రయవిక్రయాలకు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన స్టాంపు డ్యూటీ చెల్లింపుల్లోనూ స్టాకు హోల్డింగ్ కార్పొరేషన్‌కు బాధ్యతలు అప్పగించారు. వారికి అవసరానికి మించి కమీషన్ ఇస్తూ నిబంధనలు సడలించటం పట్ల మరిన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు స్టాంపు డ్యూటీని ఆస్తులు కొనుగోలు చేసుకున్నవారు బ్యాంకులో చలానా కట్టేవారు. అలాకాకుండా స్టాంపు వెండర్లు ద్వారా ఆన్‌లైన్ పేమెంటు జరిగితే వారికి 0.15 శాతం కమీషన్ ఇచ్చేవారు. అయితే ప్రస్తుతం ఆ స్టాంపు డ్యూటీ చెల్లింపుల బాధ్యతలను కూడా స్టాకు హోల్డింగ్ ప్రతినిధులకు ఇస్తూ ఆదేశాలు ఇవ్వటమేకాక, వారి ద్వారా ప్రభుత్వ ఖజానాకు జమ అయిన మొత్తాలకు కమీషన్‌ను 0.40 శాతంకు పెంచటం విశేషం. దీంతో స్టాకు హోల్డింగ్ ప్రతినిధులు మీరు చేసే చెల్లింపులన్నీ మాద్వారా చేయించాలని స్టాంపు వెండర్లు, డాక్యుమెంటు రైటర్ల మీద ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. దీనివల్ల ప్రభుత్వానికి కేవలం అదనంగా చెల్లించే 0.25 శాతం కమీషన్ రూపంలోనే ప్రతిరోజు కొన్ని కోట్ల రూపాయల నష్టం వాటిల్లనుంది. ఈ నేపథ్యంలో నూతన ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టిసారించి గతంలో మాదిరిగా నాణ్యమైన నాన్ జ్యుడిషియల్ స్టాంపులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పక్కా ఇళ్లు కట్టని కాంట్రాక్టర్లపై చర్యలు!

- ప్రభుత్వ నిర్ణయం తర్వాతే పెండింగ్ పనుల పూర్తి
- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ అధికారుల వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ


నెల్లూరు (జడ్పీ), జూన్ 29 : గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో పక్కా ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు ఉంటాయని గృహ నిర్మాణ శాఖ అధికారులు స్పష్టం చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన శనివారం జడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మంచినీరు, పారిశుధ్య వ్యవస్థను మరింత మెరుగుపరిచి, సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పంచాయతీ రాజ్, హౌసింగ్, వ్యవసాయ, స్త్రీ శిశు సంక్షేమం, ఆర్థిక తదితర శాఖలపై కమిటీ సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, వెంకట్రావు, మాల్యాద్రి మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో గతంలో మంజూరైన అనేక పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ పనులు ప్రారంభిస్తారా!? లేదా!? వాటి పురోగతిని వివరించాలని ప్రశ్నించారు. దీనిపై అధికారులు వివరణ ఇస్తూ పెండింగ్ పనుల పూర్తికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని, రాగానే అందుకు అనుగుణంగా వ్యవహరిస్తామని తెలిపారు. అలాగే పెండింగ్ బిల్లులు రూ.30 కోట్ల వరకు ఉన్నాయని, ఇళ్ల నిర్మాణాల్లో కొంతమేర బిల్లులు వసూలు చేసుకొని పనులు ఆపితే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇటీవల హౌసింగ్ శాఖ మంత్రి ఆదేశించారని అధికారులు తెలిపారు. అలాగే లేఅవుట్ల అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులను కోరగా ఎస్ఆర్ ఈజీఎస్ శాఖ ఆ పనులను నిర్వహించినా హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఇప్పటికే రూ.570 కోట్లు ఇవ్వడం జరిగిందని, అయితే కార్పొరేషన్‌లో నిధులు లేనందున ఇకపై తమ శాఖ బిల్లులు చెల్లించదని ప్రభుత్వానికి తెలిపామన్నారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు ఏ ఏ శాఖకు బిల్లులు చెల్లిస్తుందో చూడాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ జయలక్ష్మి, డిప్యూటీ సీఈవో చిరంజీవి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

జయహో...!



టీ20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో విశ్వవిజేతగా భారత్ నిలవడంతో అభిమానుల్లో ఆనందం పరవళ్లు తొక్కింది. ఎంతో ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో సౌతాఫ్రికాపై భారత్ గెలవడంతో జిల్లావాసులు ఆనందం వ్యక్తం చేశారు. యువత రోడ్లపైకి వచ్చి కేరింతలు కొట్టగా, ఇంకొందరు కేక్‌లు కట్ చేసింది.

'హంస'పై రామలింగేశ్వరుడి వైభోగం



విడవలూరు : రామతీర్థంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం శ్రీ కామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామి హంస వాహనంపై భక్తులకు దర్శనమి చ్చారు. తొలుత ఆలయంలో గణపతి పూజ, స్వామి వార్లకు మహన్యాస రుద్రాభిషేకాలు, కుంకు మార్చన, నివేదన, బలిహరణ పూజలు జరిగాయి. అనంతరం వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరిం చిన హంస వాహనంపై రామలింగేశ్వరుడు కామాక్షీ దేవి సమేతుడై రామ తీర్థం, వరిణి గ్రామ వీధుల్లో ఊరేగారు. మేళతాళాలు, భజనలు, నృత్యాల నడుమ ఊరేగుతూ వస్తున్న స్వామివారికి భక్తులు టెంకాయలు కొట్టి హారతు లు పట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామకృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో టెన్త్ మార్కుల జాబితాలు

నెల్లూరు (విద్య), జూన్ 29 : పదవతరగతి మార్కుల జాబితాలు www.bseap.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల లాగిన్ ద్వారా విద్యార్థుల హాల్ టికెట్ ఉపయోగించి మార్కుల జాబితాను పొందవచ్చని పేర్కొన్నారు. మార్కులు జాబితాలో ఏదైనా తప్పులు ఉంటే సరైన రికార్డులతో నేరుగా ప్రభుత్వ పరీక్షల సంచాలకులకు 6వతేదీ లోపు పంపించాలని తెలిపారు.



కంది అధిక నిల్వలపై కొరడా

చర్యలకు సిద్ధమైన జిల్లా యంత్రాంగం

పప్పు దినుసుల ధరల నియంత్రణే లక్ష్యం

నెల్లూరు (హరనాథపురం), జూన్ 29 : జిల్లాలో కంది, శనగపప్పు నిల్వలు పెంచుకొని, కృత్రిమ కొరత సృష్టిస్తూ, అధిక ధరకు విక్రయిస్తున్న వ్యాపారులపై కొరడా ఝుళిపించడానికి జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. భారత ప్రభుత్వం, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిబంధనల ప్రకారమే వ్యాపారుల వద్ద స్టాక్ నిల్వల ఉండాలి. కానీ కొందరు వ్యాపారులు పప్పు దినుసులను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గత ఆరునెలల నుంచి కందిపప్పు ధర పెరిగిపోతోందే తప్ప తగ్గడం లేదు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.175 నుంచి 190 వరకు ఉంది. ఇంత ధరపెట్టి సామాన్య ప్రజానీకం కొని తినలేని పరిస్థితి ఏర్పడింది. ధరల నియంత్రణపై అధికారులు దృష్టి సారించలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో వ్యాపారుల వద్ద నిల్వలపై దృష్టి సారించి ధరల నియంత్రణకు జిల్లా యంత్రాంగం సమాయత్తమైంది.

కంది, శనగ నిల్వల పరిమితులు

- టోకు వ్యాపారి : 200 మెట్రిక్ టన్నులు
- రిటైలర్ : 5 మెట్రిక్ టన్నులు
- పెద్ద చైన్ రిటైలర్ : 5 మెట్రిక్ టన్నులు
- డిపోలలో : 200 మెట్రిక్ టన్నులు
- మిల్లర్లు గత మూడు నెలల ఉత్పత్తి లేదా వ్యాపార స్థాపిత సామర్థ్యంతో 25 శాతం ఏది ఎక్కువైతే అది.
- దిగుమతిదారులు కస్టమ్ క్లియరెన్స్ తేదీ నుంచి 45 రోజులకు మించి దిగుమతి చేసుకున్న స్టాక్‌ను కలిగి ఉండరాదు.

అధిక నిల్వలు ఉంటే చర్యలు : జేసీ సేధు మాధవన్

కందిపప్పు, శనగపప్పు, కాబూలి శనగపప్పు స్టాక్ పరిమితులకు మించి నిల్వచేస్తే చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపా రులు తమ వద్ద నిల్వలను వినియోగదారుల వ్యవహారాల శాఖ జీఓఐ పోర్టల్ హెచ్‌టీటీపీఎస్: ఎఫ్‌సీఏఐఎస్ఎఫ్‌ఓడబ్ల్యుఈబీ.ఎన్‌ఐసీ.ఇన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. పరిమితుల కంటే ఎక్కువగా ఉంటే జులై 12వ తేదీలోగా నిర్ధేశించిన పరిమితులకు లోబడి పప్పుధాన్యాల స్టాక్ క్రమం తప్పకుండా జీఓఐ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆ తర్వాత స్టాక్ పరిమితులు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బియ్యం ధరలపై చర్యలు తీసుకుంటాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు(హరనాథపురం) : ధరల పెరుగుదలపై చర్చించడానికి ధరల పర్యవేక్షణ కమిటీతో సమావేశం ఏర్పాటు చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి డీవీ.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'భగ్గుమంటున్న బియ్యం' కథనానికి ఆయన స్పందించారు. ధరల తగ్గుదలకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 100 కేజీల సాధారణ ధాన్యం మద్దతు ధర రూ.2183, గ్రేడ్-ఏ రకం రూ.2203గా నిర్ణయించామన్నారు. ఈ ధాన్యానికి బియ్యం దిగుబడి విలువ ధర రూ.34 నుంచి రూ.35గా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. అక్రమ నిల్వల నిరోధానికి కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి శుక్రవారం వెబ్‌పోర్టల్‌లో స్టాకు వివరాలు వెల్లడించాల్సి ఉంటుందని తెలిపారు.



సమస్యలపై ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

రూ.13 కోట్ల అప్పుల్లో ఆత్మకూరు మున్సిపాలిటీ

- ఇష్టారాజ్యంగా పనులు చేసి బిల్లులు పెడతారా!?
- మున్సిపల్ బస్టాండ్ సముదాయం నిర్వహణ ఎవరిది?
- కౌన్సిల్ సమావేశంలో నిలదీసిన కౌన్సిలర్లు

ఆత్మకూరు, జూన్ 29 : 'మున్సిపల్ నిధులు పక్కదారి పడుతున్నాయి. అభివృద్ధి పేరిట ఇష్టారాజ్యంగా పనులు చేసి బిల్లుల మంజూరుకు మాత్రం మున్సిపల్ కౌన్సిల్ అజెండాలో చేరుస్తున్నారు. మున్సిపాలిటీ ఇప్పుడు రూ.13 కోట్ల అప్పుల్లో ఉంది. కౌన్సిల్ అనుమతి లేకుండా మున్సి పల్ స్థలాలను లీజుకు ఇచ్చే అధికారం ఎవరికుంది? ఏడాది క్రితం నూతనంగా నిర్మించిన మున్సిపల్ బస్టాండ్ సముదాయం ఎవరి నిర్వహణలో నడుస్తోంది. రూముల బాడుగలు ఎవరికి ఇస్తున్నారు. అన్నిటిపై ఎంక్వాయిరీ కమిటీ వేసి వాస్తవాలను ప్రజల ముందుంచాలి.' అంటూ టీడీపీ కౌన్సిలర్లతోపాటు వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్లు షేక్ గౌస్‌బాష, మాదాల శ్రీనివాసులు నాయుడు, వైసీపీ అసమ్మతి కౌన్సిలర్ కొప్పో లు రమాదేవి, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్ పలు సమస్యలపై ధ్వజమెత్తారు. మున్సిపాలిటీలో నిధులు ఇష్టారాజ్యంగా దుర్వినియోగం కావడంతోపాటు అధికారుల పనితీరు అస్తవ్యస్తంగా తయారైందని విమర్శించారు. ఆత్మకూరు నడిబొడ్డున ఉన్న పాత మున్సిపల్ బస్టాండ్ భవనాన్ని కూలదోసి రూ.4.20 కోట్లతో నూతన భవన సముదాయం నిర్మించడం హర్షదాయకమేనన్నారు. అయితే అందులో కోటి రూపాయల మేర నుడా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి ఉన్నారన్నారు. ఇప్పుడా బస్టాండ్ భవన సముదాయం ఎవరి ఆధీనంలో ఉందని నిలదీశారు. మున్సిపాలిటీకి అప్పగించారా!? అని ప్రశ్నించారు. కౌన్సిల్ అనుమతి లేకుండా మున్సిపల్ స్థలాలను లీజుకు ఇచ్చే అధికారం ఎవరికుందని నిలదీశారు. కమిషనర్ షేక్ ఫజులుల్లా మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన అన్ని అంశాలపై పూర్తి స్థాయి సమాచారం అందాల్సి ఉన్నందున సంబంధిత అధికారులు మెమోలు జారీ చేశామన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ



సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ

ఆత్మకూరు, జూన్ 29: రాష్ట్ర దేవాదాయశాఖ మంత్యులు, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపాల్టీ పరిధిలో అన్ని ప్రాంతాలకు ప్రతిరోజూ తాగునీటిని సరఫరా చేస్తుడటం హర్షదాయకమని పలువురు కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేశారు. అయితే తాగునీటి సరఫరా సమయాన్ని పెంచి ప్రజలందరికీ నీరు సరఫరా జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. స్థానిక ము న్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా మాట్లాడారు. తాగునీటి సరఫరా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కౌన్సిలర్లు లేవనెత్తిన అన్ని అంశాలపై ఆనం రామ నారాయణ రెడ్డికి సమాచారం అందజేశామన్నారు. పలు అంశాలపై పూర్తిస్థాయి సమాచారం అందాల్సి ఉన్నందున సంబంధిత అధికారులు మెమోలు జారీ చేశామన్నారు. చివరిగా మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంక టరమణమ్మ మాట్లాడారు. అజెండాలో పొందుపరిచిన 25అం శాలలో ఆత్మకూరులో నారంపేట వద్ద ఉన్న పారిశ్రామిక వాడకు నీటి తరలింపుకు పైపులైను ఏర్పాటు అంశాన్ని రద్దు చేసి, మిగతా అంశాలను వాయిదా వేశామన్నారు. వాయిదాపడిన అంశాలపై తదుపరి సమా వేశంలో చర్చించి కౌన్సిల్ అనుమతి పొందితే అమలు చేస్తా మని తెలిపారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ సాంబశివ చారిట బుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమే శ్వర రెడ్డి ఔదార్యంతో మున్సిపల్ బస్టాండ్‌లో తాగునీరు, మజ్జిగ చలివేం ద్రం ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన మున్సిపల్ మేనేజర్ మోహన కుమారిని కౌన్సిలర్లు, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సి పల్ ఏఈలు జూపల్లి ప్రసాద్, వరలక్ష్మిలు పాల్గొన్నారు.

ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ

అనంతసాగరం, జూన్ 29: జులై 1న లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీవో తాజ్ ముస్రూర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు ఇంటి వద్దే అందుబాటులో ఉండాలని కోరారు. సచివాలయాల్లో పనిచేసే అన్ని విభాగాల సిబ్బందితో ఈ నగదు పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు.

ఇసుక రీచ్ రహదారికి గండి



ఇసుక రీచ్ బాటకు గండి కొట్టుతున్న దృశ్యం

సంగం, జూన్ 29: వెంగారెడ్డిపాళెం వద్ద పెన్నానది ఇసుక రీచ్‌లోకి వెళ్లే రహదారికి శనివారం రెవెన్యూ అధికారులు గండి కొట్టించారు. కొందరు అక్రమార్కులు రాత్రివేళ ఇసుక అక్రమంగా తరలిస్తుండటంతో తహసీల్దారు ఆదేశాల మేరకు వీఆర్వో శోభన్‌బాబు కందకాలు (గండి) ఏర్పాటు చేశారు. దీంతో ఇసుక అక్రమ తరలింపుకు అడ్డుకట్ట వేసినట్లయ్యింది.

గండిపాళెం వాసికి గోల్డన్ నంది అవార్డు

ఉదయగిరి, జూన్ 29: గండిపాళెం జీవీ గిరీష్ కుమార్ హైదరాబాదులో మక్ గ్లోబల్ ఫౌండేషన్ నిర్వహించిన గ్లోబల్ అవార్డ్స్ సెలబ్రేషన్స్-2024లో గోల్డన్ నంది అవార్డు శనివారం అందుకున్నారు. ప్రకృతి నివాస్ పేరుతో జిల్లాలో పేద విద్యార్థులకు చేసిన సేవలను గుర్తించి సంస్థ ఆయనకు నంది అవార్డును అందజేసింది.

విద్యా సామగ్రి పంపిణీ



వరికుంటపాడు, జూన్ 29: అలివేలుమంగాపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం దాతలు తూర్పుబోయమడగలకు చెందిన టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాదిండ్ల పెదనారయ్య, బూత్ కమిటీ కన్వీనర్ పావులూరి పుల్లయ్య, యువనాయకులు ఏనుగంటి నరేంద్రలు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



పుష్పాలంకరణలో మానసాదేవి అమ్మవారు



ఉలవవారిపాళెంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఉదయగిరి రూరల్, జూన్ 16: సున్నంవారిచింతల కోదండ రామస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం సీతారాముల కల్యాణా న్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు స్వామివారిని ప్రత్యే కంగా అలంకరించి మంత్రోచ్చర ణలతో శాస్త్రోక్తంగా కల్యాణం చే పట్టారు. గ్రామంతో పాటు పరి సర గ్రామాల ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేక వాహనంలో పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

దుత్తలూరు: నర్రవాడ పంచాయతీలోని ఉలవారిపాళెం కోదండరామస్వామి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణంను వైభవంగా నిర్వహించారు. రాత్రికి గ్రామోత్సవాన్ని చేపట్టారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు అంకాళమ్మకు పొంగళ్లు

నర్రవాడలో ఆదివారం మేకపాటి వంశీయుల ఇలవేల్పు అంకాలమ్మకు పాలపొంగళ్లు నిర్వహిస్నుట్లు కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొంటారన్నారు.

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్ల మానసాదేవి అమ్మవారు శనివారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారిని మేళతాళాలు, బాణాసంచా పేలుస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. అంతకుముందు చండీ, నవగ్రహ హోమాలు, మహానివేదన తదితర పూజలు నిర్వహించారు.

నేటినుంచి మహోత్సవాలు

గువ్వాడి గంగాభవాని కొలుపుల మహోత్సవాలు ఆదివారం నుంచి నిర్వ హించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజు అమ్మవారికి జల్దిస్నానం, గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు.

నందిగుంటలో మాతమ్మ తల్లి తిరుణాల ప్రారంభం

వింజమూరు: నందిగుంట మాతమ్మ తల్లి తిరుణాల ప్రారంభం అయ్యింది. మండల ఎస్సీ సెల్ కన్వీనర్ గంగపట్ల వెంగయ్య సతీమణి మహేశ్వరిలు ప్రత్యేక పూజలు చేశారు.

పింఛన్ల పంపిణీలో అలసత్వం చేస్తే చర్యలు



సిబ్బందికి సూచనలిస్తున్న ఈవోపీఆర్డీ భార్గవి

సీతారామపురం, జూన్ 29: పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఈవోపీఆర్డీ భార్గవి హెచ్చరించారు. శనివారం ఆమె సీతారామపురం బిట్-1 సచివాల యంలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. జూలై 1వ తేదీ ఉదయం 6గంటల నుంచి పింఛన్ పంపిణీ సజావుగా జరగాలని, సిబ్బందికి కేటాయించిన పింఛన్‌దారుల ఇంటి వద్ద కు వెళ్లి నగదును అందజేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాంనాథ్‌రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ రమేష్ చంద్ర పాల్గొన్నారు.

పరిశుభ్రతకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉదయగిరి, జూన్ 29: జీ.చెరువుపల్లి పంచాయతీలోని సంజీవరాజుపల్లిలో అధికారులు శనివారం మురుగునీటి నిల్వలను తొలగించి పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో 'కొరవడిన పారిశుధ్యం' అనే కథ నంపై కార్యదర్శి కరీముల్లా స్పం దించారు. తన సిబ్బందితో వెళ్లి మురుగునీరు పారేలా చర్యలు చేపట్టి బ్లీచింగ్ చల్లించారు.

వెంగమాంబ సన్నిధిలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



ఎమ్మెల్యేను సన్మానించిన టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 29: మండలంలోని నర్రవాడ వెలసిన శ్రీవెంగమాంబ పేరంటాలమ్మను శనివారం తెలంగాణ రాష్ట్రం జడ్చర్ల నియోజక వర్గ శాసనసభ్యులు అనిరుధ్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎన్నికల్లో విజయం సాధిస్తే అమ్మవారిని దర్శించుకొంటానని మొక్కుకొన్నానని, ఆ మొక్కు తీర్చుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. ఉలవారిపాళెం వెంగమాంబ సేవా సమితికి నిత్యాన్నదానాకి రూ.లక్ష విరాళం అందజేశారు. అనంతరం ఆయన్ను టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మాదాల రామ చంద్ర, మాజీ సర్పంచ్ మల్లంపాటి గురవయ్యనాయుడు, నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, మాదాల తిమ్మయ్య, చిన తిమ్మయ్య, దుశ్యంత్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, వంశీరెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యా ప్రవేశ కార్యక్రమంపై అవగాహన

ఉదయగిరి రూరల్, జూన్ 29: స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు విద్యాప్రవేశ కార్యక్రమంపై శనివారం ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పెంచడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. జులై 25వ తేదీలోపు ప్రవేశాలను పూర్తి చేయాలన్నారు. ప్రవేశ వివరాలను దీక్ష యాప్‌లో నమోదు చేయించాలని సూచించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



జమీర్‌ను సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఉదయగిరి రూరల్, జూన్ 29: స్థానిక బీసీ కాలనీలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ జమీర్ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జమీర్‌ను ఎంఈవో షేక్ మస్తాన్‌వలి, తోటి ఉపాధ్యాయులు ఆయన్ను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగయ్య పాల్గొన్నారు.

కేశవులుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న పోలీసులు

కలువాయి, జూన్ 29: బలిమెల రిజర్వాయర్ ఘటనలో అసువులుబాసిన కలువాయి గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ అనకర్ల కేశవులు వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక బస్టాండు సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద పోలీసులు, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ అయ్యప్ప, కేశవులు తల్లిదండ్రులు చెన్నయ్య, పెంచలమ్మ పాల్గొన్నారు.





చిన్ననోట్ల కొరత.. చిల్లర కష్టాలు..

ఉదయగిరి, జూన్ 29: గత కొంతకాలంగా చిన్న నోట్ల కొరత ఏర్పడింది. చిల్లర కోసం సామాన్య ప్రజలు, వ్యాపారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. బస్సుల్లో ప్రయాణికులు కండక్టర్ల మధ్య చిల్లర కోసం గొడవలు చేసుకుంటున్నారు. చిన్న నోట్ల కోసం పడే కష్టాలు అనీఇన్నీ కావు. ఫోన్ పే కొందరికి ఉన్నా కొన్నిసార్లు సిగ్నల్ అందకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. ఫోన్‌పే, గూగు ల్ పే లాంటి వాటిని కొన్ని ప్రాంతాల్లో కొన్ని దుకా ణాల్లో అను మతించకపోవడంతో ఖచ్చితంగా డబ్బులు ఇవ్వాల్సి వస్తుంది. అయితే దుకాణదారుడు వద్ద వినియోగదారుడు సరిపడినంత చిల్లర లేకపోవడంతో సరుకులు ఇవ్వకుండా వెనక్కు పంపే సందర్భాలున్నాయి. రూ.100, రూ.50, రూ.20, రూ.10 నోట్లు అందడం కష్టమైంది. ప్రతిఒక్కరూ రూ.500లు ఇస్తుండడంతో చిల్లర్లు లేక వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు.



పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

వలేటివారిపాలెం: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం చేయవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని అత్తింటివారిపాలెంలో శనివారం డెంగ్యూ, మలేరియా, డయేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలం ఆక్రమణ

- వైసీపీ వర్గీయుల ముమ్మర ప్రయత్నాలు
- అధికారులను లెక్కచేయని వైనం
- సర్పంచ్‌పై తిరగుబాటు.. వారించిన గ్రామస్థులు



సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జ్యోతి, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర

అల్లూరు, జూన్ 29: మండలంలోని పడమర గోగులపల్లిలో శనివారం పంచాయతీ స్థలాన్ని ఆక్రమించేందుకు వైసీపీ వర్గీయలు ముమ్మర ప్రయత్నాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీఓ జ్యోతి, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్రలు సంఘటనా స్థలానికి వెళ్లి సదరు ఆక్రమణదారులను అడ్డుకున్నా వారిని సైతం లెక్కచేయకుండా వ్యవహరించారు. దీన్ని గమనించిన స్థానికులు ఆక్రమణదారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణకు పాల్పడడమే కాకుండా అధికారులతో వాగ్వివాదానికి దిగుతున్నారని వారిని వారించారు. సర్పంచ్ ఆట తిరుమల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఓవర్ హెడ్ ట్యాంక్‌లోని వృథా నీరు పక్కనే ఉన్న వాగులోకి వెళ్లేలా ఏర్పాటు చేసి ఉన్న స్థలం పంచాయతీది. ఈ స్థలం తమదని కొంతమంది వైసీపీ వర్గీయులు గత కొన్ని సంవత్సరాల నుండి ఇబ్బంది పెడుతూ వస్తున్నారు. ఈ క్రమంలో సీపీ రోడ్డును పగులగొట్టి పైప్‌లైన్ ఏర్పాటు చేసి వృథా నీటిని పంపించి సదరు స్థలాన్ని ఆక్రమించుకునే ప్రయత్నాన్ని చేపట్టారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన ప్రతిసారీ వారు సర్పంచ్‌పై వాగ్వివాదానికి దిగుతున్నారు. అనంతరం సర్పంచ్ మాట్లాడారు. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో ఈ గ్రామం టీడీపీ సర్పంచ్ గెలుపొందడంతో అప్పటి నుండి ఏ అధికారి, ఏ నాయకుడూ పంచాయతీ నిర్వహణకు సహకరించకపోగా అడ్డుకట్ట వేసేవారు. కనీసం పంచాయతీ కార్యదర్శి కూడా స్పందించకుడా తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని సర్పంచ్ వాపోయారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎంపీడీఓ జ్యోతి, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్రలు సంఘటనా స్థలాన్ని పరిశీలనకు వచ్చారని తెలిపారు. ఆక్రమణదారులను ప్రశ్నించగా అధికారులను సైతం వారు లెక్కచేయకుండా వ్యవహరించడంతో వారు వెనుతిరిగారని చెప్పారు. అధికారులు సైతం వైసీపీ వర్గీయుల ధాటికి తట్టుకోలేకపోతున్నారని ఇంకా వైసీపీ నాయకుల మాటలను తూచా తప్పకుండా పాటిస్తున్నారని, సమస్యలను పరిష్కరించకుండా అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్న అలాంటి వారి మాటలను పట్టించుకోకుండా సమస్యను పరిష్కరించాలని స్థానికులు చెబుతున్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఇంటూరి



కందుకూరు, జూన్ 29: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఉండవల్లిలోని ఆయన నివాసంలో శనివారం సాయంత్రం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం కోసం సలహాలు తీసుకున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను, తక్షణం చేపట్టాల్సిన వివిధ పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

డ్వామా అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

కందుకూరు, జూన్ 29: నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం అమలుతీరుపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం డ్వామా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు శాలువాతో ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధి హామీ పథకానికి సంబంధించి గతంలో చేసిన పనులు, పురోగతిని ఈ సందర్భంగా ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాదిలో చేపట్టబోయే పనుల ప్రతిపాదనలను మండలాల వారీగా అధికారులు ఆయనకు వివరించారు. గత ప్రభుత్వంలో జలకళ ద్వారా నియోజకవర్గం మొత్తంమీద 430 బోర్లు వేయగా కేవలం ఐదు బోర్లుకు మాత్రమే మోటార్లు బిగించటం జరిగిందని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇకముందు చేపట్టబోయే పనుల్లో రైతులకు ఉపయోగపడే వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీడీ మృదుల, ఏపీఓలు, ఈసీలు, టీఏలు పాల్గొన్నారు.

వీరబ్రహ్మం కుటుంబానికి ఎమ్మెల్యే కాకర్ల పరామర్శ



వీరబ్రహ్మం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కాకర్ల

కొండాపురం, జూన్ 29: శెట్టిపాలెం పంచాయతీలోని తూర్పుజంగాలపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు గూడ్లూరు వీరబ్రహ్మం రెండు రోజుల క్రితం గుండెపోటుతో హఠాత్తుగా మరణించాడు విషయం తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యంచెప్పి పార్టీ తరపున అన్ని విధాలుగా ఆదు కుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల టీడీపీ నాయకులు ఉన్నారు.

సచివాలయంలో పీఎం, సీఎం చిత్రపటాల ఏర్పాటు



మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు దిష్టితీస్తున్న టీడీపీ నేతలు

జలదంకి, జూన్29: కేశవరం పంచాయతీలోని తిమ్మసముద్రం గ్రామ సచివాలయంలో పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్రపటాలను ఎన్డీఏ కూటమి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్రపటాలతోగ్రామంలో ప్రదర్శన వచ్చి గుమ్మడికాయతో దిష్టితీసి సచివాయంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తల్లపనేని మధుసూదన రావు, కంచర్ల వినోద్‌నాయుడు, గద్దె బ్రహ్మయ్యయాదవ్, చిన్నబ్బయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న కమిషనర్

కావలి, జూన్ 29: పారిశుధ్య మెరుగుదలకు తీసుకునే చర్యలలో భాగంగా మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ శనివారం పట్టణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తెల్లవారుజామున రెండోడివిజన్‌లో పారిశుధ్య కార్మికుల మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేసి అక్కడకు ఎంత మంది కార్మికులు ఉండాలి.. ఎంత మంది వచ్చారో తనిఖీ చేశారు. అలాగే అక్కడే మరమ్మతులకు గురైన మున్సిపల్ చెత్త తరలించే వాహనంతో పాటు మరికొన్ని పాడై పోయిన వాహనాలను పరిశీలించి వాటి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంపోస్టు యార్డును పరిశీలించారు. వెంగాయగారిపాలెం రోడ్డులో ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను వెంటనే ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు.

'నేను బడికిపోతా'పై హెచ్‌ఎంలతో సమావేశం

కొండాపురం: నేను బడికిపోతా కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం ఎంఈవో-2 ఆనందరావు సమావేశమయ్యారు. మండల విద్యావనరుల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడిఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమాలపై ప్రతి ప్రధానోపాధ్యాయుడు అవగాహన కలిగి తమ పరిధిలోని పిల్లలను గుర్తించాలన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

కావలి, జూన్ 29: డాక్టర్స్‌డేను పురస్కరించుకుని పలు స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహంతో ఇండియన్‌మెడికల్ అసోసియేషన్ కావలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కావలి పట్టణంలో మూడుచోట్ల మెగా రక్తదానశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ కావలి శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే. సుబ్బారావు, గోపిలు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ముసునూరు ఐఎంఏ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని రెడ్‌క్రాస్ భవన ఆవరణలో క్రిష్టియన్‌పేట మూడోలైన్‌లోని గీతాంజలీ జూనియర్ కళాశాల ఆవరణలో మూడు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7గంటలవరకు ఆసక్తి ఉన్న రక్తదానం చేయవచ్చన్నారు.

ప్రమాదకర చెట్టు కొమ్మలు తొలగింపు

కావలి రూరల్, జూన్ 29: స్థానిక వాయునందన ప్రెస్‌వీధిలోని వినాయకుని గుడి సమీపంలో ఎత్తుగా పెరిగి ప్రమాదకరంగా ఉన్న చెట్టు కొమ్మలను శనివారం స్థానికులు క్రేన్ సహాయంతో తొలగింపు చర్యలు చేపట్టారు. చెట్టుకు సమీపంలో ట్రాన్స్‌ఫారం కూడా ఉండటంతో రానున్న వర్షాలకు చెట్టు కూలినట్లయితే ప్రమాదం సంభవిస్తుందని స్థానికులు భావించారు. చెట్టు కొమ్మలు కొట్టేటప్పుడు ఇళ్లు, విద్యుత్ తీగలపై పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని విద్యుత్ శాఖ అధికారులు పట్టణంలోని పెద్ద వృక్షాల తలకొమ్మలు కొట్టించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీస్ భద్రత మధ్య పింఛన్ నగదు డ్రా

కావలి, జూన్ 29: పట్టణంలోని 10,260 మంది పింఛదారులకు సోమవారం అందజేసే నగదును శనివారం కావలి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి నుంచి డ్రా చేశారు. పెంచిన వెయ్యి రూపాయలతో జూలై నెల నుంచి ఇచ్చే రూ.4వేలు కాక అదనంగా ఏప్రిల్ నుంచి ఇస్తానని సీఎం చంద్రబాబు చెప్పిన మాట ప్రకారం అదొక రూ.3 వేలు మొత్తం రూ.7వేలు ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇలా పట్టణంలోనే సుమారు రూ.7.18కోట్ల నగదు అవసరం అవుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్‌బీఐ బ్యాంకు నుంచి శనివారం నగదును డ్రా చేశారు. ఆ నగదును కావలి ఒకటో పట్టణ సీఐ రాజేష్, వారి సిబ్బంది భద్రతతో సచివాలయాల వారీగా సచివాలయ సిబ్బందికి అందజేశారు. సోమవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డితో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నేతల సమక్షంలో పింఛన్‌దారుల ఇళ్ల వద్దకు వెళ్లి నగదును అందచేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

1న ఇంటివద్దే పింఛన్ల పంపిణీ

లింగసముద్రం, జూన్ 29: మండలంలోని అన్ని రకాల పింఛన్ల లబ్ధిదారులకు జూలై 1వ తేదీన ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీవో యు శేషుబాబు శనివారం తెలిపారు. పింఛన్ల పంపిణీ రెండురోజుల్లో పూర్తిచేయడం జరుగుతుందన్నారు. 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 90 శాతం పంపిణీ చేయడం జరుగుతుందని, మిగిలిన పింఛన్లను 2వ తేదీ పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. లబ్ధిదారులు ఈ రెండు రోజులు తప్పనిసరిగా ఇళ్లవద్ద ఉండి పింఛన్లు తీసుకోవాలని ఆయన కోరారు.

వలేటివారిపాలెం: వచ్చేనెల 1వ తేదీన ఇళ్లవద్దకే సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది వచ్చి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు సచివాలయాల వద్దకు వెళ్లనవసరం లేదని తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ. 10,98,753

వలేటివారిపాలెం, జూన్ 29 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 10,98,753 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ. 6,800, కుంకుమార్చన ద్వారా రూ. 30,080, వివాహముల ద్వారా రూ. 1000, తలనీలాలు ద్వారా రూ. 490525, వాహన పూజలు ద్వారా రూ. 6,580, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3,37,200, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 900, రూముఅద్దెలు ద్వారా రూ. 33,780, కవర్లు ద్వారా రూ. 7,200, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,10,575, అన్నదానం ద్వారా రూ. 4,03,113, విరాళముల ద్వారా రూ. 12 వేలు ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలియజేశారు.

బీఎమ్మెస్‌లో విలీనమైన వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయిాస్ యూనియన్

కావలి టౌన్, జూన్29: వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ బీఎమ్మెస్ యూనియన్‌లో విలీనమైంది. శనివారం సాయిక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బీఎమ్మెస్ రాష్ట్ర అధ్యక్షుడు సీ.రామగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టీ సాంబశివరావులు పాల్గొన్నారు. కోటేశ్వరరావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కావలి, ఆత్మకూరు డివిజన్లకు చెందిన 100మంది కార్మికులు బీఎమ్మెస్ సభ్యత్వం తీసుకున్నారు.

రాళ్లపాడు గేట్లకు గ్రీజు పెట్టించిన అధికారులు

లింగసముద్రం, జూన్ 29: రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసి రాళ్లపాడు ప్రాజెక్టులోకి వచ్చే వరద నీటిని ప్రాజెక్టు గేట్ల ద్వారా మన్నేరుకు విడుదల చేసేందుకు డీఈ పి లక్ష్మీనారాయణ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు పాత స్పిల్‌వే గేట్ల చైన్లకు గ్రీజు పెట్టించారు. కొత్త స్పిల్‌వేలోని రేడియల్ గేట్ల రోప్స్‌కు కాడ్మియమ్ కాంపౌండ్ పెట్టించారు. దీనివలన వరదల సమయంలో గేట్లు సులువుగా పైకి లేస్తాయని డీఈ లక్ష్మీనారాయణ చెప్పారు. అలాగే ప్రాజెక్టు పాత స్పిల్‌వే గేట్ల వద్ద ఉన్న నీటిమట్టం తెలిపే గేజ్‌కు కూడా పెయింట్ వేయించి, నీటిమట్టం తెలిపే అంకెలను కూడా వేయించారు.

పోలేరమ్మకు పూజలు

లింగసముద్రం, జూన్ 29 : మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో పోలేరమ్మ ఆలయం 3వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్థులు శనివారం అమ్మవారికి ఘనంగా పూజలు చేశారు. అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామంలో అమ్మవారి బండ్లతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి పొంగళ్లు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.